
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
ఆదివారం 24, నవంబరు 2024

ఆయన కొనకనమిట్ల మండలంలోని గొట్లగట్టులో నెట్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. వైసీపీ సానుభూతిపరుడైన అతను గత ప్రభుత్వంలో వలంటీర్‌గా పనిచేశాడు. ఆ సమయంలో అక్రమార్జన కోసం అడ్డదారి తొక్కాడు. అధికారం అండతో విచ్చలవిడిగా నకిలీ ధ్రువీకరణ పత్రాలు తయారు చేశాడు. రైతులకు అవసరమైన 1బీ, అడంగళ్లతోపాటు బర్త్, డెత్, సదరం, ఇతర పలు రకాల సేవలకు సంబంధించి నకిలీ పత్రాలు పెద్ద ఎత్తున సృష్టించాడు. ఒక్కో సర్టిఫికెట్‌కు ధర నిర్ణయించి అమ్ముకొని భారీగా సొమ్ము చేసుకున్నాడు. ఇతని వద్ద పొలాలకు సంబంధించిన పత్రాలు తీసుకున్న కొందరు రైతులు వాటిని బ్యాంకుల్లో పెట్టి రుణాలు పొందారు. నాలుగేళ్లుగా నడిచిన ఈ బాగోతం ఓ రైతు ఫిర్యాదుతో రెండు నెలల క్రితం వెలుగులోకి వచ్చింది. కేసు నమోదు చేసిన పోలీసులు లోతుగా విచారణ చేపట్టకుండా మమ అనిపించారు. రెవెన్యూ అధికారులు సైతం మిన్నకుండిపోయారు. ఈ విషయాన్నంతా గోప్యంగా ఉంచారు. భారీ మొత్తంలో ముడుపులు ముట్టడం వల్లనే ఇలా కేసును నీరుగార్చారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



- గొట్లగట్టులో విచ్చలవిడిగా సర్టిఫికెట్ల తయారీ
- ఓ నెట్ సెంటర్ కేంద్రంగా నాలుగేళ్లు సాగిన వ్యవహారం
- అంతా తానై వ్యవహరించిన నిర్వాహకుడు
- ఆయన గత వైసీపీ ప్రభుత్వంలో వలంటీర్
- రైతులకు డూప్లికేట్ 1బీ, అడంగల్ అంటగట్టిన వైనం
- వాటితో బ్యాంకుల్లో రుణాలు పొందిన కొందరు
- పెద్దఎత్తున బర్త్, డెత్, సదరం సర్టిఫికెట్లు కూడా..
- సాధారణ కేసుతో సరిపుచ్చిన పోలీసులు

‘నకిలీల’ కేసు నీరుగార్చారు!

మార్కాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కొనకనమిట్ల మండలంలో నకిలీ ధ్రువపత్రాలతో బ్యాంకులను, ప్రభుత్వ కార్యాలయాలను బురిడీ కొట్టించిన కేసులో అధికార యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరించినట్లు తేటతెల్లమవుతోంది. బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో కఠినంగా ఉండాల్సిన పోలీసు, రెవెన్యూ అధికారులు తూతూమంత్రపు కేసులతో మమ అనిపించినట్లు అవగతమవుతోంది. లోతుగా విచారించి అక్రమాల స్థాయిని నిర్ధారించేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. యంత్రాంగం నిర్లక్ష్యపు వైఖరితో నకిలీ ధ్రువపత్రాలు సృష్టించిన వైసీపీ సానుభూతిపరుడు ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్నట్లు సమాచారం.

ఏం జరిగిందంటే..

మండలంలోని గొట్లగట్టు గ్రామంలో వైసీపీ సానుభూతిపరుడైన ఓవ్యక్తి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్‌గా పనిచేశాడు. అతనికి అదే గ్రామంలో కంప్యూటర్ నెట్ సెంటర్ ఉంది. పలు ధ్రువీకరణ పత్రాల జెరాక్స్‌లు, రెవెన్యూ పత్రాలకు సంబంధించిన నకళ్లను అవసరార్థులకు ఆయా సైట్‌ల నుంచి డౌన్‌లోడ్ చేసి ఇస్తుండేవాడు. ఈ క్రమంలో కొందరు రైతులు వచ్చినప్పుడు వారి భూములు వెదికితే

మిగతా 6వ పేజీలో

ఓటర్ల జాబితా సవరణకు ప్రత్యేక డ్రైవ్



సంతనూతలపాడు జడ్పీ స్కూల్లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

- జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో నిర్వహణ
- సంతనూతలపాడులో పరిశీలించిన కలెక్టర్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా శనివారం జిల్లావ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ బీఎల్వోలు అందుబాటులో ఉన్నారు. కొత్తగా ఓటు నమోదుతోపాటు ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మండల కేంద్రమైన సంతనూతలపాడులోని జిల్లా పరిషత్ హైస్కూల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. బీఎల్వోలతో మాట్లాడారు. ఓటర్ల జాబితాలో కొత్తగా పేరు నమోదు, తొలగింపు, అడ్రస్ మార్పు కోసం వచ్చిన దరఖాస్తులు, వాటిని పరిష్కరిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఈఆర్వో వరకుమార్ తదితరులు ఉన్నారు.

లైంగిక వేధింపుల చట్టం పటిష్టంగా అమలు

7లో

కాటేసిన కరెంటు

విద్యుదాఘాతంతో రైతు మృతి

కంభం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని ఎల్.కోటలో శనివారం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన తాటికొండ ప్రసాద్ (45) తన రెండు ఎకరాల భూమిలో వరి సాగు చేశాడు. శనివారం నీరు పెట్టేందుకు పొలానికి వెళ్లాడు. ఆ సమయంలో అక్కడ తెగి పడి ఉన్న విద్యుత్ తీగ తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. రైతు ప్రసాద్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.



రైతు ప్రసాద్ (ఫైల్)



అరుదైన కండరాల వ్యాధితో బాధపడుతూ వీల్‌చైర్‌కే పరిమితమైన అన్నదమ్ములు

వెన్నును మెలిపెట్టి.. కండరాలను కట్టేసి..

- ఇద్దరు అన్నదమ్ములను జీవచ్ఛవాలుగా చేసిన రాకాసి వ్యాధి
- పదేళ్లుగా ఒకరు, ఏడాదిన్నరగా మరొకరు పోరాటం
- ఇద్దరూ వీల్‌చైర్‌కే పరిమితం
- పసిబిడ్డల్లా సాకుతున్న నిరుపేద తల్లిదండ్రులు
- వైద్యం కోసం ఆస్తి అమ్మి, అప్పులు చేసి రూ.15 లక్షలు ఖర్చు
- రెస్డీఫ్లామ్ అనే వ్యాక్సిన్‌తోనే వ్యాధి నయం
- ఇద్దరికీ కలిపి వ్యాక్సిన్ ఖర్చు రూ.70 లక్షలు
- ప్రభుత్వం చొరవ చూపితే ఉచితంగా దొరికే అవకాశం
- కాపాడాలని అమ్మానాన్నల విన్నపం

7



మెప్మా ఆర్పీలు, సభ్యులతో మాట్లాడుతున్న అధికారులు

మెప్మాలో బోగస్‌లకు చెక్..!

- ఆర్పీలకు నమోదు బాధ్యతలు
- ప్రతి సభ్యురాలికీ పథకాలు చేర్చడమే లక్ష్యం
- యాప్‌లో పొదుపు మహిళల వివరాలు

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మెప్మాలో బోగస్ గ్రూపులు, అక్రమాలకు చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం సరికొత్త విధానాన్ని అమలు చేస్తోంది. ప్రతి సభ్యురాలికీ ప్రభుత్వ పథకాలు అందాలన్న లక్ష్యంతో ముందడుగు వేస్తోంది. అందుకోసం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. అందులో గ్రూపు సభ్యుల వివరాలన్నీ పొందుపరచాలని ఆదేశించింది. దీంతో అధికారులు ఆ పనిలో నిమగ్నమయ్యారు.

గత వైసీపీ పాలనలో ఒంగోలులో కొందరు ఆర్పీలు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. నకిలీ గ్రూపులను సృష్టించారు. వాటి ద్వారా బ్యాంకులను బురిడీ కొట్టించి రూ.కోట్లలో రుణాలు దోచుకున్నారు. ఈ బాగోతాన్ని ‘ఆంధ్రజ్యోతి’ వెలుగులోకి తెచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని పట్టణ పొదుపు సంఘాల్లో ఇదేతరహా వ్యవహారాలు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం సరికొత్త విధానం అమలుకు శ్రీకారం చుట్టింది. ఎస్‌హెచ్‌జీ ప్రొఫైల్ పేరుతో తీసుకొస్తున్న ఈ యాప్‌పై ఇప్పటికే సిబ్బందికి శిక్షణ కూడా పూర్తయ్యింది. ఈ విధానం వలన ఆయా సంఘాల్లో సభ్యులంతా ఉన్నారా? లేదా? అన్న విషయం తేటతెల్లమవుతుంది. అలాగే ఒకే సభ్యురాలు రెండు సంఘాల్లో ఉంటే వెంటనే గుర్తించవచ్చు. కొన్ని సంఘాల్లో సభ్యులు ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉంటుండగా వారి పేర్లతో ఇంకొందరు ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు పొందుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వేర్వేరు గ్రూపుల్లో సభ్యులతో నకిలీ సంఘాలను ఏర్పాటు చేసి రుణాలు పొందారు. ప్రత్యేక యాప్‌తో ఇలాంటి అక్రమాలకు తెరపడనుంది.

పొదుపు మహిళలకు మరింత లబ్ధి

స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇకపై ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌ను ప్రామాణికంగా తీసుకొని పథకాలను అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. మొత్తం సభ్యుల్లో ఎంతమంది

మిగతా 6వ పేజీలో

- పలుచోట్ల ప్రారంభించిన మునిసిపల్ అధికారులు
- ప్రధాన వీధిలో తొలగింపునకు సమయం కోరిన చైర్మన్
- వన్ వే ప్రారంభించిన పోలీసులు



రీడింగ్ రూమ్ వద్ద మురికి కాలువపై ఉన్న ఆక్రమణలను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

ఆక్రమణల తొలగింపు మళ్లీ మొదలు

మార్కాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం మునిసిపాలిటీలో ఆక్రమణల తొలగింపును మునిసిపల్ అధికారులు మళ్లీ ప్రారంభించారు. పట్టణంలోని పలుచోట్ల శనివారం వేకువజాము నుంచి మురుగు కాలువలపై ఉన్న నిర్మాణాలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. ఆ సమయంలో పోగైన వ్యర్థాలను కూడా ఎప్పటికప్పుడు ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డుకు తరలించారు. రీడింగ్ రూం వద్ద నుంచి ప్రారంభమైన తొలగింపు కార్యక్రమం హర్యానా జిలేబీ దుకాణం వరకూ కొనసాగింది. మునిసిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాల మురళీకృష్ణ అక్కడకు చేరుకున్నారు. మెయిన్ బజార్‌లో భవన యజమానులే ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగిస్తున్నారని వారికి కొంత సమయం ఇవ్వాలని ఆయన కోరారు. ముఖ్యంగా కొన్ని పాత నిర్మాణాలు ఉన్నందున ఎక్స్‌కవేటర్, యంత్రాలు తగిలితే అవి కూలిపోయే ప్రమాదం ఉందని మునిపల్ కమిషనర్ నారాయణరావు, సీఐ సుబ్బారావులకు తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన ఆక్రమణలను తొలగించుకోవాలని చైర్మన్ కృష్ణకు కమిషనర్ తెలిపి ప్రధాన వీధిలో యంత్రాలతో తొలగింపు ప్రక్రియను నిలిపివేశారు. స్థానిక అయ్యప్పస్వామి దేవస్థానం వెనుక వైపున ఉన్న దుకాణాలను కూడా పూర్తిస్థాయిలో తొలగించాలని మున్సిపల్ అధికారులు నిర్ణయించారు.

విశ్వేశ్వర థియేటర్ నుంచి రీడింగ్ రూం వరకు వన్ వే

ఆక్రమణల తొలగింపు ప్రక్రియ వేగంగా కొనసాగుతుండగా వన్‌వేను కూడా పోలీసు శాఖ శనివారం నుంచి ప్రారంభించింది. ఇప్పటి వరకు గడియార స్తంభం నుంచి దోర్నాల బస్టాండ్ మీదుగా సెవన్‌హిల్స్ వరకు ఇరువైపులా వాహనాలు తిరిగేవి. ప్రస్తుతం గడియార స్తంభం కూడలిలో, చెన్నకేశవస్వామి, అయ్యప్పస్వామి దేవస్థానాల వెనుకవైపు ప్రాంతాలలో పూలు, పండ్లు, ఆకులు అమ్ముకునే దుకాణాలు

మిగతా 6వ పేజీలో

కొత్త కార్డులు.. సాంకేతిక హంగులు

- త్వరలో అందజేసే అవకాశం
- ప్రజా పంపిణీలో పారదర్శకతకు కూటమి ప్రభుత్వం చర్యలు

సంతనూతలపాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రక్షాళన, సరుకుల అందజేతలో పారదర్శకతకు కూటమి సర్కారు చర్యలు తీసుకుంటోంది. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఆహారభద్రత చట్టానికి తూట్లు పొడిచింది. పీడీఎస్ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. ప్రచార యావతో కార్డులపై పార్టీ రంగులు, అధినేత బొమ్మ ముద్రించి పంపిణీ చేసింది. కూటమి ప్రభుత్వం వాటన్నింటినీ మార్చనుంది. సరికొత్త డిజైన్లతో కార్డులు ముద్రించనుంది. అదేసమయంలో సాంకేతికతను జోడిస్తోంది. కార్డుమీద క్యూఆర్ కోడ్ కూడా ముద్రించనున్నట్లు తెలుస్తోంది. దీని వలన కార్డుదారులకు సరుకుల పంపిణీ వేగవంతం కానుంది. అదేసమయంలో అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని అధికారులు అంటున్నారు. ఇటీవల పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నిర్వహించిన సమీక్షలో త్వరలో కొత్త రేషన్ కార్డులను తీసుకొస్తామని వెల్లడించారు. ఈమేరకు ఆయన ప్రకటన కూడా చేశారు.

ఉత్తరప్రదేశ్, ఒడిశాల మాదిరిగా రైస్ ఏటీఎంల ఏర్పాటు యోచనను కూడా ప్రభుత్వం చేస్తున్నట్లు తెలుస్తోంది. వైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా తయారైన రేషన్ పంపిణీని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గాడిలో పెట్టింది. కొత్త కార్డులను త్వరలో మంజూరు చేయనుంది. నూతనంగా వివాహమైన వారికి, తల్లిదండ్రుల నుంచి విడిపోయి వేరుగా ఉంటున్న దంపతులకు కూడా కార్డులు ఇవ్వనుంది. ఇందుకు సంబంధించి దరఖాస్తుల ప్రక్రియను త్వరలో ప్రారంభించి జనవరిలో కొత్త కార్డులను మంజూరు చేసే అవకాశం ఉంది.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బేబీరాణి తదితరులు

పశువులకు అతిగా మందులు వాడొద్దు

● జిల్లా పశువైద్యాధికారి బేబీరాణి

ఒంగోలు(రూరల్), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పశువులకు అతిగా యాంటీబయాటిక్ మందులు వాడవద్దని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ కె.బేబీరాణి చెప్పారు. ఒంగోలు నగరం త్రోవగుంట పశువైద్యశాల ఆవరణలో శనివారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పశువుల్లో అతిగా యాంటీబయాటిక్ మందులు వాడితే వాటిల్లో వ్యాధి నిరోధక శక్తి సన్నగిల్లుతుందన్నారు. పశువైద్యుల సూచనలు మేరకు మాత్రమే మందులు వాడాలని చెప్పారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఏపీ డాక్టర్ బి.బసవశంకరరావు పశువైద్యాధికారి సమీర్‌శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

26న సింగరాయకొండలో జాబ్‌మేళా

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : జిల్లా ఉపాధి కార్యాలయం, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 26వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కార్యాలయ అధికారి టి.భరద్వాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో పలు ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు. టెన్త్, ఐటీఐ, డిప్లమో, ఇంటర్, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు మేళాలో పాల్గొనవచ్చని, ఎంపికైన వారికి నెల జీతం రూ.13వేల నుంచి రూ.28వేల వరకు ఉంటుందన్నారు. పనితీరు ఆధారంగా ఆకర్షణీయమైన ప్రోత్సాహకం ఉంటుందని జిల్లాలోని 18నుంచి 30 ఏళ్లలోపు నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8897964505 సెల్‌నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మెప్మా అర్బన్ మహిళా సమాఖ్య జిల్లా కమిటీ ఎన్నిక ఏకగ్రీవం



మహిళా సమాఖ్య సమావేశంలో పాల్గొన్న టీఎల్ఎఫ్ పదాధికారులు

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో జిల్లా అర్బన్ మహిళా సమాఖ్య నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. శనివారం ఒంగోలులోని మెప్మా కార్యాలయంలో జరిగిన టీఎల్ఎఫ్ పదాధికారులు అందరు పాల్గొని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా జి.భారతి (ఒంగోలు), ఉపాధ్యక్షురాలిగా డి.అంజమ్మ (చీమకుర్తి), కార్యదర్శిగా ఐ.రాధమ్మ (కనిగిరి), ఉప కార్యదర్శిగా ఎస్.భాగ్యలక్ష్మి (దర్శి), కోశాధికారిగా ఎన్.ప్రమీల (ఒంగోలు)లను ఎన్నుకోగా, ఆఫీస్ బేరర్స్‌గా ఐదుగురుని, కార్యవర్గ సభ్యులుగా మరో ఏడుగురు సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో మెప్మా పీడీ టి.రవికుమార్, టీఈ బి.ఫణికుమారి, ఎస్.జయకుమార్, కె.రాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలపై దృష్టి పెట్టాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా ● పాఠశాలల్లో తరగతి గదుల పరిశీలన

సంతనూతలపాడు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పిల్లల్లో విద్యాప్రమాణాలు పెంచడంతో పాటు పాఠశాలల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. సంతనూతలపాడు జడ్పీహైస్కూల్‌ను శనివారం సాయంత్రం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఇంగ్లీషు, గణితంలో పలు ప్రశ్నలు అడిగి వారి పరిజ్ఞానాన్ని పరిశీలించారు. బోర్డుపై కొన్ని లెక్కలను వేసి వాటిని పరిష్కరించాలని చెప్పారు. విద్యార్థుల ఆసక్తులను అడిగి తెలుసుకున్నారు. హైస్కూల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, ప్రాంగణంలో ఇండోర్‌స్టేడియం నిర్వహణ గురించి హెచ్‌ఎం ప్రమోదను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు, అపార్‌ఐడీల పురోగతిని, ఆన్‌లైన్‌లో అపార్ ఐడీ చేస్తున్నపుడు వచ్చే సమస్యలను దగ్గరుండి పరిశీలించారు. ఆధార్‌కార్డు, స్కూల్‌రికార్డు, జననధృవీకరణ పత్రాల్లో ఒకే రకమైన పుట్టిన తేదీ ఉన్న వాటికి త్వరగా అపార్‌ఐడీ జనరేట్ చేయాలని సూచించారు. తొలుత హైస్కూల్లో ఓటర్ల జాబిత సవరణ ప్రక్రియకు సంబంధించి నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపెయిన్ పరిశీలించారు. ఓటర్ల జాబితాలో పేరునమోదు, తొలగింపు, అడ్రస్ మార్పు కోసం వస్తున్న దరఖాస్తులు, వాటిని పరిష్కరిస్తున్న తీరును బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఈఆర్వో వరకుమార్, ఎంపీడీవో సురేష్‌బాబు, తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఎంఈవో వెంకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభ్యసనా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

నలు దిక్కులా నరకం



రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయిన గంగవరం రోడ్డు

ఇంకొల్లు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు ప్రజలకు నలు దిక్కులా ప్రయాణం నరకంగా మారింది. ఇంకొల్లు నుంచి సమీప పట్టణాలకు వెళ్లేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంకొల్లు టూ పర్చూరు ఆర్‌అండ్‌బీ రహదారిలో ఇంకొల్లు నుంచి నూతలపాడు రోడ్డులో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఇంకొల్లు టూ అద్దంకి ఆర్‌అండ్‌బీ రహదారిలో, గంగవరం వరకు పూర్తిగా దెబ్బతిని ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు కోతకు గురైంది. దీంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిలోనే విద్యాసంస్థలు ఉండడంతో నిత్యం రద్దీగా కన్పిస్తోంది. రాత్రి వేళలో కొత్త వాహనచోదకులు ఆదమరిస్తే ప్రమాదానికి గురికావల్సిందే. నాగండ్ల రహదారి అధ్వానంగా మారింది. చిన్నపాటి వాహనాల సైతం ఈ దారిలో వెళ్లలేని పరిస్థితి నెలకుంది. కంకర, గ్రావెల్ తరలించే భారీ వాహనాలు తిరుగుతుండడంతో ఈ రోడ్డు ధ్వంసమైంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. కేవలం ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. వెంటనే మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- రోడ్లపై పెద్దపెద్ద గుంతలు
- భయపడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు
- మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి



కల్వర్ట్ వద్ద ఉంచిన బస్తాలు



కంటైనర్‌లో ఉన్న ఆవులు

కబేళాకు ఆవులు

● కంటైనర్‌లో తరలిస్తుండగా పట్టుకున్న కంభం పోలీసులు

● 75 గోవులు మార్కెట్ యార్డుకు తరలింపు

కంభం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కబేళాకు ఆవులను తరలిస్తున్న కంటైనర్‌ను కంభం పోలీసులు శనివారం పట్టుకున్నారు. అందులో ఉన్న 75 గోవులను తాత్కాలికంగా మార్కెట్ యార్డుకు తరలించారు. వివరాల్లోకెళ్తే.. కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్ నుంచి అనంతపురానికి 75 గోవులతో కంటైనర్ బయల్దేరింది. వాటిని కబేళాకు తరలిస్తున్నట్లు ఎస్సై నరసింహారావుకు సమాచారం అందింది. దీంతో ఆయన కంభంలోని కందులాపురం సెంటర్‌కు చేరుకున్నారు. కొద్దిసేపటికి అటువైపు వచ్చిన కంటైనర్‌ను ఆపి చూడగా అందులో గోవులు కనిపించాయి. కంటైనర్ యజమానిపై కేసు నమోదు చేశామని, ఆవులను నందికొట్కూరులోని శ్రీకృష్ణ గోశాలకు తరలిస్తామని ఎస్సై చెప్పారు. పది రోజుల క్రితం కూడా ఇదే తరహాలో కంటైనర్‌లో తరలిస్తున్న 50 గోవులను కంభంలోనే పట్టుకున్నారు.

గ్రానైట్ లారీలకు జరిమానా

మద్దిపాడు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు సమీపంలో గ్రానైట్ లారీలను గనులశాఖ అధికారి ఏడీ రామచంద్ర ఆధ్వర్యంలో పలువురు అధికారులు శనివారం తనిఖీలు చేపట్టారు. చీమకుర్తి నుంచి చెన్నయ్‌కు ఎలాంటి ధృవపత్రాలు లేకుండా తరలిస్తున్నారన్న సమాచారంతో అధికారులు కొన్ని లారీలను పట్టుకున్నారు. వారికి రూ.2.50వేల జరిమానా విధించారు. గ్రానైట్ అక్రమరవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో అధికారులు వైక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

మద్దిపాడు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకొత్తపల్లి, లింగంగుంట గ్రామాల్లో పోలింగ్‌బూత్‌లను శనివారం ఈఆర్వో వరకుమార్ పరిశీలించారు. మరణించిన వారి ఓట్లు, బదిలీలు, చేర్పులు, మార్పులు చేస్తున్న వాటికి సంబంధించి తనిఖీలు చేసి సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

అనుమానాస్పద మృతి హత్యకేసుగా నమోదు

మద్దిపాడు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడుగుండ్లపాడు సమీపంలోని హైవే పక్కన ఉన్న రెనాల్ట్ షోరూం వెనుకభాగంలో జూన్ 23న ఓ వ్యక్తి మృతి చెంది కుళ్లిన దశలో పోలీసులు గుర్తించారు. సదరు మృతదేహాన్ని ట్రాన్స్‌జెండర్‌గా భావించి అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేశారు. ఈనేపథ్యంలో శుక్రవారం రాత్రి ఫోరెన్సిక్ నివేదిక అందడంతో ఆ మృతదేహం మహిళదని, హత్య చేశారనే ఆనవాళ్లు ఉండటంతో మద్దిపాడు పోలీసులు హత్య కేసుగా మార్పులు చేశారు.

బాధిత కుటుంబానికి సాయం

● రూ.10లక్షల చెక్కును అందజేసిన వైసీపీ నేతలు వెంకటేష్, మేరుగ

చీరాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సాయం అందిస్తున్నాం.. మీకు అండగా ఉంటామని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున చెప్పారు. ఈ ఏడాది జూన్ 21వ తేదీన చీరాల మండలం ఈపురుపాలెంకు ఉదర పోషణకు వచ్చిన చేనేత కార్మిక కుటుంబానికి చెందిన పాముజల సుచరిత హత్యాచారానికి గురైన విషయం తెలిసిందే. వెంకటేష్ చొరవతో పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు రూ.10లక్షల చెక్కును శనివారం బాధిత తల్లిదండ్రులైన వెంకటేశ్వర్లు, కామాక్షి దంపతులకు మేరుగ నాగార్జున, కరణం వెంకటేష్ అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు తమకు కేటాయించిన నివేశన స్థలం తమకు చెందేలా చేయాలని కోరారు. అందుకు తాము ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని చెప్పారు. కుటుంబ సభ్యులు వెంకటేష్‌కు, మేరుగకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

చీరాల : మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి చొరవతో మంజూరైన రూ.24.23 కోట్ల నిధులతో నియోజకవర్గంలో పలుచోట్ల చేపట్టిన రోడ్లను శనివారం వైసీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలున్నారు.

విద్యతోపాటు ఆహ్లాదం అవసరం

చీరాలటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలో విద్యతో పాటు ఆహ్లాదం కూడా అవసరమని తద్వారా మానసిక ఒత్తిడి నుంచి విముక్తి లభిస్తుందని ప్రేమ హాస్పిటల్ గుండె వైద్య నిపుణులు ఐ.బాబూరావు దంపతు లు అన్నారు. ఉడ్ నగర్‌లోని ఆనంద నిలయం బాలికల వసతి గృహానికి వారు రూ.10వేల విలువైన టీవీని బహూకరించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ విజయకుమారి, విద్యార్థినులు పాల్గొన్నారు.

సాంకేతికతలో ఉపాధి సిబ్బంది ముందుండాలి

చీరాలటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న ఆధునీకీకరణలో భాగంగా సాంకేతికపరమైన అంశాలపై ఎన్ఆర్‌ఈజీఎస్ సిబ్బంది ముందుండాలని ఈవోఆర్డీ రామకృష్ణ, ఏపీడీ కోట నాయక్ అన్నారు. ఎన్ఆర్‌ఈజీఎస్ జిల్లా స్థాయి సమావేశం శనివారం మండల కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా 2025-26 నాటికి ఉపాధి కల్పనకు కృషి చేయాలని సూచించారు. ఉన్నతి యాప్ వినియోగంపై శిక్షణ ఇచ్చారు. వంద రోజులు పని పూ ర్తయిన వారికి ఉపాధి దాని తీరు తెన్నులను వివరించారు. జిల్లా వ్యాప్తంగా గోకులాలు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ప్లాంటేషన్, పర్సంటేజ్ జనరేషన్ వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో ప్లాంటేషన్ మేనేజర్ కిరణ్, అన్ని మండలాల ఏపీవోలు సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిపాడు ఎంపీడీవో కార్యాలయంలో తనిఖీ

మద్దిపాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయాన్ని జడ్పీ సీఈవో చిరంజీవి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ భవనాన్ని, ఇతర రికార్డులను పరిశీలించారు. ఒకరిద్దరు సిబ్బంది హాజరుపై సంబంధిత అధికారిని ప్రశ్నించారు. అధికారులు, సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఆయన సూచించారు.

26న ధర్నా

మార్టూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రైతుల సమస్యలపై ఈనెల 26వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘ నాయకులు హనుమంతరావు, కందిమళ్ల రామకోటేశ్వరరావు శనివారం ప్రకటనలో తెలిపారు. ధర్నా విజయవంతం చేయాలని శనివారం సెంటర్లో కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. ఎనికపాటి రాంబాబు, సూరిబాబు పాల్గొన్నారు.

'నకిలీ'ల కేసును నీరుగార్చారు!

(5వ పేజీ తరువాయి)

22ఏ నిషేధిత జాబితాలో ఉండటాన్ని గమనించాడు. అలాంటి వాటికి నకిలీ 1బీ, అడంగల్‌లు సృష్టిస్తే పెద్దమొత్తంలో సంపాదించవచ్చని యోచించాడు. అనుకున్నదే తడవుగా కార్యాచరణకు దిగాడు. మొదట పలువురు మీసేవ కేంద్రం వాళ్లకు ఆశచూపి ఖాళీ ధ్రువపత్రాలు సంపాదించాడు. అనంతరం నిషేధిత జాబితాలో భూము లున్న రైతులతో మాట్లాడాడు. మీకు భూములున్నట్లుగా 1బీ, అడంగల్ ఇస్తానని వాటితో బ్యాంకుల్లో రుణాలు పొందవచ్చని వల విసిరాడు. పాతవైన కొన్ని ఒరిజనల్ ధ్రువపత్రాలను స్కాన్ చేసి కాపీ చేసిన సమాచారాన్ని మీసేవ కేంద్రాల నుంచి తెచ్చుకున్న ఖాళీ ధ్రువపత్రాలపైన పేస్ట్ చేసి నకిలీ పత్రాలను తయారు చేశాడు. దీన్ని అవసరార్థులకు, అక్రమార్కులకు అమ్ముకున్నాడు. వాటిని తీసుకెళ్లి గొట్లగట్టులో ఉన్న ఓ బ్యాంకులో పలువురు రుణాలు పొందారు. ఈవిధంగా ఆ వైసీపీ సానుభూతిపరుడు పెద్ద సంఖ్యలో నకిలీ 1బీ, అడంగళ్లను తయారు చేసి రూ.లక్షల్లో జేబులు నింపుకున్నాడు.

పంచాయతీ కార్యదర్శుల నుంచి లాగిన్

ఇద్దరు స్నేహితులైన పంచాయతీ కార్యదర్శుల వద్ద ఆ వైసీపీ సానుభూతిపరుడు అనధికారికంగా లాగిన్ తీసుకొన్నాడు. బర్త్, డెత్, సదరమ్ సర్టిఫికెట్లే కాక పలు రకాలైన సేవలకు సంబంధించిన పత్రాలను కూడా నకిలీవి సృష్టించాడు. వీటి ద్వారా పెద్ద మొత్తంలో అక్రమార్జన చేసినట్లు తెలిసింది. ఈ తంతు సుమారు నాలుగేళ్ల పాటు నిరాటంకంగా సాగినట్లు సమాచారం.

ఓ ఫిర్యాదుతో వెలుగులోకి

అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైసీపీ సానుభూతిపరుడు నకిలీ ధ్రువపత్రాలు అమ్ముకుంటున్న వైనాన్ని ఓ రైతు సెప్టెంబర్‌లో తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. దీంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. తొలుత స్థానిక అధికారులు పట్టించుకోకపోవడంతో తాను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హెచ్చరించడంతో రెవెన్యూ అధికారులు విచారణ ప్రారంభించారు. ప్రస్తుత తహసీల్దార్ సురేష్ ముందుగా గొట్లగట్టులోని ఓ బ్యాంకుకు వెళ్లి తాను బాధ్యతలు తీసుకున్న తర్వాత (3నెలలు) రుణాలు పొందిన వాళ్ల జాబితాను పరిశీలించారు. ముగ్గురు వ్యక్తులు తప్పుడు ధ్రువపత్రాలతో రుణాలు పొందినట్లు నిర్ధారించుకున్నారు. ప్రాథమిక సమాచారం మేరకు కంప్యూటర్ నెట్ సెంటర్ నిర్వాహకుడైన సదరు వలంటీర్, నకిలీ ధ్రువపత్రాలతో అక్రమంగా బ్యాంకు నుంచి రుణాలు పొందిన వారిపై కొనకనమిట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అధికారుల తీరుపై అనేక అనుమానాలు

నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంలో అటు పోలీసు, ఇటు రెవెన్యూ అధికారుల తీరు అనేక అనుమానాలకు ఆస్కారం ఇస్తోంది. మండల తహసీల్దార్ ఫిర్యాదు మేరకు అక్టోబర్ 6న పోలీసులు వైసీపీ సానుభూతిపరుడైన నెట్ సెంటర్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు. అనంతరం అతనితోపాటు రైతులను స్టేషన్‌కు పిలిపించి విచారించి వదిలేశారు. ఇది అనేక అనుమానాలకు తావిస్తోంది. ప్రస్తుతం నిందితుడు అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలిసింది. నకిలీ ధ్రువపత్రాలతో నాలుగేళ్ల నుంచి పెద్ద సంఖ్యలో రుణాలు పొందినట్లు తెలుస్తోంది. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లోనే కొందరు వీటిని సమర్పించి మోసం చేసినట్లు సమాచారం. అయితే తహసీల్దార్ తాను బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి మాత్రమే పరిశీలన చేసినట్లు సమాచారం. గత నాలుగేళ్లలో ఎంత మంది ఇలా నకిలీ సర్టిఫికెట్లతో రుణాలు తీసుకున్నారన్న విషయం గురించి పట్టించుకోలేదు. తాను బాధ్యతలు చేపట్టిన అనంతరం మూడు నెలల్లో నకిలీ సర్టిఫికెట్లతో రుణాలు తీసుకున్న ముగ్గురు రైతులపై మాత్రమే ఫిర్యాదు చేశారు. వారితోపాటు నెట్ సెంటర్ నిర్వాహకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేవలం ప్రాథమికంగా విచారించి వదిలేశారు. మీసేవ కేంద్రం ఖాళీ పత్రాలు ఎక్కడ నుంచి వచ్చాయో రెవెన్యూ అధికారులే నిర్ధారించాలి. అయితే వారు కూడా దీనిపై దృష్టిసారించలేదు. నిందితుడు ధైర్యంగా నకిలీ ధ్రువీకరణ పత్రాలు తయారు చేయడం వెనుక బలమైన శక్తులు ఏమైనా ఉన్నాయా? అతనికి సహకరించిన కార్యదర్శులు, వీఆర్వోలు ఎవరు? అన్న విషయాలను అసలు పట్టించుకోలేదు.

లోతుగా విచారించని పోలీసులు

కేసు నమోదై సుమారు 45 రోజులు దాటినా పురోగతి ఏమిటనేది కూడా బయటకు పొక్కడం లేదు. పోలీసులు తమదైన శైలిలో విచారిస్తే నిజాలు ఎప్పుడో బహిర్గతమయ్యేవి. కానీ వారు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. భారీ మొత్తంలో చేతులు తడపడంతోనే కేసును నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని స్పష్టమౌతోంది. జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారిస్తేనే ఈ అక్రమ తంతులో ప్రమేయమున్న వాళ్లందరూ వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

26 నుంచి జరిగే సమ్మెను విజయవంతం చేయాలి

● 108 సర్వీసెస్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 108 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26నుంచి జరిగే సమ్మెను విజయవంతం చేయాలని 108 సర్వీసెస్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కోరారు. శనివారం ఒంగోలులోని సీఐటీయు కార్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి వెన్నా గాలిరెడ్డి మాట్లాడుతూ 108 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళిన పట్టించుకోలేదన్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపడుతున్నందున అన్ని కేంద్ర కార్మిక సంఘాలు, ఉద్యోగసంఘాలు, ప్రజానీకం మద్దతు ఇవ్వాలని కోరారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ అరబిందో యాజమాన్యం గత నాలుగు సంవత్సరాల నుంచి ప్రావిడెంట్ ఫండ్ యాజమాన్యం కోటా చెల్లించకుండా అన్యాయం చేసిందన్నారు. యాజమాన్యం వద్ద నుంచి కార్మికుల వాటా కాకుండా మిగిలిన వాటా వసూలు చేసి మొత్తం రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు జి.శ్రీనివాసులు, పారా శ్రీనివాసరావు, చిరంజీవి, తాండవ రంగారావు, బంకా సుబ్బారావు, ఆదామ్, సువర్ణ, రేఖ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గాలిరెడ్డి

కాకినాడలో రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు ప్రారంభం

కాకినాడ అర్బన్, (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి క్రీడలు దోహదం చేస్తాయని జడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు అన్నారు. శనివారం పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలను కాకినాడ డీఎస్ఏ మైదానంలో లక్ష్మణరావు ప్రారంభించారు. అండర్17 విభాగంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 160మంది క్రీడాకారులు హాజరయ్యారని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. రెండోరోజులపాటు నిర్వహించే పోటీల్లో విజేతలను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్, రగ్బీ సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.రామాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు నాగేంద్రకుమార్, సానా సతీష్ ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్, రమణరాజు, లక్ష్మణ్, పీఈటీలసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి.రవిరాజు, కె.నూకరాజు పాల్గొన్నారు.

మొదటిరోజు విజేతలు వీరే

అనంతపురంపై గుంటూరు10.0, చిత్తూరుపై శ్రీకాకుళం 20.0, కర్నూలుపై తూర్పుగోదావరి 23.0, విశాఖపై ప్రకాశం 15.0 స్కోరుతో గెలుపొంది సెమీ ఫైనల్‌కి చేరాయి.



రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు



మొదటిరోజు విజేతలు

మెప్మాలో బోగస్‌లకు చెక్..!

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వ పథకాలు పొందుతున్నారు, ఎంతమందికి అందడం లేదు, ఇప్పటి వరకు లబ్ధి పొందిన వారి వివరాలను ప్రస్తుతం ఆర్పీ (రిసోర్స్ పర్సన్)లు సేకరించి ఆన్‌లైన్ చేస్తున్నారు. జిల్లాలోని ఒంగోలు నగరంతో పాటు అన్ని మునిసిపాలిటీలలో 9,545 పొదుపు సంఘాలు ఉన్నాయి. వాటిలో 93,228 లక్షల మంది సభ్యులు ఉన్నారు. ప్రస్తుతం పది మంది సభ్యులతో సంఘంగా ఏర్పడి పొదుపు చేయడంతోపాటు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని స్వయం ఉపాధిని పొందుతున్నారు. సభ్యుల్లో ఎవరైనా చనిపోయినా, వలస వెళ్లినా, వయసు మీరినా, వారి స్థానంలో కొత్తవారిని నియమించుకుంటున్నారు. ఆయా సంఘాల సభ్యుల వివరాలను ఇప్పటి వరకు ఆన్‌లైన్ చేయకపోవడంతో ప్రభుత్వ పథకాలను పొందలేకపోతున్నారు. కాగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలు అమలుకు ఉపక్రమించింది. ఈ నేపథ్యంలో ప్రత్యేక యాప్‌లో పొదుపు మహిళల వివరాలు నమోదు చేయడం ద్వారా ఇప్పటి వరకూ ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉంటున్న వారికి లబ్ధి చేకూరనుంది.

అర్హులకు పథకాలు అందించేందుకే యాప్

మహిళల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను పొదుపు సంఘాలకు చేరువచేయాలన్నదే ప్రభుత్వం ఉద్దేశం. యాప్‌లో వివరాలు నమోదు చేయడం వలన పొదుపు మహిళలకు మరింత లబ్ధి చేకూరుతుంది. సభ్యులు తయారు చేసే ఉత్పత్తుల ఆన్‌లైన్ మార్కెటింగ్‌కు అనుసంధానం చేయడం జరుగుతుంది. యాప్‌లో వివరాలు నమోదు చేయడం ద్వారా బోగస్ గ్రూపులకు చెక్‌పడుతుంది. **- టి.రవికుమార్, మెప్మా పీడి**

ఆక్రమణల తొలగింపు మళ్లీ మొదలు

(5వ పేజీ తరువాయి)

తోపుడు బండ్లతో ట్రాపిక్‌కు తీవ్ర ఇబ్బందులు ఏర్పడేవి. పట్టణంలోకి వచ్చే బస్సుల్లోంచి దాదాపు చాలామంది గడియార స్తంభం వద్దనే దిగుతుంటారు. ఈ ఇబ్బందులను తొలగించడానికి వన్‌వేను ఏర్పాటు చేశారు. కళాశాల రోడ్డు నుంచి పట్టణంలోకి వచ్చే వాహనాలు సెవెన్ హిల్స్ నుంచి విశ్వేశ్వర థియేటర్ మీదుగా రాధాకృష్ణ టాకీస్, తూర్పువీధి జువ్విచెట్టు, శివాలయం ఆర్చీ, రథం బజార్, విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి రాజాజీ వీధిలోకి ప్రవేశించి రీడింగ్ రూమ్ వద్దకు వాహనాలు వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. మధ్యలో ఎక్కడా వాటికి ఎదురు వెళ్లకుండా తగిన చర్యలు తీసుకుంటున్నారు. అదేవిధంగా పట్టణం నుంచి కళాశాల రోడ్డువైపు వెళ్లే వాహనాలు దోర్నాల బస్టాండ్, శాంతిక్లినిక్, సప్తగిరి లాడ్జీ మీదుగా బయటకు వెళుతున్నాయి. ఎదురుగా ఎలాంటి వాహనాలు రాకుండా రహదారికి ఇరువైపులా బారికేడ్లను పోలీసులు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సిబ్బందిని విధుల్లో ఉంచడంలాంటి చర్యలు చేపడుతున్నట్లు సీఐ పి.సుబ్బారావు తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పెరిగిన నేపథ్యంలో భవిష్యత్తు అవసరాల దృష్ట్యా వన్‌వే కీలకం కానుందని ఆయన అన్నారు. మొదట్లో కొన్ని ఇబ్బందులు ఏర్పడినా పట్టణ శ్రేయస్సు మేరకు మార్పులు తప్పవన్నారు.



వన్‌వే తిరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ నారాయణరావు, సీఐ సుబ్బారావు



అరుదైన వ్యాధికి గురైన రవిప్రకాష్, ఆదిత్యకుమార్

వారిద్దరూ అన్నదమ్ములు. ఆడుతూపాడుతూ సరదాగా గడపాల్సిన బాల్యం. ఒకరు చిన్నతనంలో, మరొకరు యుక్త వయస్సులో అరుదైన వ్యాధి బారినపడ్డారు. పది లక్షల మందిలో ఒకరికి వచ్చే ఆ వ్యాధి ఒకే కుటుంబంలోని ఆ అన్నదమ్ములిద్దరినీ జీవచ్ఛవాలుగా చేసింది. వారి వెన్నెముక కండరాలను మెలిపెడుతోంది. ఏ అవయవమూ పనిచేయకుండా చేస్తోంది. ఉన్నచోట నుంచి కదలనీయకుండా కట్టెలా ఉంచుతోంది. మూడు చక్రాల బండికి పరిమితం చేస్తోంది. బిడ్డల అచేతన స్థితిని చూస్తూ ఆ నిరుపేద తల్లిదండ్రులు కుమిలిపోని రోజు లేదు. తిరగని ఆస్పత్రి లేదు. ఉన్న ఆస్తి మొత్తం అమ్మి, శక్తికి మించి అప్పు చేసి వైద్యం చేయిస్తున్నా లొంగని ఆ రాకాసి వ్యాధితో నిరంతర పోరాటం చేస్తున్నారు. ఆ ఇద్దరు బిడ్డలను చిత్రవధ చేస్తున్న ఆ వ్యాధే స్పైనల్ మస్క్యులర్ ఎట్రోసీ (కండరాల క్షీణత వ్యాధి). దీనిపై ప్రతిరోజూ యుద్ధం చేస్తున్న ఆ కుటుంబంపై ప్రత్యేక కథనం..

ప్రభుత్వం కరుణ చూపితే జబ్బును నయం చేయొచ్చు

ఇద్దరికీ ఒకే వ్యాధి. దీనివల్ల శరీర అవయవాలు రోజురోజుకూ క్షీణించి పని చేయకుండా పోతున్నాయి. మన దేశంలో దీనికి సరైన వైద్యం లేదట. ఇతర దేశాల నుంచి వచ్చే వ్యాక్సిన్ వేస్తే నయం అవుతుంది. అదే రెస్డీప్లామ్ వ్యాక్సిన్. దాన్ని కొనాలంటే ఒక్కొక్కరికీ రూ.35 లక్షలు అవుతుంది. ఢిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రిలో ఇది ఉంటుందట. ప్రభుత్వం చొరవ చేసి సహకరిస్తే వ్యాక్సిన్ తెప్పించొచ్చని వైద్యులు చెప్పారు. సీఎం చంద్రబాబు కరుణ చూపి మా పిల్లలను బతికించాలి.

-కె.వెంకట్రావు, తండ్రి



వెన్నును మెలిపెట్టి.. కండరాలను కట్టేసి..

■ అన్నదమ్ములను జీవచ్ఛవాలుగా చేసిన రాకాసి వ్యాధి

తాళ్లూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన కొడిమెల వెంకట్రావు, సుశీల నిరుపేద దంపతులు. వెంకట్రావు గతంలో ఊరికి సమీపంలోని క్వారీలో కూలి పనికెళ్లేవారు. 20 సెంట్ల భూమి ఉండేది. ఆ దంపతుల కుమారులు ఆదిత్య కుమార్, రవిప్రకాశ్. పుట్టినప్పుడు ఇద్దరూ ఆరోగ్యవంతులే. చిన్న కుమారుడు రవిప్రకాశ్ 3 ఏళ్ల వయస్సులో నడవలేకపోవటంతో తల్లిదండ్రులు వైద్యుల వద్దకు తీసుకెళ్లి పరీక్షలు చేయించారు. కండరాల వ్యాధిగా నిర్ధారణ అయింది. ఎన్ని మందులు వాడినా నయం కాలేదు. పైగా రోజు రోజుకూ సమస్య ఎక్కువ అవుతోంది. ఆందోళన చెందిన తల్లిదండ్రులు రవిప్రకాశ్‌ను హైదరాబాద్‌కు తీసుకెళ్లి కార్పొరేట్ ఆసుపత్రిలో పరీక్షలు చేయించారు. ఆ బాలుడికి వెన్నెముక కండరాల క్షీణత (స్పైనల్ మస్క్యులర్ ఎట్రోసీ) అనే అరుదైన వ్యాధి ఉన్నట్టు స్పష్టం చేశారు. ఇది కోటిలో 10 మందికి వస్తుందని, నయం కావాలంటే వ్యాక్సిన్ వేయించాలని, దాని ఖరీదు రూ.10 లక్షలు (ప్రస్తుతం ఆ వ్యాక్సిన్ ఖరీదు రూ.35 లక్షలు) ఉంటుందని ఏడేళ్ల క్రితం వైద్యులు సుచించారు. ఖరీదైన వైద్యం చేయించే స్థితిలేని వెంకట్రావు... కుమారుడు రవిప్రకాశ్‌ను ఇంటి పట్టునే ఉంచి ఫిజియోథెరపీ చేయిస్తూ నెట్టుకొస్తున్నారు. ఇప్పటికే వైద్యం కోసం రూ.10 లక్షలు ఖర్చు చేశారు. దీని కోసం ఉన్న 20 సెంట్ల భూమిని కూడా అమ్మేశారు. ప్రస్తుతం ఊరికి శివారులో కొంత స్థలం అద్దెకు తీసుకుని అందులో చిన్న పాక ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఒకపక్క పేదరికం, మరోపక్క చిన్న కుమారుడి వైద్యం చేయించలేని నిస్సహాయతతో ఏటికి ఎదురీదుతున్న వెంకట్రావు దంపతులకు మరో పెద్ద సమస్య ఎదురైంది.

- పదేళ్లుగా ఒకరు, ఏడాదిన్నరగా మరొకరు వ్యాధితో పోరాటం
- ఇద్దరూ వీల్‌చైర్‌కే పరిమితం
- పసిబిడ్డల్లా సాకుతున్న నిరుపేద తల్లిదండ్రులు
- వైద్యం కోసం ఆస్తి అమ్మి, అప్పులు చేసి రూ.15 లక్షలు ఖర్చు
- రెస్డీప్లామ్ అనే వ్యాక్సిన్‌తోనే వ్యాధి నయం
- ఇద్దరికీ కలిపి వ్యాక్సిన్ ఖర్చు రూ.70 లక్షలు
- ప్రభుత్వం చొరవ చూపితే ఉచితంగా లభించే అవకాశం
- బిడ్డలను కాపాడాలని సర్కారుకు అమ్మానాన్నల విన్నపం



పెద్ద కుమారుడికీ కండరాల క్షీణత

పెద్ద కుమారుడు ఆదిత్య కుమార్ 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి, డిప్లొమా మూడో సంవత్సరం చదువుతుండగా ఏడాదిన్నర క్రితం చిన్నకుమారుడికి సోకిన వ్యాధి లక్షణాలే కనిపించాయి. అప్పటికి ఆదిత్య వయస్సు 17 ఏళ్లు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు పెద్ద కుమారుడిని హైదరాబాద్‌కు తీసుకెళ్లి పరీక్షలు చేయించగా వెన్నెముక కండరాల క్షీణత వ్యాధి లక్షణాలు (స్పైనల్ మస్క్యులర్ ఎట్రోసీ) ఉన్నట్టు వైద్యులు నిర్ధారించారు. దీంతో తల్లిదండ్రులు నిర్ఘాంతపోయారు. చదువుపై ఆసక్తితో ముందుకు సాగుతున్న ఆదిత్య కుమార్‌కు కూడా రాకాసి వ్యాధి సోకడంతో ఆ కుటుంబం అంతులేని దుఃఖంలో మునిగిపోయింది. ఈ వ్యాధి నివారణ వ్యాక్సిన్‌కు ఇద్దరికీ కలిపి దాదాపు రూ.70 లక్షల ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. పెద్ద కుమారుడి వైద్య ఖర్చులకు ఇప్పటికే రూ.5 లక్షలు ఖర్చు పెట్టారు. బంధువులు, మిత్రుల వద్ద అప్పు చేసి ఇప్పటివరకూ నెట్టుకొచ్చారు. ఆదుకోవాలని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు ద్వారా ప్రభుత్వాన్ని కోరారు. రెండు నెలల క్రితం దర్శిలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపు వద్దకు తీసుకెళ్లి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మిని కలిసి సమస్యను వివరించారు. ఇద్దరు పిల్లలనూ సీఎం చంద్రబాబు వద్దకు తీసుకెళ్లి ప్రభుత్వం నుంచి సాయం అందేలా చేస్తానని ఆమె భరోసా ఇచ్చారు.

అవయవాలు పనిచేయడం లేదు

ఇద్దరూ పిల్లలూ వారి పనులు కూడా వారు చేసుకోలేని స్థితి. వారికి అవయవాలు పని చేయక పోవటంతో స్నానాలు కూడా మేమే చేయిస్తున్నాం. భోజనం కూడా నోట్లో పెట్టాలి. వారిని చూసుకునేందుకు ఇంట్లో ఒకరైనా ఉండాల్సి వస్తోంది. రోజూ ఫిజియోథెరపీ చేయిస్తున్నాం. నాణ్యమైన మందులు వాడుతున్నాం. అయినా తగ్గలేదు.

- కె.సుశీల, తల్లి



కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న గుండంచర్ల గ్రామస్థులు

ఫారెస్ట్ డీఆర్వోను అరెస్ట్ చేయాలని ఆందోళన

మార్కాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పశువులు మేపుకునేందుకు అడవికి వెళ్లిన కాపరిపై దాడిచేసి కొట్టిన అటవీశాఖ డీఆర్వో నాగరాజును అరెస్ట్ చేయాలని పెద్దారవీడు మండలం గుండంచర్ల గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఆ మేరకు శనివారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్ వెంకట్ త్రివినాగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన సుమారు 200 పశువులను వెంకటేశ్వర్లు అనే వ్యక్తి మేపుతుంటాడని అన్నారు. ఈ క్రమంలో అటవీ ప్రాంతంలోకి మేపు కోసం వెళ్లాడన్నారు. పశువులను అటవీ ప్రాంతానికి తోలుకెళ్లిన వెంకటేశ్వర్లుపై శుక్రవారం అటవీశాఖ మార్కాపురం డీఆర్వో నాగరాజు దాడి చేశారన్నారు. గాయాలపాలైన వెంకటేశ్వర్లు మార్కాపురం సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడన్నారు. ఘటనపై పెద్దారవీడు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారని తెలిపారు. అయితే డీఆర్వో నాగరాజు తనపైనే వెంకటేశ్వర్లు అనే వ్యక్తి దాడి చేసి విధులను ఆటంకపరిచినట్లు పెద్దారవీడు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ విషయంలో దాడికి గురైన వెంకటేశ్వర్లును న్యాయం చేయాలని, డీఆర్వోను అరెస్ట్ చేయాలని గ్రామస్థులు కోరారు. అనంతరం గ్రామస్థులు మార్కాపురం అటవీశాఖ టైగర్ రిజర్వ్ డిప్యూటీ డైరెక్టర్ సందీప్ కృపాకర్‌ను కలిసి డీఆర్వో నాగరాజుపై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు రామకృష్ణారెడ్డి, సుబ్బరామిరెడ్డి, హనుమంతారెడ్డి, బోగెం రామకృష్ణ, ఆరెపాటి వెంకటేశ్వర్లు, బోగెం లక్ష్మీదేవి, మిసాల రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు నెలరోజుల్లో చెల్లించకుంటే కేసులు

- మార్కెట్ షాపు లీజుదారులకు కమిషనర్ ఆదేశం

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరంలోని ఊరచెరువులో షాపులు లీజుకు తీసుకుని అద్దెలు చెల్లించని వ్యాపారులు నెల రోజుల్లో చెల్లించాలని, లేని పక్షంలో కేసులు నమోదు చేస్తామని కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. శనివారం తన చాంబర్‌లో షాపు లీజుదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కొందరు వ్యాపారులు తమకు కేటాయించిన షాపుల్లో కాకుండా ఆరుబయట వ్యాపారాలు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఎవరికి కేటాయించిన షాపుల్లోవారు వ్యాపారాలు చేసుకోవాలని స్పష్టం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా అద్దెలు చెల్లించని వ్యాపారులు నెలరోజులలోపు పూర్తిగా చెల్లించాలని ఆదేశించారు. లేకుంటే ఆర్‌ఆర్ యాక్టుకింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. షాపుల్లో బినామీలు కూడా ఉన్నట్లు గుర్తించామని, వారు వెంటనే ఖాళీ చేయాలన్నారు. లేని పక్షంలో యజమానికి కేటాయించిన షాపు లీజు రద్దు చేస్తామని తెలిపారు. సక్రమంగా అద్దెలు చెల్లించేవారికి కార్పొరేషన్ వైపు నుంచి అన్ని విధాలుగా సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కాగా కొందరు లీజుదారులు పెండింగ్ బకాయిలు రెండు విడతల్లో చెల్లిస్తామని కమిషనర్‌కు తెలిపారు.

మద్యం బాటిళ్లు ధ్వంసం



మద్యం బాటిళ్లను రోలర్‌తో తొక్కిస్తున్న పోలీసులు

టంగుటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు పోలీస్‌స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుకున్న 399 మద్యం బాటిళ్లను శనివారం పోలీసులు రోలర్‌తో ధ్వంసం చేశారు. అక్రమ మద్యానికి సంబంధించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో 31 కేసులు నమోదయ్యాయి. ఈకేసులన్నీ ఎక్సైజ్ శాఖకు బదిలీ అయ్యాయి. ఈకార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో

లైంగిక వేధింపుల చట్టం పటిష్టంగా అమలు

- కలెక్టర్ తమీమ్ అన్సారియా ● కలెక్టరేట్‌లో షీ బాక్స్ ప్రారంభం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల చట్టం-2013 పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా వెల్లడించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌హాలులో పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం, పరిష్కారం) చట్టం-2013పై మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో వర్క్‌షాపు ఏర్పాటు చేశారు. సీనియర్ సివిల్ న్యాయాధికారి జి.దీనాతో కలిసి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాపును ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటి వరకు ఈ చట్టం కింద 41 కేసులు నమోదయ్యాయన్నారు. ఈ చట్టంపై అవగాహన లేకపోవడం, అవగాహన ఉండి కూడా ధైర్యంగా వచ్చి ఫిర్యాదు చేయకపోవడం వంటి కారణాలతో రాష్ట్రవ్యాప్తంగా తక్కువ కేసులు నమోదు అవుతున్నాయని చెప్పారు. ఇంటి నిర్వహణ బాధ్యతలతో పాటు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్న మహిళ సురక్షిత వాతావరణంలో ఉద్యోగ విధులు నిర్వహించేలా ఈ చట్టం తోడ్పాటు కల్పిస్తుందని తెలిపారు. ఏదైనా పని ప్రదేశంలో మహిళ లైంగిక వేధింపులకు గురైతే ఆమెకు అండగా నిలవాల్సిన బాధ్యత ఇతర మహిళా ఉద్యోగులపై ఉందని పేర్కొన్నారు. ఈ చట్టం ప్రకారం మహిళలు పనిచేసే ప్రతిచోట అంతరగత కమిటీలు ఏర్పాటు చేసి ఉండాలని, అలా చేయని వారు తక్షణమే ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. సివిల్ న్యాయాధికారి దీనా మాట్లాడుతూ మహిళలకు రాజ్యాంగపరంగా ఇచ్చిన హక్కులను పరిరక్షించడం, పనిచేస్తున్న ప్రదేశాల్లో ఉద్యోగ భద్రత కల్పించడం, ఉద్యోగ విధులు నిర్వర్తించడానికి, సంతోషకమైన, సురక్షితమైన వాతావరణం కల్పించడమే ఈ చట్టం ముఖ్యఉద్దేశమన్నారు. ప్రభుత్వ, స్వచ్ఛంధ, క్రీడా, సహకార, విద్యా తదితర సంస్థలతో పాటు నర్సింగ్‌హోమ్‌లు, పరిశ్రమలు, ఆస్పత్రులు, కార్పొరేషన్లు, స్వయం ఉపాధులు, బ్యాంకులు, మరే ఇతర పనిచేసే చోట్లనైనా మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వారందరిపై ఈ చట్టం వర్తిస్తుందని వివరించారు. ఐసీడీఎస్ పీడీ మాధురి మాట్లాడుతూ మహిళలు, పిల్లలభద్రతకు, సంరక్షణకు ప్రభుత్వాలు అనేక చట్టాలు తెచ్చిందన్నారు. పనిచేస్తున్న ప్రదేశాల్లో లైంగికవేధింపుల నిరోధానికి తీసుకవచ్చిన చట్టం అవశ్యకతను వివరించారు. పొదిలి సీడీపీవో సుధామాధురి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా చట్టం వివరాలను వెల్లడించారు.



వర్క్‌షాప్‌లో మహిళలతో కలెక్టర్ అన్సారియా

షీ బాక్స్‌ను ప్రారంభించిన కలెక్టర్

కాగా అంతకు ముందు కలెక్టర్ తమీమ్ అన్సారియా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన షీ బాక్సును ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ జాయింట్ యాక్షన్ కమిటీ అమరావతి జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాక్సులో మహిళా ఉద్యోగులు ఏమైనా సమస్యలు ఉంటే అందులో ఫిర్యాదులు వేయవచ్చని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ వసుంధర, దివ్యాంగులశాఖ ఏడీ అర్చన, మహిళా ఉద్యోగులు, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలి

- సివిల్ సప్లయిస్ డీఎం వరలక్ష్మి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ధాన్యం కొనుగోళ్ళను ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ వరలక్ష్మి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్‌హాలులో శనివారం సాయంత్రం ఒంగోలు డివిజన్ స్థాయి ధాన్యం కొనుగోళ్ళపై జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రేడ్-ఎ ధాన్యం క్వింటా రూ.2,320, సాధారణ రకం ధాన్యం రూ.2,300లకు కొనుగోలు చేయాలన్నారు. ఈ ఏడాది వ్యవసాయ శాఖ అధికారులు ఇచ్చిన నివేదికల ప్రకారం 23,504 ఎకరాలలో వరి పంట సాగు చేశారని, అందుకు గాను 59,547 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుమతి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. అందులో సివిల్ సప్లయిస్ ద్వారా 15వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం సేకరించేందుకు 11 మండలాల్లో 88 రైతు సంక్షేమ కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. రైతులు తమ సొంత గోనే సంచుల్లో ధాన్యం మిల్లులకు పంపినట్లు అయితే రైతుల ఖాతాలో రూ.3.39 జమ చేస్తామని వివరించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు, జిల్లా సహకార సంఘాల అధికారులు, తహసీల్దార్లు, మండల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సివిల్ సప్లయిస్ డీఎం వరలక్ష్మి

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు ● మలినేని కళాశాలలో విద్యార్థినులకు అవగాహన సదస్సు

సింగరాయకొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు సూచించారు. శనివారం మండలంలోని కనుమళ్ల పంచాయతీ పరిధిలోని మలినేని సుశీలమ్మ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలు, మహిళలు, విద్యార్థినులపై జరుగుతున్న నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫేక్ కాల్స్ పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఫేస్‌బుక్, ట్విటర్, వాట్సాప్‌లకు వచ్చే అనుమానిత లింక్స్‌పై క్లిక్ చేయరాదని సూచించారు. మాదక ద్రవ్యాలను సేవించడం, అక్రమంగా రవాణా చేయడం నేరమని చెప్పారు. విద్యార్థి దశలో మాదక ద్రవ్యాలకు అలవాటుపడితే బంగారు భవిష్యత్ ఉన్న జీవితాలు నాశనమవుతాయన్నారు. విద్యార్థినులు అపరిచిత వ్యక్తులకు దూరంగా ఉండాలని సూచించారు. ద్విచక్రవాహనాలను నడిపే ప్రతిఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని సూచించారు. కాగా తొలుత సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది, మహిళా పోలీసులతో శనివారం సింగరాయకొండ సర్కిల్ కార్యాలయ ప్రాంగణంలో డీఎస్పీ శ్రీనివాసరావు సమావేశాన్ని నిర్వహించారు. నేరాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ హజతర్తయ్య, ఎస్సైలు మహేంద్ర, నాగమల్లేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు

ఎక్సైజ్‌శాఖలో బదిలీలపై విచారణ

ఒంగోలు(క్రైం), నవంబరు23 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్‌శాఖలో నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు జరిగాయన్న ఆరోపణలు రావడంతో డీఆర్వో చినఓబులేష్ శనివారం విచారణ చేపట్టారు. ప్రకాశంభవన్‌లోని డీఆర్వో చాంబర్‌లో ఈ విచారణ జరిగింది. ఎక్సైజ్‌శాఖ ఈఎస్ ఖాజామోహీద్దీన్, సిబ్బందితో పాటుగా ఎస్‌పీఎస్ నాయకులు హాజరయ్యారు. తనపై వచ్చిన ఆరోపణలపై బుధవారం పూర్తి సమాచారం అందజేస్తానని ఈఎస్ వివరణ ఇచ్చారు.

రేపటి నుంచి నగరంలో నీటి సరఫరాలో అంతరాయం

● పైపులైను పనుల కారణంగా 4 రోజులు నిలిపివేత : కమిషనర్

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం భాగ్యనగర్ 4వ లైనులో కొత్తగా వేసిన తాగునీటి పైపులైను ఇంటర్ కనెక్షన్ పనుల కారణంగా ఈనెల 25 నుంచి 28వ తేది వరకు నగరంలోని పలు ప్రాంతాలకు నీటి సరఫరా నిలుపుదల చేస్తున్నామని, ఈ విషయాన్ని గుర్తించి ప్రజలు సహకరించాలని కమిషనర్ వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భాగ్యనగర్, హౌసింగ్‌బోర్డు కాలనీ, విజయనగర్‌కాలనీ, ప్రగతికాలనీ, దారావారితోట, రామనగర్, అన్నవరప్పాడు, సంతపేట, పోతురాజుపాలెం, కబాడిపాలెం, మిరియాలపాలెం, చివుకులవారివీధి, కొప్పోలు, బృందావన్‌నగర్, డ్రీమ్స్ స్కూలు రోడ్, ఇందిరమ్మ కాలనీ, పులి వెంకటరెడ్డి కాలనీ, రాజీవ్‌గృహకల్ప, గుర్రం జాషువాకాలనీ, గోపాలనగరం ఎక్స్‌టెన్షన్, బలరాంకాలనీ, కేశవరాజుకుంట, చినమల్లేశ్వరకాలనీ, కరుణాకాలనీ, కబేళాబజారు, గద్దలగుంట, రాజీవ్‌నగర్, సుందర్‌నగర్, మామిడిపాలెం, గాంధీనగర్, కొత్త డొంక, జడ్పీకాలనీ, మిలటరీకాలనీ, శివాజీనగర్, ఎన్జీవోకాలనీ, దిబ్బలరోడ్డు, సత్యనారాయణ పురం, ఇందిరానగర్, వెంకటేశ్వరకాలనీ, నెహ్రూనగర్ ఎక్స్‌టెన్షన్, జయప్రకాష్ కాలనీలలో నాలుగు రోజులపాటు నీటి సరఫరా నిలిపిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు సమస్యను గుర్తించి నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయన కోరారు.

ఈశా ఫౌండేషన్ ఆధర్యంలో క్రీడాపోటీలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఐ హజరత్తయ్య

సింగరాయకొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో శనివారం ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈశా గ్రామోత్సవం, భారత క్రీడాస్ఫూర్తి రూరల్ ప్రీమియర్‌లీగ్ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి సీఐ హజరత్తయ్య ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఈ పోటీలు ఉపయోగపడుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసరావు, ఎస్సై మహేంద్ర, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల కమిటీ

కొండపి, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ కొండపి మండల సర్వసభ్య సమావేశం శనివారం సాయంత్రం స్థానిక గ్రామ పంచాయతీలోని దాసరెడ్డిపాలెం ఎంపీ స్కూల్‌లో నిర్వహించారు. సమావేశంలో మండల కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా చల్లా ఆంజనేయులు, అధ్యక్షుడిగా గుమ్మళ్ల సురేష్, ప్రధాన కార్యదర్శిగా ఎం. మాలకొండయ్య, మహిళా కార్యదర్శిగా కె.గోదావరమ్మ, కోశాధికారిగా విరాట్‌బాబు, సహ అధ్యక్షురాలిగా వై. పిచ్చమ్మ ఎంపికయ్యారు. ఎన్నికల కార్యక్రమాన్ని సంఘం జిల్లా కార్యదర్శి కె. వెంకయ్య పరిశీలకుడిగా సంఘం జిల్లా నాయకుడు కె. రమేష్ పాల్గొన్నారు.

30 లోపు దరఖాస్తులు చేసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని నేషనల్ హెల్త్ మిషన్, డీఈఐసీ ప్రోగ్రామ్‌లో ఖాళీగా ఉన్న ఒక సైకాలజిస్ట్ పోస్టులో నియమించేందుకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 25నుంచి 30వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ పద్మజ శనివారం ఒక ప్రకటనలో కోరారు. పూర్తి చేసిన దరఖాస్తులతోపాటు ధృవీకరణపత్రాల నకలు జతపరిచి స్వయంగా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఆ తర్వాత వచ్చే దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లో స్వీకరించబోమని స్పష్టం చేశారు.

సైన్స్‌కు కట్టుబడినదే నిజమైన ధర్మం

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సైన్స్‌కు కట్టుబడి ఉన్నదే అదే నిజమైన ధర్మమని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో శనివారం దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జరిగిన సనాతన ధర్మమా- సామాజిక న్యాయమా అనే అంశంపై జరిగిన సదస్సుకు జిల్లా అధ్యక్షుడు పూర్ణకంటి తిరుమలయ్య అధ్యక్షత వహించారు ఈ సదస్సులో హేతువాది, సాహితీ విమర్శకులు ముత్తెటి రవీంద్రనాథ్ సనాతన ధర్మం అంటే పుట్టుక లేనిదన్నారు. ఇది కేవలం నమ్మకం మాత్రమేనన్నారు. డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కరవది సుబ్బారావు మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం మనకు లభించిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతత్వం, వాక్ స్వాతంత్రం వంటి వాటిని కాపాడుకుంటూ సమాజంలో అభివృద్ధి చెందేందుకు ప్రతి ఒక్కరూ చైతన్యం పొందాలన్నారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు చావలి సుధాకర్, బి.రఘురాం, పేరయ్య, గద్దల బాలకోటయ్య, ముత్తన అంజయ్య, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు కందుకూరులో మాలల మహాగర్జన



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు అశోక్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎస్సీల ఉపవర్గీకరణ, క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా ఆదివారం కందుకూరులోని ఏబీఎం ఆవరణలో జరిగే మాలల మహాగర్జనను విజయవంతం చేయాలని మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్ పిలుపునిచ్చారు. ఒంగోలులోని అంబేడ్కర్ గ్రంథాలయంలో శనివారం మాలల మహాగర్జన కరపత్రాలను ఆవిష్కరించిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాల ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చిడితోటి శ్రీరాములు మాట్లాడుతూ కందుకూరు సభను ఒక ఆశయంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి యరమాల మల్లికార్జున, దార్ల నరసింహం, పొనుగోటి రామారావు, మాల్యాద్రి, బంటుపల్లి రాజు, రవి, లక్ష్మీనారాయణ, మిట్నసల శాంతారావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



ఉపాధ్యాయులను సత్కరించిన అతిథులు, నిర్వాహకులు

కొత్తపట్నం, నవంబరు23(ఆంధ్రజ్యోతి): కొత్తపట్నం జడ్పీ హైస్కూలులో శనివారం ఉత్తమ ఉపాధ్యాయ ప్రతిభా పురస్కారాల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఒంగోలులోని శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్, శ్రీరామ్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆద్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. కందుకూరు సబ్‌కలెక్టర్ శ్రీపూజ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మండలంలోని పలు పాఠశాలలో పని చేస్తున్న వారిని ఉత్త ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి వారికి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రతిభా పురస్కారంతో సత్కరించారు. అల్లూరు ఎస్సీ కాలనీ పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్.విజయకుమార్. ఈతముక్కల జడ్పీ హైస్కూల్‌కు చెందిన గోలి శివయ్య, కొత్తపట్నం జడ్పీ హైస్కూల్‌కు చెందిన కోడూరి ధనలక్ష్మి, శ్రీవాణివిద్యానికేతన్ పాఠశాల నుంచి జయకృష్ణాపర్, బి.రమేష్‌కు అవార్డులు, నగదు బహుమతి, ప్రశాంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ చాపల వంశీకృష్ణ, డాక్టర్ శాంతకుమారి, డిప్యూటీ డీవో మల్లేశ్వరరావు, వాణి విద్యానికేతన్ కరస్పాండెంట్ కోటేశ్వరరావు, ఎంఈవోలు తులసికుమారి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ



బస్టాండు సెంటరులో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపడుతున్న పోలీసులు

ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్ అవుట్‌గేట్‌గా మార్పు

సాగర్ సెంటర్ వద్ద సిగ్నల్స్ తొలగింపు

ఒంగోలు(క్రైం), నవంబరు23 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అధికారులు పలు చర్యలు చేపట్టారు. శనివారం ట్రాఫిక్ సీఐ వై.పాండురంగరావు, ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుధాకరరావు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పలు నిర్ణయాలు తీసుకున్నారు. ప్రస్తుతం సాగర్‌సెంటర్‌లో సిగ్నల్ వ్యవస్థను నిలిపివేశారు. అదేవిధంగా ఆర్టీసీ బస్టాండ్ అవుట్ గేటు ఎదురుగా ఉన్న 60 అడుగుల రోడ్డును మూసి వేశారు. ఇప్పటి వరకు ఉన్న అవుట్ గేట్‌ను ఇన్‌గేట్‌గా, ఇన్‌గేట్‌ను అవుట్ గేటుగా మార్పు చేశారు. అదేవిధంగా బస్టాండ్ వెనుక వైపు ఉన్న గేట్‌ను తెరచి అంజయ్యరోడ్డులో నుంచి పశ్చిమ ప్రాంతం వైపు నుంచి వచ్చే బస్సులకు అవకాశం కల్పించారు. దీంతో ఆర్టీసీ బస్టాండ్‌లో రెండు ఇన్‌గేట్‌లు, ఒక అవుట్‌గేట్ ఉంటుంది. అదేవిధంగా బస్టాండ్‌లో ప్లాట్‌ఫాంల వెనుక వైపు ప్రహరీ వెంట ఉన్న టూవీలర్ పార్కింగ్ తీసి వేశారు. అదేవిధంగా బస్టాండ్‌లో బస్సులు నిలుపు దిశలు కూడ మార్చినట్లు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.

బాల్య వివాహాలకు దూరంగా ఉండాలి

● ఎస్ఐ రమేష్‌బాబు

మర్రిపూడి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : బాల్యవివాహాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ టి.రమేష్‌బాబు కోరారు. శనివారం రావెళ్ళవారిపాలెం కేజీబీవీ విద్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. బాల్య వివాహాలు చట్టపరంగా నేరమని పేర్కొన్నారు. బాల్య వివాహాలతో ఆరోగ్యపరమైన సమస్యలను ఎదుర్కోవలసి వస్తుందని చెప్పారు. స్మార్ట్ ఫోన్‌ల వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇటీవల కాలంలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం వంటి సామాజిక మాధ్యమాలను ఎంచుకొని సైబర్ నేరగాళ్ళు విజృంభిస్తున్నారని హెచ్చరించారు. అనవసరమైన లింకులను ఓపెన్ చేయవద్దని కోరారు. క్రమ శిక్షణతో కూడిన జీవితాన్ని అలవర్చుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా బాలికలు స్వీయ రక్షణకోసం ఉన్న చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. నిరక్షరాస్యులైన తల్లిదండ్రులను కూడా చైతన్య వంతులను చేయాలని ఆయన కోరారు.



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమేష్‌బాబు

గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

కొండపి: సెల్‌ఫోన్ వినియోగంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కొండపి సీఐ సోమశేఖర్ అన్నారు. కె.ఉప్పలపాడు గ్రామంలోని జడ్పీ స్కూల్‌లో విద్యార్థులకు పలు అంశాలపై సీఐ శనివారం అవగాహన కలిగించారు. సైబర్ నేరాలు, బ్యాడ్ టచ్, గుడ్ టచ్, గంజాయి లాంటి మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై సీఐ విద్యార్థులకు అవగాహన కలిగించారు. బాలికలు అప్రమత్తంగా ఉండాలని అనుమానిత విషయాలను తల్లితండ్రులకు వెంటనే తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై ప్రేమ్‌కుమార్ స్కూల్ హెచ్‌ఎం సుసన్నకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడిన అదానీని అరెస్టు చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): భారీ ఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న అదానీని తక్షణమే అరెస్టు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ డిమాండ్ చేశారు. శనివారం ఒంగోలులోని సాగర్‌సెంటర్‌లో సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యుడు జి.రమేష్ అధ్యక్షతన నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ అదానీ గ్రూపుతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న అన్ని రకాల ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదానీపై అమెరికా కోర్టులో వ్యాజ్యం నమోదు నేపథ్యంలో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ అదానీ గ్రూపులకు కేటాయించిన భూములను, ప్రజల సంపదను వెనక్కు తీసుకోవాలన్నారు. విశాఖ డేటా సెంటర్‌ను ప్రభుత్వమే నిర్వహించాలని చెప్పారు. లంచాలు తీసుకున్న అవినీతిపరుల వివరాలను అమెరికా ప్రభుత్వం నుంచి పొందేందుకు కేంద్ర ప్రభుత్వం దౌత్యపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు జీవీ.కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, కె.రమాదేవి, బాలకోటయ్య, టి.మహేష్, దారా వెంకటేశ్వర్లు, దామా శ్రీనివాసులు, విశ్వసేన్, రాజేశ్వరి, కె.శ్రీనివాసరావు, జి.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హనీఫ్

ఒంగోలులో బీజేపీ నేతల సంబరాలు



బాణసంచా పేలుస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్రలో జరిగిన ఎన్నికలు, ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించారు. పార్టీ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ యోగయ్యాయాదవ్ ఆధ్వర్యంలో స్థానిక చర్చిసెంటర్‌లో టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రలో చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు మరోసారి బీజేపీ కూటమికి అధికారం కట్టబెట్టారని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వాన్ని మరోసారి బలపర్చారన్నారు. కాంగ్రెస్ పార్టీకి మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ ప్రజలు తగిన బుద్ధి చెప్పారని విమర్శించారు. రాహుల్ గాంధీ దేశ ప్రజలను కులాలవారీగా విభజించాలని చూస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు బొద్దులూరి ఆంజనేయులు, ఆంజనేయులు, సీతారామయ్య అనిల్, విజయ్, కె.రవి, పి.మధు, కటారి సుధాకర్, సత్యనారాయణ, గుర్రం రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు



బహుమతులను అందుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొండపి, నవంబరు23 (ఆంధ్రజ్యోతి): ముప్పవరం జడ్పీహెచ్‌ఎస్‌లోని 8,9,10 తరగతుల్లో ప్రతిభ కనపరుస్తున్న విద్యార్థులకు రూ. 50 వేల నగదును బహుమతిగా శనివారం గ్రామానికి చెందిన దివంగత ప్రిన్సిపాల్ బొడ్డపాటి వెంకట రమణయ్య భార్య బి.విజయలక్ష్మి అందజేశారు. ముప్పవరం గ్రామానికి చెంది పదవీవిరమణ చేసిన దివంగత ప్రిన్సిపా ల్ బొడ్డపాటి వెంకట రమణయ్య జ్ఞాపకార్థం శనివారం స్కూల్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఆర్. శ్రీదేవి దాతల సే వాగుణాన్ని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు బత్తుల నారాయణస్వామి, ఎంఈవోలు సురేఖ, రామారావు, ఉపాధ్యాయులు చల్లా ఆంజనేయులు, నెప్పల ప్రసాద్ పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కేసులు

ఒంగోలు(క్రైం), నవంబరు23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే మద్యం సరఫరా చేసిన వైన్‌షాప్‌ల యజమానులపై కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు హెచ్చరించారు. శనివారం ఒంగోలు రూరల్ సర్కిల్ పరిధిలోని వైన్‌షాపుల యజమానులతో స్థానిక సీఐ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మద్యం అధిక ధరలకు విక్రయించకూడదన్నారు. బెల్ట్‌షాపులకు మద్యం సరఫరా చేయకూడదని తెలిపారు. వైన్ షాప్‌లకు సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. సమావేశంలో రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు, ఎక్సైజ్ సీఐలు ఎం.లీనా, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభలు

ఒంగోలు విద్య, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ స్వర్ణోత్సవ జిల్లా మహాసభలు ఆది, సోమవారాల్లో ఒంగోలు నగరం సంతపేటలోని టీడీపీ కళ్యాణ మండపంలో జరుగుతాయని జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఓవీ.వీరారెడ్డి, డి.వీరాంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9గంటలకు స్థానిక పీవీఆర్ బాలుర హైస్కూలు నుంచి ర్యాలీ జరుగుతుందన్నారు. ఈసభలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, డీఈవో కిరణ్‌కుమార్, సంఘ నాయకులు హాజరవుతారని, సభ్యులందరూ పాల్గొలని కోరారు.

పనివేళల పెంపును ఉపసంహరించుకోవాలి

ఒంగోలు విద్య, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉన్నత పాఠశాలల పనివేళల పెంపును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.జనార్దన్‌రెడ్డి, డి.శ్రీనివాసులులు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో మండలానికి ఒక హైస్కూలు ఈనెల 20నుంచి 30వ తేదీ వరకు ఉదయం 9 సాయంత్రం 5 గంటల వరకు పైలట్ ప్రాజక్టులో భాగంగా నిర్వహించాలని ఆదేశించారన్నారు. ఈ పనివేళలు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నత పాఠశాలలకు పక్క గ్రామాలనుంచి వచ్చే విద్యార్థులకు అంతగా అనుకూలమైన సమయం కాదన్నారు. ప్రధానంగా బాలికలు ఇబ్బందులు పడే పరిస్థితి ఉన్నందున చర్యలు తీసుకోవాలన్నారు.

మహాధర్నా కరపత్రాల పంపిణీ

సంతనూతలపాడు, నవంబరు 23: మాచవరంలో కూలీలకు వ్యవసాయ కార్మికసంఘం జిల్లాకార్యదర్శి కంకణాల ఆంజనేయులు ఈనెల 26న కలెక్టరేట్ వద్ద జరిగే మహాధర్నా కరపత్రాలను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నెరుసుల వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఆటోనగర్‌లోని సమస్యలను పరిష్కరించాలి

● కార్మికుల నిరసన

ఒంగోలు(రూరల్), నవంబరు23(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం త్రోవగుంట పరిధిలోని ఆటోనగర్ లోతట్టుగా ఉండటంతో కార్మికులు, దుకాణ యజమానులు ఇబ్బందిపడుతున్నారు. దీంతో శనివారం స్థానిక ఆటోనగర్‌లోని రోడ్డులో గల బురదలో వారు నిల్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటోనగర్ లోతట్టుగా ఉండటంతో వర్షం పడితే పూర్తిగా జలమయమై పోతోందని చెప్పారు. ఈ నీరు రోజుల తరబడి ఉండటంతో పనులు జరగక పోవటంతో పనులు లేకపోవటం, షాపులు మూత పడి ఉండటంతో నష్టపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు రెండు నెలలు నుంచి వర్షాలు పడిన దగ్గర నుంచి బురదలో పనులు చేసుకోలేకపోతున్నామని వాపోయారు. అధికారులు, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ స్పందించి ఆటోనగర్ సమస్యలను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు, షాపు యజమానులు, కార్మికులు పాల్గొన్నారు.



బురదలో నిల్చోని నిరసన తెలుపుతున్న కార్మికులు

అధ్యాపకురాలికి అభినందన



కోటేశ్వరికి పీహెచ్‌డీ పట్టాను అందిస్తున్న వీసీ మూర్తి

ఒంగోలు విద్య, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్శిటీలో అతిథి అధ్యాపకురాలిగా పనిచేస్తున్న కట్టా కోటేశ్వరి కృష్ణా యూనివర్శిటీ నుంచి మాథ్స్ విభాగంలో పీహెచ్‌డీ పొందారు. కృష్ణా యూనివర్శిటీకి చెందిన మదన్‌మోహన్‌రావు పర్యవేక్షణలో జనరల్ సొల్యూషన్స్ ఆఫ్ సర్ జార్జి స్టోక్స్ అల్బర్ట్ బ్రింక్మెన్ అండ్ ఒసీన్ ఈక్వేషన్స్ అనే అంశంపై పరిశోధన పూర్తి చేయడంతో ఆమెకు పీహెచ్‌డీ పట్టా లభించింది. ఈ సందర్భంగా కోటేశ్వరిని శనివారం స్థానిక యూనివర్శిటీలో వీసీ డీవీఆర్.మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు, ప్రిన్సిపాల్ రాజమోహనరావు, వైస్ ప్రిన్సిపాల్ నిర్మలామణి, డాక్టర్ కేవీఎస్.రాజు, కె.గంగాధర్, జడ అరుణ్‌కుమార్, కృష్ణ, నరసింహారావు తదితరులు అభినందించారు.

30న గెస్ట్ అధ్యాపకుల పోస్టులకు ఇంటర్వ్యూలు

ఒంగోలు విద్య, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్ గెస్ట్ అధ్యాపకుల పోస్టులకు ఈనెల 30న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా అభ్యర్థులకు ఎంపికలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. బీపీఈడీ, ఎంపీఈడీ పోస్టు గ్రాడ్యుయేట్ సబ్జెక్టుల్లో కనీసం 60శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. నెట్/స్లెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుదని, అధ్యాపకులు నేరుగా ఇంటర్వ్యూకు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఆమె కోరారు.

విద్యార్థులకు నాసా కిట్లు పంపిణీ



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం వీఐపీరోడ్డులోని శ్రీ చైతన్య సీ బ్యాచ్ విద్యార్థులకు బుధవారం సానా కిట్లను పంపిణీ చేశారు. నాసా కో ఆర్డినేటర్ వెంకటరమణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నాసా ప్రయోగాలు, ప్రాధాన్యతలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అపర్ణశిరీష, ఆర్ఐ అనిల్, ఎకడమిక్ కో ఆర్డినేటర్ జి.శ్రీనివాసులు, డీన్ శ్రీనివాసులు, నారా ఇన్‌చార్జి వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అప్రమత్తంగా మెలగాలి : ఎస్ఐ

నాగులుప్పలపాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సమాజంలో జరుగుతున్న పరిణామాలను అర్థం చేసుకుంటూ విద్యార్థులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శ్రీకాంత్ సూచించారు. శనివారం బి.నిడమానూరు జడ్పీ హైస్కూలులో నేరాలు, రోడ్డు ప్రమాదాలు, హెల్మెట్ వాడకంతో తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలతో పాటు బాలికలు, మహిళలపై లైంగిక దాడులు జరుగుతున్నాయని, వాటిపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సెల్‌ఫోన్‌లలో వచ్చే అనుమానిత కాల్స్, సందేశాలు, లింక్‌లకు స్పందించకూడదని చెప్పారు. అనుమానిత వ్యక్తుల సంచారం, విద్యార్థులకు ఏదైనా సమస్య వస్తే నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కరీంసాహెబ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దేశభక్తి, క్రమశిక్షణ, ఐకమత్యం వంటి లక్షణాలను ఎన్‌సీసీ పెంపొందిస్తుందని 34వ బెటాలియన్ హవల్దార్ వెంకట నారాయణ పేర్కొన్నారు. ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒంగోలులోని పేస్ ఎస్ఆర్ ఒలంపియాడ్ స్కూలులో శనివారం పరేడ్‌ను నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో వెంకటనారాయణ మాట్లాడుతూ క్యాడెట్లకు త్రివిధ దళాలు, రాష్ట్ర పోలీస్ నియామక పరీక్షల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్కూలు డైరెక్టర్ పి.నాగేశ్వరరావు, ఎన్‌సీసీ ఇన్‌స్పెక్టర్లు మహేంద్ర, పీఈటీ రాంబాబు పాల్గొన్నారు.



పేరెడ్ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

ఏడు లారీలు సీజ్

ఒంగోలు(క్రైం), నవంబరు23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించకుండా రోడ్డు మెటల్ తరలిస్తున్న ఏడు లారీలను సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ అధికారి టి.రాజశేఖర్ తెలిపారు. శుక్రవారం రాత్రి చీమకుర్తి నుంచి ఒంగోలుకు రోడ్డు మెటల్ లారీలలో తరలిస్తుండగా పేర్నమిట్ట వద్ద భూగర్భగనులు శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి సీజ్ చేశారు. ఒక్కో లారీకి రూ.98,150 అపరాధ రుసుం విధించారు. ఈ తనిఖీలలో జిల్లా మైనింగ్ అధికారితోపాటుగా ఏజీ రవివర్మ, ఆర్ఐ ఆర్.అరవింద్, టీఐ కె.రాజినాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాల పంపిణీ

దొనకొండ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక గౌతమి డిగ్రీ కళాశాల విద్యార్థులకు శనివారం తెలుగుయువత నియోజకవర్గ కార్యదర్శి కుందుర్తి లక్ష్మణ్ నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఒక్కో విద్యార్థికి ఆరు నోట్‌బుక్స్ చొప్పున 40 మందికి అందజేశారు. ఈసందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. ఈసందర్భంగా లక్ష్మణ్‌ను కళాశాల చైర్మన్ గుండారెడ్డి, సీఈవో నాగేంద్రబాబు, ప్రిన్సిపాల్ రామయోగి, అడ్మిన్ నాని, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోడి వెంకటేశ్వర్లు, కొమ్మతోటి సుబ్బారావు, మోడి పెద్దఆంజనేయులు, షేక్ తోహీద్, పోతిపోగు చెన్నయ్య షేక్ మస్తాన్, ఫయాజ్‌లు పాల్గొన్నారు.

నేడు కార్తీక వనభోజనాలు

పామూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుమునిగిరి క్షేత్రంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజన మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య బంధువుల పరిచయాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

కోదండ రామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

పామూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తూర్పువీధిలో గల శ్రీకోదండ రామస్వామి రామాలయం నిర్మాణం జరిగి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం నుంచి సోమవారం వరకు వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం స్వామివార్లకు శాంతి కల్యాణం, మహా అన్నదాన కార్యక్రమాలు, సాయంత్రం గ్రామోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

పామూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక సూర్యచంద్ర సేవా సంస్థ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ డీవీ మనోహార్ ఆధ్వర్యంలో హైదరాబాద్ వాస్కులర్ ఏషియన్ హాస్పిటల్ తరుపున ఉచిత రక్తనాళ వైద్య పరీక్షలు ఆదివారం స్థానిక పద్మావతి అతిథి గృహంలో నిర్వహిస్తున్నట్లు మనోహార్ తెలిపారు. శిబిరానికి సంబంధించిన కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు.

నేడు నారాయణస్వామి దేవస్థానంలో మహాపుష్ప యాగం

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం మహా పుష్పయాగం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కొమ్మినేని చినఆదినారాయణ, ఈవో గిరిరాజు నరసింహాబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పంచామృత అభిషేకాలు, గోపూజా కార్యక్రమం, స్వామి వారికి నివేదన, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం కోలాటం, అఖండ దీపారాధన, రాత్రి పల్లకి సేవ, మహా పుష్పయాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

పీసీపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదయిర్లపాడులో అక్రమంగా అమ్ముతున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జి.కోటయ్య తెలిపారు. అందిన సమాచారం మేరకు శనివారం తన సిబ్బందితో వెళ్లి దుకాణాన్ని తనిఖీ చేయగా పది మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయని తెలిపారు. మాల్యాద్రి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలి

పీసీపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో కష్టపడి చదివితే ఉన్నతస్థాయికి చేరుకోవచ్చని ఎస్సై జి.కోటయ్య అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏదైనా సమస్య వస్తే 100 టోల్‌ఫ్రీ నెంబరుకు కాల్ చేయాలని చెప్పారు.

వెంకటాపురంలో రైతులకు అవగాహన కార్యక్రమం

పామూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కంది పంటలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఏవో కె.రాధ రైతులకు సూచించారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో జరిగిన పొలం బడి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కందిలో మరక మచ్చల పురుగు, జీవిత చక్రం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో పి.నాగేశ్వరరావు, వీఏఏ బి.అవినాష్, ఎఫ్‌పీవో చైర్మన్ మౌలాలిరెడ్డి, ఉడుముల ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పి.వెంకట్రావు పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వేలు నిర్వహించాలి

» డీపీవో గొట్టిపాటి వెంకటనాయుడు

ముండ్లమూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన అన్నిరకాల సర్వేలను పంచాయతీ కార్యదర్శి మొదలుకొని సచివాలయ సిబ్బంది వరకు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) గొట్టిపాటి వెంకటనాయుడు అన్నారు. శనివారం సాయంత్రం ఆయన మండలంలోని ఈదర గ్రామాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహాల మ్యాపింగ్ సర్వేతో పాటు పలురకాల సర్వేలను చేపట్టిందన్నారు. ప్రతి ఇంటిని మ్యాపింగ్ చేసి నాలుగువైపులా కొలతలు తీయటం వల్ల ఆ ఇంటికి పన్ను నిర్ధారించవచ్చునని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా సర్వేలు చేపట్టినట్లయితే ఇంటి యజమానులకు భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. 2018లో చేపట్టిన సర్వే తిరిగి 2024లో ప్రారంభమైందన్నారు. ఇలాంటి సర్వే చేపట్టడంతో పాటు కొత్త గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారుల ఇంటి పన్ను కూడా నిర్ధారణ చేయ వచ్చునని చెప్పారు. సెలవు దినమైన ఆదివారం కూడా సర్వే చేపట్టాలన్నారు. డిజిటల్ అసిస్టెంట్‌లు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు సర్వేలో పాల్గొనాలన్నారు. సోమవారానికి కల్లా 50 శాతం పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంటి పన్ను వసూలు కూడా వేగవంతం చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు.



తాళ్లూరు: సచివాలయ సిబ్బందికి సూచనలు చేస్తున్న డీపీవో వెంకటనాయుడు

కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.జనార్దన్, సర్పంచ్ వంగల పద్మావతి శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి జె.శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల రికార్డులను డిజిటలైజేషన్ చేయాలి

తాళ్లూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల రికార్డుల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి గొట్టిపాటి వెంకటనాయుడు అన్నారు. తాళ్లూరు సచివాలయం-1, 2లను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిపన్నుల వసూళ్లు పెంచి అసెస్‌మెంట్ నంబర్ల కేటాయింపు వేగవంతం చేయాలన్నారు. సచివాలయానికి సంబంధించిన పనులు త్వరితగతిన పనిచేసే విధంగా సచివాలయ సిబ్బందిని ఉపయోగించుకోవాలని ఎంపీడీవోకు సూచించారు. ఖచ్చితమైన డేటాను అప్‌లోడ్ చేసే బాధ్యత పూర్తిగా గ్రామ కార్యదర్శులదేనని స్పష్టం చేశారు.

సచివాలయం-2లో మురుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటం చూసి సిబ్బందిపై డీపీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటిని శుభ్రం చేసేందుకు కార్మికుని నియమించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.సుందరరామయ్య, గ్రామ కార్యదర్శి కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

కోల్డ్‌స్టోరేజీ నిర్మాణానికి నిధుల మంజూరుకు మంత్రి హామీ

దర్శి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నిలిచిపోయిన కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెనాయుడు హామీ ఇచ్చారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు మంత్రిని సచివాలయంలో కలిసి అభివృద్ధి పనులపై చర్చించారు. నిలిచిపోయిన పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు విడుదల చేయాలని కోరారు. అందులోభాగంగా గత టీడీపీ ప్రభుత్వం హయాంలో ఆరంభించి మధ్యలో నిలిచిపోయిన కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని కోరగా మంత్రి అచ్చెనాయుడు నిధులు విడుదల చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చినట్లు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. నియోజకవర్గంలో అగ్రికల్చర్ ప్రాజెక్టు అభివృద్ధికి కృషి చేయాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఆమె తెలిపారు.



మంత్రి అచ్చెనాయుడుతో చర్చిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు



పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, శాస్త్రవేత్తలు

తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

దర్శి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పైర్లలో తెగుళ్ల నివారణకు ముందస్తు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం రైతులకు శిక్షణ, పంటల సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులు అవలంబించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. అనంతరం వ్యవసాయ పరిశోధన కేంద్రంలో సాగుచేసిన వివిధ రకాల పంటను సందర్శించారు. అక్కడ చేపట్టిన ఆధునిక పద్ధతులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన అధికారి డాక్టర్ సంధ్యారాణి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వరప్రసాదరావు, డాక్టర్ జి.రమేష్, డాక్టర్ రవీంద్రబాబు, ఏడీఏ బాలాజీనాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల సమ్మర్ రివిజన్‌ను విజయవంతం చేయాలి

దర్శి నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల సమ్మర్ రివిజన్ కార్యక్రమంలో అర్హులైన యువతీ యువకులందరూ తమపేర్లను ఓటర్ల జాబితాలో చేర్చుకోవాలని నియోజకవర్గ ఎలక్ట్రోల్ అధికారి ఎంపీఎస్ లోకేశ్వరరావు సూచించారు. నియోజకవర్గంలో శనివారం నిర్వహించిన సమ్మర్ రివిజన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. పలుచోట్ల పోలింగ్ కేంద్రాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మర్ రివిజన్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని పనిచేయాలన్నారు. నిర్లక్ష్యవైఖరి అవలంబిస్తే ఉపేక్షించమని హెచ్చరించారు. గతంలో కొందరు విధులు సక్రమంగా నిర్వహించని వారిపై చర్యలు తీసుకున్న విషయాన్ని గుర్తుచేశారు. ఓటర్ల చేర్పులు, మార్పుల కార్యక్రమాన్ని నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమం లో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న లోకేశ్వరరావు

దొనకొండలో..

దొనకొండ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ చేపట్టిన సమ్మర్ రివిజన్ కార్యక్రమంలో ఓటర్ల చేర్పులు, మార్పులు విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎంపీఎస్ లోకేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో శనివారం నిర్వహిస్తున్న ఓటర్ల రివిజన్ ప్రత్యేక కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఫారం-6, ఫారం-7, ఫారం-8, జీరో హౌస్ నెంబర్లు, ఫొటోల నమోదు తదితర విషయాలపై బీఎల్‌వోలకు తగు సూచనలు చేశారు. గ్రామాల్లో అర్హులైన ప్రతిఒక్కరూ ఓటర్లుగా నమోదు చేయించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

వ్యవసాయ చట్టాలను నీరుగార్చటం దుర్మార్గం

కనిగిరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు వ్యవసాయ చట్టాలను నీరుగార్చేవిధంగా నల్లచట్టాలు తేవటం దుర్మార్గమని కిసాన్‌మోర్చా జిల్లా నాయకుడు చుండూరి రంగారావు అన్నారు. రైతాంగ సమస్యలపై పట్టణంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ శనివారం ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయరంగం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లభించక అప్పుల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయరంగాన్ని లాభదాయకంగా ఉండేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. వ్యవసాయ చట్టాలను నీరుగారుస్తూ కార్పొరేట్లకు రెడ్‌కార్పెట్ పరచటం దారుణమన్నారు. వ్యవసాయరంగ సమస్యల పరిష్కారం కోసం రైతులంతా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈనెల 26న ఒంగోలులో కలెక్టరేట్ వద్ద సంయుక్త కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో జరిగే మహాధర్నా కార్యక్రమంలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కార్యక్రమంలో కిసాన్‌మోర్చా జిల్లా నాయకులు వీరారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు బడుగు వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకుడు పిల్లి తిప్పారెడ్డి, సీపీఐ నాయకుడు గుజ్జుల బాలిరెడ్డి, పీసీ కేశవరావు, శాంతకుమారి, నరేంద్ర, ఓబయ్య, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిసాన్‌మోర్చా జిల్లా నాయకుడు చుండూరి రంగారావు

భైరవకోనలో కరికాల వలవన్ ప్రత్యేక పూజలు

సీఎస్‌పురం(పామూరు), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోన దేవస్థానంలోని త్రిముఖ దుర్గాంబ అమ్మవారిని దేవదాయ శాఖ ప్రిన్సిపల్ మాజీ సెక్రటరీ కరికాల వలవన్ శనివారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు స్వామివారి శేష వస్త్రాలతో సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్తీక మాసంలో భైరవకోనను దర్శించుకోవడం ఆనందంగా ఉందని వలవన్ పే ర్కొన్నారు.



భైరవకోనలో పూజలు నిర్వహిస్తున్న కరికాల వలవన్

సీపీఎం మండల కార్యదర్శిగా ఆంజనేయులు

ముండ్లమూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సీపీఎం మండల కార్యదర్శిగా వెల్లంపల్లి ఆంజనేయులను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వేంపాడులో శనివారం జరిగిన సీపీఎం మండల మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఆంజనేయులు, సభ్యులుగా పంటా ఏడుకొండలు, కె.రమాదేవి, గంగినేని సత్యనారాయణ, బి.రాజా రమేష్, గాలి వెంకటేశ్వర్లు, షేక్ మీరావలిలను ఎన్నుకున్నారు. సభలో ముఖ్యఅతిథులుగా సీపీఎం రాష్ట్ర నాయకుడు జాలా అంజయ్య, జిల్లా నాయకుడు కంకణాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

98 మందికి ఉచిత వైద్య పరీక్షలు

కనిగిరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కంటి చూపు సమస్యతో బాధపడే వారికి స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జననీ చారిటబుల్ ట్రస్ట్, శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణా సంస్థ సంయుక్త సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 98మందికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 79 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని శంకర కంటి ఆసుపత్రి డాక్టర్ సిద్ధార్థ నిర్ధారించారు. వీరిని ఆదివారం ఉదయం పది గంటలకు అమరావతి గ్రౌండ్స్ నుంచి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఏర్పాటుచేసిన ప్రత్యేక వాహనాల్లో పెదకాకాని శంకర కంటి ఆసుపత్రికి తరలించనున్నారు. కంటి పరీక్షలకు వచ్చిన వారికి ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ఐటీడీపీ నాయకుడు జంషీర్ అహ్మద్ పర్యవేక్షించారు.



ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డిని ఆహ్వానిస్తున్న కాపుసంఘం నాయకులు

కాపు వనభోజన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

కనిగిరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాపు వనభోజన మహోత్సం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాపు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు డాక్టర్ ఆర్.రామయ్య నాయుడు కోరారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే ఉగ్రనరసింహా రెడ్డిని శనివారం కలిసి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా రామయ్యనాయుడు మాట్లాడుతూ ఆదివారం మండలంలోని నందనమారెళ్ళ బాలార్క కోటేశ్వరస్వామి సన్నిధిలో వన భోజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నియోజవర్గంలోని వివిధ మండలాల నుంచి కాపు కుటుంబసభ్యులు తరలిరావాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని కాపు రాజకీయ ప్రముఖులు పాల్గొననున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రను ఆహ్వానించిన వారిలో భైరవ కృష్ణ, చమిడిశెట్టి (బొట్టు) శ్రీనివాసులు, పసుపులేటి అరుణోదర్, ముండ్లమూరి మాల కొండయ్య, నామా పుల్లయ్య, కొట్టే ప్రసాద్, కదిరి ప్రసాద్, వీరయ్యనాయుడు, చిరివెళ్ళ ప్రసాద్, నారాయణ, నరసయ్య తదితరులు ఉన్నారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కురిచేడు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న పల్లె పండుగ పనులను శనివారం ఎంపీడీవో సతీష్‌బాబు పరిశీలించారు. బోదనంపాడు గ్రామంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపించకూడదన్నారు. ప్రభుత్వం పల్లె పండుగ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టిందని చెప్పారు. ఆ పనులలో ఎక్కడా నాణ్యతా లోపం ఉండకూడదన్నారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు.

పట్టణ పరిశుభ్రతకు భంగం కల్గిస్తే చర్యలు

కనిగిరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిశుభ్రతకు భంగం కల్గిస్తే కఠిన చర్యలకు ఉపక్రమిస్తామని మున్సిపల్ కమిషనర్ జోసఫ్ డానియేలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కనగిరి పట్టణాన్ని బహిరంగ విసర్జన రహిత పురపాలక సంఘంగా తీర్మానించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపాల్టీ పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పట్టణంలోని పొదుపు మహిళా స్వయం సహాయక సభ్యులు, వార్డు సభ్యులతో కలసి బహిరంగ విసర్జనపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా బహిరంగ విసర్జన చేసినవారికి రూ.500 జరిమానా, పది రోజుల జైలుశిక్ష విధిస్తామని హెచ్చరించారు.

మోదీతోనే దేశాభివృద్ధి



విజయోత్సవాలు జరుపుకొంటున్న కూటమి శ్రేణులు

పామూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య అన్నారు. మహారాష్ట్రలో ఎన్డీఏ కూటమి విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా కూటమి శ్రేణులు శనివారం స్థానిక మమ్మిడాడీ సెంటర్‌లో బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈసందర్భంగా రమణయ్య మాట్లాడుతూ ఏన్డీఏ కూటమిని అడ్డుకొనే శక్తి దేశంలో ఏరాజకీయ పార్టీకి లేదన్నారు. మోదీ నాయకత్వంలో భారత్ అగ్రరాజ్యంగా ఎదుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చినసుబ్బయ్య, నాయకులు కేవీ సుబ్బారావు, యు.శ్రీను, విజయకుమార్‌ఆచారి, టీడీపీ నాయకులు బొల్లా నరసింహారావు, ఉప్పలపాటి హరిబాబు, ఇర్రి కోటిరెడ్డి, ముబీనా మౌలాలి, డి.మాల్యాద్రి, మెంటా నరసింహారావు, పాలపర్తి రమణయ్య, చినహజరత్, జనసేన మండల అధ్యక్షుడు ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కనిగిరిలో.. కనిగిరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో జరిగిన ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘనవిజయం పట్ల శనివారం రాత్రి కనిగిరిలో కూటమి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈసందర్భంగా టీడీపీ నాయకుడు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో మోదీ సర్కార్ చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి మహారాష్ట్రలో ఎన్డీయే కూటమి విజయానికి కారణమైందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు ఓలేటి రాధయ్య, టీడీపీ నాయకుడు తమ్మినేని వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలి

ముండ్లమూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి ఎండీ ఫరూక్ రైతులకు సూచించారు. శనివారం మండలంలోని పోలవరంలో మినుము, విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా రబీ సీజ్‌లో అపరాల పంటల సాగులో తీసుకోవాల్సిన వివిధ చర్యలు, విత్తన శుద్ధి, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టి.వెంకటేశ్వరరెడ్డి, బుచ్చిబాబు, మురళీప్రసాదరావు, సర్పంచ్ నంబూరి ఏసయ్య, పంచాయతీ కార్యదర్శి బి.శ్రీనివాసరావు, వీఏఏ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

కనిగిరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ గఫార్ అన్నారు. ఈక్రమంలో ప్రజలు కూడా సహకరించాలని కోరారు. మున్సిపాల్టీ పరిధిలోని 8,9 వార్డులలో విద్యుత్ శాఖ అధికారులతో కలసి శనివారం ఆయన పర్యటించారు. ఆయా వార్డుల్లో విద్యుత్ స్తంభాలు శిథిలమై దెబ్బతిన్నాయి. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటుచేసే క్రమంలో ఆయా వార్డుల్లో కొంతమంది అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఆయా పనులు ముందుకు సాగలేదు. ఇటీవల ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి విద్యుత్ శాఖ అధికారులకు ఇచ్చిన ఆదేశాలతో తిరిగి ఆయా పనులు చేపట్టారు. ఈక్రమంలో స్థానికులు అభ్యంతరం వ్యక్తంచేయగా, మున్సిపల్ చైర్మన్ గఫార్ వారికి సర్దిచెప్పి పనులకు ఆటంకం లేకుండా చేశారు. ఆయా వార్డుల్లో త్రీఫేస్ విద్యుత్ అవసరమని పలువురు కోరగా, అంచనాలు తయారుచేసి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జాస్మిన్‌షఫీ, చొప్పరపు మాధవి, శివ, విద్యుత్ ఏఈ పవన్‌కుమార్, ఎల్ఎం వెంకటయ్య, తిరుపతయ్య, ఖాజా మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దు!

ముండ్లమూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలను సేవించి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ వై.నాగరాజు అన్నారు. శనివారం మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారంలో మత్తు పదార్థాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ నాగరాజు మాట్లాడుతూ మద్యం, గుట్కా, పాన్‌పరాగ్‌లు లాంటివి సేవించటం వల్ల కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయన్నారు. మత్తుకు బానిస అవ్వటం వల్ల ఎంతో నష్టపోవాల్సి వస్తుందన్నారు. గ్రామాల్లో గొడవలు, ఇతర అసాంఘిక కార్యక్రమాలకు మద్యం, మత్తు పదార్థాలే కారణమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వేముల శ్రీను, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

వెలిగండ్ల, నవంబర్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాళ్ళపాలెం గ్రామానికి చెందిన దూదేకుల మస్తాన్ ఈనెల ఒకటో తేదీన చినారికట్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మానవతా దృక్పథంతో తన వంతు సహాయంగా మృతుడి కుటుంబానికి ఎస్ఐ మధుసూదన్ రూ.ఐదు వేలు ఆర్థిక సహాయం అందజేశారు. శనివారం నాగులవరం పాఠశాలలో రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులకు, గ్రామస్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ హెల్మెట్ ధరించకపోవడంతోనే రోడ్డు ప్రమాదంలో మస్తాన్ తలకి తీవ్రగాయాలై మృతి చెందాడన్నారు. ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మండలంలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుంటే సమాచారం అందించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలి

తాళ్లూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అంతరాయం లేకుండా ప్రజలకు, రైతులకు మెరుగగా అందించే విధంగా సిబ్బంది పనిచేయాలని ఈఈ పి.శ్రీనివాసులు అన్నారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శనివారం ఆయన సందర్శించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు. పెండింగ్ బిల్లులను డిమాండ్ మేరకు వసూళ్లు చేయాలన్నారు. విద్యుత్‌కు అంతరాయం జరగకుండా ఎప్పటికప్పుడు జంగిల్ క్లియరెన్సు చేయాలన్నారు. విద్యుత్ పరికరాల అవసరాలపై ఇండెంట్ అందజేయాలన్నారు. సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్లు సరిగా పనిచేసేందుకు తప్పనిసరిగా మెయింటినెన్స్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏఈ శ్రీనివాసరావు, లైన్ ఇన్‌స్పెక్టర్లు కాంతారావు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు గ్రంథాలయానికి శాశ్వత భవనం నిర్మిస్తాం

తాళ్లూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): తాళ్లూరులో ఎంతోకాలంగా అద్దె భవనంలో కొనసాగుతున్న గ్రంథాలయానికి త్వరలో శాశ్వత భవనం నిర్మిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి తెలిపారు. 'సమస్యల వలయంలో గ్రంథాలయం' శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందిచారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అధికారులకు నివేదిక అందజేశారు. తాళ్లూరు గ్రంథాలయానికి గతంలోనే ప్రభుత్వం 0.007 సెంట స్థలం కేటాయించిందని, నిధుల కొరతతో నిర్మించలేదని తెలిపారు. సిబ్బంది కొరతతో స్థానిక గ్రంథపాలకురాలు తాళ్లూరు గ్రంథాలయంతో పాటు ముండ్లమూరు, దర్శి గ్రంథాలయాల్లో విధులు నిర్వహిస్తున్నారని నివేదికలో పేర్కొన్నారు.

త్రుటిలో తప్పిన బస్సు ప్రమాదం

కనిగిరి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందనమారెళ్ల వద్ద శనివారం రాత్రి లారీ, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. కడప నుంచి విజయవాడకు వెళుతున్న బస్సు లారీని ఓవర్‌టేక్ చేసి ముందుకు వెళ్లేక్రమంలో లారీని ఢీకొట్టింది. ఈప్రమాదంలో బస్సు ముందుభాగం దెబ్బతింది. అయితే, ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రయాణికులను మరో బస్సులో పంపేందుకు ప్రయత్నిస్తున్నారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
బాపట్ల జిల్లా వార్తలు
5
ఆదివారం 24 నవంబరు 2024



పట్టభద్ర ఓటర్లు.. 2.90 లక్షలు

- ముసాయిదా జాబితా విడుదల
- అర్హులు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు
- 40వేలకుపైగా దరఖాస్తుల తిరస్కారం

గుంటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కృష్ణ - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికకు సంబంధించి ముసాయిదా ఓటర్ల జాబితాని ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఆరు జిల్లాల్లో కలిపి 2 లక్షల 90 వేల 978 మంది దరఖాస్తులను ఆమోదించి వారికి ఓటుహక్కు కల్పిస్తూ ముసాయిదా ఓటర్ల జాబితాలో చేర్చి విడుదల చేశారు. షెడ్యూల్ ప్రకారం శనివారం సాయంత్రం డ్రాఫ్టు ఓటరు లిస్టుని విడుదల చేసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందజేసింది. ఇంచుమించుగా 40 వేలకు పైగా దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించింది. ఏ కారణంతో ఓటుహక్కుని తిరిస్కరించారో కూడా దరఖాస్తుదారుడు సంబంధిత బీఎల్‌వో/ఏఈఆర్‌వోని సంప్రదించి తెలుసుకోవచ్చు. కాగా తిరస్కరించిన దరఖాస్తులపై అభ్యంతరాలుంటే నివేదించుకునే అవకాశం కల్పించింది. అలానే ఇంకా ఎవరైనా ఓటరుగా నమోదు కాక పోయి ఉంటే కొత్తగా ఫారం-18 దరఖాస్తు చేసుకునే వెసులుబాటుని కల్పించింది. పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటుహక్కు కోసం గుంటూరు, ఎన్టీఆర్, ఏలూరు, కృష్ణ, పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో 3 లక్షల 32 వేల 783 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిని బీఎల్‌వోలు తొలుత పరిశీలించి అన్ని సవ్యంగా ఉంటే ఏఈఆర్‌వోకు నివేదించారు. ఏఈఆర్‌వో తన రిమార్కులతో ఆమోదించడమా, తిరస్కరించడమా అనేది పేర్కొంటూ ఈఆర్‌వోకు పంపారు. ఏఈఆర్‌వోల రిమార్కులు నిబంధనల మేరకు ఉన్నవో, లేవో సరి చూసి ఈఆర్‌వో ఖాజావలి తుది నిర్ణయం తీసుకున్నారు. ఓటరు జాబితాలను దరఖాస్తుదారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సరి చూసుకుని వాటిపై ఏమైనా క్లెయిమ్‌లు/అభ్యంతరాలు ఉంటే నివేదించాలని ఈఆర్‌వో సూచించారు. ఇందుకోసం (మిగతా 6వ పేజీలో..)

ముసాయిదా ఓటర్ల జాబితా..

జిల్లా పేరు	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్లు	మొత్తం
ఏలూరు	8998	5574	0	14572
కృష్ణ	31950	24601	5	56556
ఎన్‌టీఆర్	38270	26110	11	64391
గుంటూరు	50683	35980	16	86679
బాపట్ల	12883	7500	4	20387
పల్నాడు	32576	15814	3	48393
మొత్తం	175360	115579	39	290978

ఉచిత ఇసుకేదీ?

- ఎవరికి ఎప్పుడిచ్చారో చెప్పాలి
- రీచ్‌లకు రౌడీలను కాపాలాపెట్టారు
- జడ్పీ సర్వసభ్య సమావేశంలో సభ్యుల ధ్వజం
- నూరుశాతం ఈ-క్రాప్ బాధ్యత వ్యవసాయశాఖదే
- ఎన్నికల తర్వాత అందరూ ఒకటే : కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని


సమావేశంలో ప్రసంగిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, జడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టినా, ఎంపీ, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు


ఎమ్మెల్యేలు హాజరు కాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

గుంటూరు సిటీ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వం ఉచితంగా ఇసుక అంటుంది. అయితే ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎక్కడ.. ఎప్పుడు.. ఎవరికి ఇచ్చారో చెప్పాలి. ఇసుక రీచ్‌లకు రౌడీలను కాపాలాపెట్టి లోపలికి వస్తే కాళ్లు విరగ్గొడతాం అంటున్నారు. వేల టన్నుల ఇసుక ఇతర రాష్ట్రాలకు వెళ్ళిపోతుంది. అమరావతి మండలంలోని జిడుగు, ధరణికోట, వైకుంఠపురం రీచ్‌ల నుంచి రోయింబవళ్లు వందల లారీల ఇసుక బయటకు పోతుంది. అధికారులు ఏమి చేస్తున్నారు..' అని పలువురు జడ్పీటీసీలు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం జరిగింది. జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా అధ్యక్షత వహించిన సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, ఏసురత్నం, మర్రి రాజశేఖర్, మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, నక్కా ఆనందబాబు, కలెక్టర్ నాగలక్ష్మి, బాపట్ల, పల్నాడు జేసీలు ప్రఖార్ జైన్, సూరజ్‌ధనుంజయ్, సీఈవో జ్యోతిబసు, డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ పాల్గొన్నారు. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ సభ్యులు చెప్పే సమస్యలు విని, వాటికి పరిష్కారం అన్వేషించేందుకే తాను ఈ సమావేశంలో పాల్గొన్నట్లు చెప్పారు. ఎన్నికల వరకే రాజకీయాలని ఆ తర్వాత అందరూ ఒకటేనని చెప్పారు. జిల్లా పరిషత్ నూతన భవన నిర్మాణం కోసం అవసరమైన నిధులను ఎక్కడ నుంచి తీసుకురావచ్చో ఆలోచించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. వరి కోతలు ఆరంభమైనా కొనుగోలు కేంద్రాలు తెరవలేదని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీ హనుమంతరావు ప్రశ్నించారు. దీనిపై బాపట్ల జేసీ స్పందిస్తూ మంగళవారం నాటికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరుస్తామని చెప్పారు. తేమ ఎక్కువ ఉందని పత్తి కొనుగోలు చెయ్యకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఎమ్మెల్సీ రాజశేఖర్ ప్రస్తావించగా, కేంద్ర మంత్రి పెమ్మసాని జోక్యం చేసుకుని ఈ సమస్య తన దృష్టికి వచ్చిన వెంటనే స్పందించానన్నారు. కొందరు సీసీఐ అధికారులు, దళారులతో కుమ్మక్కు అయిన విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి ప్రత్యేక అధికారిని నియమించేలా చూశానని చెప్పారు. కౌలు రైతుల సంఖ్య ఎందుకు తగ్గించి చెబుతున్నారని ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎమ్మెల్యే రామాంజనేయులు ప్రశ్నించారు. కౌలు రైతులకు, పొలం యజమానులకు విడివిడిగా రుణాలు వచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ-క్రాప్ నూరు శాతం చేసే బాధ్యత వ్యవసాయశాఖదేనని ఎమ్మెల్యే రామాంజనేయులు తెలిపారు. తెల్ల, నల్ల నల్లితో మిర్చి రైతులు నష్టపోతున్నారని, అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ చెప్పారు. డ్రాగన్ ఫ్రూట్ సాగుకు పల్నాడు జిల్లాలోని భూములు అనువుగా ఉంటాయని ఉద్యానశాఖ అధికారులు దృష్టి సారించాలని ఎమ్మెల్సీ ఏసురత్నం సూచించారు. పల్నాడు జిల్లాలో వ్యవసాయశాఖ నమోదు చేసిన విజిలెన్స్ కేసులపై ఎమ్మెల్సీ రాజశేఖర్ అధికారులను నిలదీశారు. శనగ విత్తనాలు సబ్సిడీపై జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు హష్మి ప్రస్తావించారు. వరికపూడిశెల నిర్మాణ పనులను రూ.290 కోట్లతో మెగా సంస్థ దక్కించుకున్నట్లు అధికారులు తెలిపారు. అమరావతి మండలం కృష్ణ కెనాల్ జంగిల్ క్లియరెన్స్ పనులకు టెండర్ల ప్రక్రియ త్వరలోనే ముగుస్తుందని చెప్పారు. నరసరావుపేట కేంద్రంగా నూనెలు కల్తీ జరుగుతుందని, వాటి వల్ల ఎందరో మరణిస్తున్నారని జడ్పీటీసీ ఓబుల్‌రెడ్డి తెలిపారు. దీనిపై సమాధానం చెప్పే అధికారులు లేకపోవడంపై సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. అమరావతి మండలంలో 25 పైగా అనధికార వెంచర్లు వేశారని, దానివల్ల రైతులు నష్టపోతున్నారని ఎంపీపీ హనుమంత రావుయాదవ్ తెలిపారు.

ఫీజుల కోసం పీడిస్తున్నారు..

ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించే విషయంలో జడ్పీ సమావేశంలో చర్చ జరిగింది. విద్యా సంవత్సరం మధ్యలో పేద విద్యార్థులను ఫీజులు చెల్లించాలని యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయని (మిగతా 6వ పేజీలో..)

కనిపించని మంత్రులు

- 17 మంది ఎమ్మెల్యేలకు ఇద్దరే హాజరు

మంత్రులు, మెజారిటీ ఎమ్మెల్యేలు లేకుండానే జడ్పీ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. సమావేశానికి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ముగ్గురు మంత్రులు, 15 మంది ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాత్రమే హాజరయ్యారు. వాస్తవానికి జడ్పీ సమావేశం గురువారం జరగాల్సి ఉంది. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున ఎమ్మెల్యేల సౌలభ్యం కోసం అని శనివారానికి వాయిదా వేశారు. అయినా మంత్రులు, ఎమ్మెల్యేలు సమావేశానికి రాలేదు. కూలేందుకు సిద్ధంగా ఉన్న జడ్పీ భవనాన్ని మంత్రులకు చూపించాలని అధికారులు, జడ్పీటీసీలు భావించారు. అయితే వారెవ్వరూ రాకపోవడంతో నిరాశ చెందారు. జిల్లా లోని ముఖ్యమైన సమస్యలపై పలువురు సభ్యులు ప్రశ్నలు సంధించినా అధికారుల నుంచి సరైన సమాధానాలు రాలేదు. అదే ఎమ్మెల్యేలు, మంత్రులు ఉంటే అధికారులు బాధ్యతగా సమాధానాలు చెప్పి ఉండేవారని పలువురు అభిప్రాయపడ్డారు.



- వినుకొండలో అడుగడుగునా అపూర్వ స్వాగతం
- ఆంజనేయులను ఘనంగా సత్కరించిన కూటమి నేతలు

ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులుకు ఘనస్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

చీఫ్‌విప్ జీవీకి బ్రహ్మారథం

వినుకొండ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చిఫ్‌విప్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి శనివారం వినుకొండ నియోజకవర్గానికి విచ్చేసిన జీవీ ఆంజనేయులుకు కూటమి శ్రేణులు బ్రహ్మారథం పట్టాయి. అడుగడుగునా ఆయనకు అపూర్వ స్వాగతం లభించింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు ఆంజనేయులను ఘనంగా సత్కరించారు. శావల్యాపురం మండలం గంటావారిపాలెం వద్ద కూటమి నేతలు, కార్యకర్తలు జీవీకి ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి ప్రారంభమైన ఊరేగింపు వినుకొండలోని శివయ్యస్తూపం వరకు సాగింది. వేలాది మంది కార్యకర్తలు, అభిమానులు ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొన్నారు. బాణ సంచా పెద్దఎత్తున కాల్చారు. ఎక్స్ కవేటర్లతో గజమాలలతో జీవీని సత్కరించారు. మహిళలు నీరా జనాలు పలికారు. యువకులు ద్విచక్ర వాహనాలతో ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై నుంచి ఆంజనేయులు ప్రజలకు అభివాదం చేశారు. శావల్యాపురంలో ఎన్టీఆర్, పరిటాల రవి, వినుకొండలో ఎన్టీఆర్ విగ్రహాలకు జీవీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వినుకొండలో జరిగిన సభలో జీవీ మాట్లాడుతూ చిఫ్‌విప్ పదవితో క్యాబినేట్ హోదా దక్కడం వినుకొండకు గర్వకారణమన్నారు. వినుకొండను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. అనంతరం గంగినేని కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మారెడ్డి, డాక్టర్ చదలవాడ అరవిందబాబు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు జీవీని సత్కరించారు.


స్తూపం సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ లావు, ఎమ్మెల్యేలు జీవీ, చదలవాడ, జూలకంటి

మిర్చియార్డులో సైరన్ మోగించే విధానం పునరుద్ధరణ

గుంటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో సైరన్ మోగించిన తర్వాత వ్యాపార లావాదేవీలు ప్రారంభించే విధానాన్ని తిరిగి అమలు చేయాలని పర్సన్ ఇన్‌ఛార్జ్ అమిలినేని భార్గవ తేజ నిర్ణయించారు. ఈ మేరకు యార్డు అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. శనివారం కమీషన్, ఎగుమతి వ్యాపారస్తులకు మిర్చియార్డు అధికారులు ఎస్‌ఎంఎస్‌ల ద్వారా ఈ సమాచారాన్ని పంపించారు. సోమవారం నుంచి ఉదయం 7 గంటలకు యార్డులో సైరన్ మోగిస్తామని, ఆ తర్వాత లావాదేవీలు ప్రారంభించాల్సి ఉంటుందన్నారు. సైరన్ మోగక ముందు అమ్మకాలు జరపరాదని స్పష్టం చేశారు. దీనివలన రైతుకు నష్టం జరగకుండా ఉంటుందని అధికారులు తెలిపారు. కొన్నేళ్ల నుంచి ఒక సమయం అంటూ లేకుండా రైతు మార్కెట్‌కి రాక ముందే కొంతమంది కమీషన్ వ్యాపారస్తులు రాత్రి దిగుమతి అయిన సరుకుని ఎగుమతిదారులకు విక్రయించేస్తున్నారు.

- తక్కువ ప్యాకేజీలకే వైద్య సేవలు అందించవచ్చు
- ఐఎంఏ రాష్ట్ర సదస్సులో కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని

మెడికల్ టూరిజం అభివృద్ధికి అవకాశాలు


సీనియర్ వైద్యులు బసవపున్నయ్య, కృష్ణారావు, గోపాలకృష్ణను సన్మానిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు మెడికల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్ టూరిజం అభివృద్ధికి అద్భుత అవకాశాలు ఉన్నాయి. అతి తక్కువ ఖర్చుతో చక్కటి వైద్యసేవలు అందించే సత్తా మన తెలుగు వైద్యులకు ఉంది.. అని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో శనివారం రాత్రి జరిగిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) రాష్ట్ర శాఖ 66వ వార్షిక సదస్సులో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ గార్లపాటి నందకిషోర్‌ను కేంద్రమంత్రి అభినందించారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ విదేశాలతో పోలిస్తే మన దేశంలో చౌకగా వైద్యసేవలు అందుబాట్లో ఉన్నట్లు తెలిపారు. దీనిని సద్వినియోగం చేసుకుని ఏపీలో మెడికల్ టూరిజం అభివృద్ధి కృషి చేయాలని చెప్పారు. రాష్ట్రంలో నిష్ణాతులైన వైద్యనిపుణులు విదేశీ రోగులను ఆక ర్షిస్తే తక్కువ ప్యాకేజీలకే వైద్య సేవలు అందించవచ్చన్నారు. దీనివల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. వైద్యులపై జరుగుతున్న దాడులను నిరోధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి తగిన పరిష్కారమార్గం కను గొంటానని హామీ ఇచ్చారు.

ఆసక్తికరంగా సాగిన సైంటిఫిక్ సెషన్

ఐఎంఏ ఏపీకాన్ 2024లో జరిగిన సైంటిఫిక్ సెషన్ ఆసక్తికరంగా జరిగింది. వైద్య రంగంలో కృత్రిమ మేధ పాత్ర అనే అంశంపై ఆస్టర్ రమేష్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు ప్రసంగించారు. హృద్రోగ వైద్య రంగంలో మనిషి కన్ను చూడలేని అంశాలను కృత్రిమ మేధతో తెలుసుకోవచ్చన్నారు. అత్యవసర చికిత్స, గుండెపోటును ఖచ్చితంగా నిర్ధారించగల ట్రాన్స్‌మిషన్ ఈసీజీ టెక్నాలజీ ఏఐతో అందుబాట్లోకి వచ్చినట్లు చెప్పారు. రక్తనాళాల్లో 80 శాతం పూడికలు ఉన్నా స్టెంట్ అవసరమా? లేదా? అనే అంశాన్ని ఏఐతో ఖచ్చితంగా నిర్ధారించవచ్చని తెలిపారు.

మోకీళ్ల మార్పిడిలో రోబోటిక్ పాత్ర అనే అంశంపై సాయిభాస్కర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి మాట్లాడుతూ సాంకేతికత వినియోగం పెరిగే కొద్దీ పేదలకు మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. మోకీళ్ల అరుగుదల రోగులకు పర్సనలైజ్డ్ రోబోటిక్ నీ ఆర్థోప్లాస్టీ, ఇతర శస్త్రచికిత్సలపై డాక్టర్ వై సుబ్రహ్మణ్యం ప్రసంగించారు. హెచ్ఐవీ చికిత్సల్లో నూతన అంశాలపై డాక్టర్ రేవూరి హరికృష్ణ, నూతన ఔషధాలతో ఆరోగ్య పరిరక్షణపై డాక్టర్ కొంగర శ్రీకాంత్ ప్రసంగించారు. యాంటీబయోటిక్ మందుల దుర్వినియోగం అరికడతామని, ప్రజల్లో అవగాహన కల్పిస్తామని వైద్యులు ప్రతిజ్ఞ చేశారు. సీనియర్ వైద్యులు కొండబోలు బసవపున్నయ్య, జీవీ కృష్ణారావు, మద్దినేని గోపాలకృష్ణలను కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జీ నందకిషోర్ సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌వీ అశోకన్, జాతీయ కార్యదర్శి డాక్టర్ అనిల్‌కుమార్ వీ నాయక్, జాతీయ మాజీ అధ్యక్షుడు డాక్టర్ జీ సమరం, ఏపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ జయచంద్రనాయుడు, తెలంగాణ ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ద్వారకానాథ్‌రెడ్డి, సదస్సు ఆర్గనైజింగ్ కమిటీల ప్రతినిధులు ఈదర కృష్ణమూర్తి, వై సుబ్బారాయుడు, టీ సేవకుమార్, బీ సాయికృష్ణ, సీహెచ్ విశ్వేశ్వరరావు, పీవీఎస్ హరిత తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు, వసతులు కల్పిస్తాం

- కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి
- గురుకుల పాఠశాల సందర్శనలో మంత్రులు స్వామి, రవికుమార్
- బాల్య వివాహాల అడ్డుకట్టకు అద్దంకిలో మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు


గురుకుల కళాశాల, పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాలవీరాంజనేయస్వామి

అద్దంకి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో అన్ని సౌకర్యాలు, వసతులను ప్రభుత్వం కల్పిస్తుందని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. శనివారం రాత్రి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి స్వామి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. అనంతరం వారు కళాశాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ విద్యార్థినులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. 8వ తరగతి నుంచే ప్రణాళికాబద్ధంగా చదివితే పదో తరగతి, ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. బాల్య వివాహాలు నిరోధించేందుకు అద్దంకిలోని సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తామన్నారు. రాత్రి సమయాలలో ఉపాధ్యాయినులు ఒకరు లేక ఇద్దరు డార్మెటరీలో విద్యార్థులతో కలిసి నిద్రించాలన్నారు. వేడి నీళ్లతో స్నానం చేసేందుకు సోలార్ ప్లాంట్‌ను, కూరగాయలు చెడిపోకుండా ఉండేందుకు కోల్డ్ రూంను నెలరోజుల్లో ఏర్పాటు చేస్తామన్నారు. ఆవరణలో సరైన లైట్లు లేకపోవడాన్ని గుర్తించి వెంటనే ఏర్పాటు చేయాలని మంత్రి రవికుమార్ విద్యుత్ ఏఈ శివప్రసాద్‌ను ఆదేశించారు. ప్రతి నెలా జంగిల్ క్లియరెన్స్ చేసేలా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అద్దంకిలో సాంఘిక సంక్షేమ బాలిక హాస్టల్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రిన్సిపాల్ దుర్గా గాయత్రి, టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, మానం మురళీమోహన్‌దాస్, కఠారి నాగేశ్వరరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, రమేష్, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాకాని అశోక్, బండారు రాఘవ తదితరులు పాల్గొన్నారు.


సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రిన్సిపాల్, సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రులు స్వామి, గొట్టిపాటి

జగన్ ఫొటోలు తొలగించరా?

1ఇంకెంత సమయం కావాలి.. ప్రశ్నించిన మంత్రి స్వామి

అద్దంకి, నవంబరు 23: జగన్ ఫొటోతో ఉన్న స్టిక్కర్లను తొలగించడానికి ఇంకా ఎన్నేళ్ల సమయం కావాలని మంత్రి బాలవీరాంజనేయస్వామి గురుకులం ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. శనివారం రాత్రి శింగరకొండ వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలను ఆయన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈక్రమంలో వాష్ బేసిన్‌కు జగన్ ఫొటోలతో ఉన్న స్టిక్కర్‌ను గమనించి ప్రిన్సిపాల్, సిబ్బందిని ప్రశ్నించారు. ఇంకా అదే మైండ్ సెట్‌లో ఉంటే ఎలా అని అన్నారు. దీంతో వెంటనే సిబ్బంది స్టిక్కర్‌ను తొలగించారు.


అద్దంకిలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో వాష్ బేషిన్‌పై ఉన్న జగన్ స్టిక్కర్



‘నకిలీల’ కేసు నీరుగార్చారు!



- గొట్లగట్టులో విచ్చలవిడిగా సర్టిఫికెట్ల తయారు
- ఓ నెట్ సెంటర్ కేంద్రంగా నాలుగేళ్లు సాగిన వ్యవహారం
- అంతా తానై వ్యవహరించిన నిర్వాహకుడు
- ఆయన గత వైసీపీ ప్రభుత్వంలో వలంటీర్
- అతను ఇచ్చిన డూప్లికేట్ 1బీ, అడంగల్‌తో బ్యాంకులకు కొందరు రైతులు బురిడీ
- పెద్దఎత్తున బర్త్, డెత్, సదరమ్ సర్టిఫికెట్‌లు కూడా తయారు
- సాధారణ కేసుతో సరిపుచ్చిన పోలీసులు

ఆయన కొకనమిట్ల మండలంలోని గొట్లగట్టులో నెట్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. వైసీపీ సానుభూతిపరుడైన అతను గత ప్రభుత్వంలో వలంటీర్‌గా పనిచేశాడు. ఆ సమయంలో అక్రమార్జన కోసం అడ్డదారి తొక్కాడు. అధికారం అండతో విచ్చలవిడిగా నకిలీ ధ్రువీకరణ పత్రాలు తయారు చేశాడు. రైతులకు అవసరమైన 1బీ, అడంగళ్లతోపాటు బర్త్, డెత్, సదరం, ఇతర పలు రకాల సేవలకు సంబంధించి నకిలీ పత్రాలు పెద్దమొత్తంలో సృష్టించాడు. ఒక్కో సర్టిఫికెట్‌కు ధర నిర్ణయించి అమ్ముకొని భారీగా సొమ్ము చేసుకున్నాడు. ఇతని వద్ద పొలాలకు సంబంధించిన పత్రాలు తీసుకున్న కొందరు రైతులు వాటిని బ్యాంకుల్లో పెట్టి రుణాలు తీసుకొన్నారు. నాలుగేళ్లుగా నడిచిన ఈ బాగోతం ఓ రైతు ఫిర్యాదుతో రెండు నెలల క్రితం వెలుగులోకి వచ్చింది. కేసు నమోదు చేసిన పోలీసులు లోతుగా విచారణ చేపట్టకుండా మమ అనిపించారు. రెవెన్యూ అధికారులు సైతం మిన్నకుండిపోయారు. అసలు ఈ విషయాన్నంతా గోప్యంగా ఉంచారు. భారీ మొత్తంలో ముడుపులు ముట్టడం వల్లనే ఇలా కేసును నీరుగార్చారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మార్కాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కొనకనమిట్ల మండలంలో నకిలీ ధ్రువపత్రాలతో బ్యాంకులను, ప్రభుత్వ కార్యాలయాలను బురిడీ కొట్టించిన కేసులో అధికార యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహించినట్లు తేటతెల్లమౌతోంది. బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో కఠినంగా ఉండాల్సిన పోలీసు, రెవెన్యూ అధికారులు తూతూమంత్రం కేసులతో మమ అనిపించినట్లు అవగతమవుతోంది. లోతుగా విచారించి అక్రమాల స్థాయిని నిర్ధారించేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. యంత్రాంగం నిర్లక్ష్యపు వైఖరితో నకిలీ ధ్రువపత్రాలు సృష్టించిన వైసీసీ సానుభూతిపరుడు ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్నట్లు సమాచారం.

ఏం జరిగిందంటే..

మండలంలోని గొట్లగట్టు గ్రామంలో వైసీపీ సానుభూతిపరుడైన ఓవ్యక్తి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్‌గా పనిచేశాడు. అతనికి అదేగ్రామంలో కంప్యూటర్ నెట్ సెంటర్ ఉంది. పలు ధ్రువీకరణ పత్రాల జెరాక్స్‌లు, రెవెన్యూ పత్రాలకు సంబంధించిన నకళ్లను అవసరార్థులకు ఆయా సైట్‌ల నుంచి డౌన్‌లోడ్ చేసి ఇస్తుండేవాడు. ఈ క్రమంలో కొందరు రైతులు వచ్చినప్పుడు వారి భూములు వెదికితే 22ఏ నిషేధిత జాబితాలో ఉండటాన్ని గమనించాడు. అలాంటి వాటికి నకిలీ 1బీ, అడంగల్‌లు సృష్టిస్తే పెద్దమొత్తంలో సంపాదించవచ్చని యోచించాడు. అనుకున్నదే తడవుగా కార్యాచరణకు దిగాడు. మొదట పలువురు మీసేవ కేంద్రం వాళ్లకు ఆశ చూపి ఖాళీ ధ్రువపత్రాలు సంపాదించాడు. అనంతరం నిషేధిత జాబితాలో భూములున్న రైతులతో మాట్లాడాడు. మీకు భూములున్నట్లుగా 1బీ, అడంగల్ ఇస్తానని వాటితో బ్యాంకుల్లో రుణాలు పొందవచ్చని వల విసిరాడు. పాతవైన కొన్ని ఒరిజనల్ ధ్రువపత్రాలను స్కాన్ చేసి కాపీ చేసిన సమాచారాన్ని మీసేవ కేంద్రాల నుంచి తెచ్చుకున్న ఖాళీ ధ్రువపత్రాలపైన పేస్ట్ చేసి నకిలీ పత్రాలను తయారు చేశాడు. దీన్ని అవసరార్థులకు, అక్రమార్కులకు అమ్ముకున్నాడు. వాటిని తీసుకెళ్లి గొట్లగట్టులో ఉన్న ఓ బ్యాంకులో పలువురు రుణాలు పొందారు. ఈవిధంగా ఆ వైసీపీ సానుభూతిపరుడు పెద్ద సంఖ్యలో నకిలీ 1బీ, అడంగళ్లను తయారు చేసి రూ.లక్షల్లో జేబులు నింపుకున్నాడు.

పంచాయతీ కార్యదర్శుల నుంచి లాగిన్

ఇద్దరు స్నేహితులైన పంచాయతీ కార్యదర్శుల వద్ద ఆ వైసీపీ సానుభూతిపరుడు అనధికారికంగా లాగిన్ తీసుకొన్నాడు. బర్త్, డెత్, సదరమ్ సర్టిఫికెట్లే కాక పలు రకాలైన సేవలకు సంబంధించిన పత్రాలను కూడా నకిలీవి సృష్టించాడు. వీటి ద్వారా పెద్ద మొత్తంలో అక్రమార్జన చేసినట్లు తెలిసింది. ఈ తంతు సుమారు నాలుగేళ్లపాటు నిరాటంకంగా సాగినట్లు సమాచారం.

ఓ ఫిర్యాదుతో వెలుగులోకి

అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైసీసీ సానుభూతిపరుడు నకిలీ ధ్రువపత్రాలు అమ్ముకుంటున్న వైనాన్ని ఓ రైతు సెప్టెంబర్‌లో తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. దీంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. తొలుత స్థానిక అధికారులు పట్టించుకోకపోవడంతో తాను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హెచ్చరించడంతో రెవెన్యూ అధికారులు విచారణ ప్రారంభించారు. ప్రస్తుత తహసీల్దార్ సురేష్ ముందుగా గొట్లగట్టులోని ఓ బ్యాంకుకు వెళ్లి తాను బాధ్యతలు తీసుకున్న తర్వాత (3నెలలు) రుణాలు పొందిన వాళ్ల జాబితాను పరిశీలించారు. ముగ్గురు వ్యక్తులు తప్పుడు ధ్రువపత్రాలతో రుణాలు పొందినట్లు నిర్ధారించుకున్నారు. ప్రాథమిక సమాచారం మేరకు కంప్యూటర్ నెట్ సెంటర్ నిర్వాహకుడైన సదరు వలంటీర్, నకిలీ ధ్రువపత్రాలతో అక్రమంగా బ్యాంకు నుంచి రుణాలు పొందిన వారిపై కొనకనమిట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అధికారుల తీరుపై అనేక అనుమానాలు

నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంలో అటు పోలీసు, ఇటు రెవెన్యూ అధికారుల తీరు అనేక అనుమానాలకు ఆస్కారం ఇస్తోంది. మండల తహసీల్దార్ ఫిర్యాదు మేరకు అక్టోబర్ 6న పోలీసులు వైసీసీ సానుభూతిపరుడైన నెట్ సెంటర్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు. అనంతరం అతనితోపాటు రైతులను స్టేషన్‌కు పిలిపించి విచారించి వదిలేశారు. ఇది అనేక అనుమానాలకు తావిస్తోంది. ప్రస్తుతం నిందితుడు అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలిసింది. నకిలీ ధ్రువపత్రాలతో నాలుగేళ్ల నుంచి పెద్ద సంఖ్యలో రుణాలు పొందినట్లు తెలుస్తోంది. అలాగే ప్రభుత్వ కార్యాలయాల్లోనే కొందరు వీటిని సమర్పించి మోసం చేసినట్లు సమాచారం. అయితే తహసీల్దార్ తాను బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి మాత్రమే పరిశీలన చేసినట్లు సమాచారం. గత నాలుగేళ్లలో ఎంత మంది ఇలా నకిలీ సర్టిఫికెట్లతో రుణాలు తీసుకున్నారన్న విషయం గురించి పట్టించుకోలేదు. తాను బాధ్యతలు చేపట్టిన అనంతరం మూడు నెలల్లో నకిలీ సర్టిఫికెట్లతో రుణాలు తీసుకున్న ముగ్గురు రైతులపై మాత్రమే ఫిర్యాదు చేశారు. వారితోపాటు నెట్ సెంటర్ నిర్వాహకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేవలం ప్రాథమికంగా విచారించి వదిలేశారు. మీసేవ కేంద్రం ఖాళీ పత్రాలు ఎక్కడ నుంచి వచ్చాయో రెవెన్యూ అధికారులే నిర్ధారించాలి. అయితే వారు కూడా దీనిపై దృష్టిసారించ లేదు. నిందితుడు ధైర్యంగా నకిలీ ధ్రువీకరణ పత్రాలు తయారు చేయడం వెనుక బలమైన శక్తులు ఏమైనా ఉన్నాయా? అతనికి సహకరించిన కార్యదర్శులు, వీఆర్వోలు ఎవరు? అన్న విషయాలను అసలు పట్టించుకోలేదు.

సభ్యత్వంలో ముందుందాం

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నియోజవకర్గంలో టీడీపీ సభ్యత్వ నమోదు ప్రక్రియలో ముందుండి పార్టీ ప్రతిష్ఠను పెంచుదామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పిలుపునిచ్చారు. కొత్తపేట పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన సభ్యత్వ నమోదు ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. పార్టీ శ్రేణులకు, సానుభూతిపరులకు దిశానిర్దేశం చేశారు. ఇప్పటి వరకు ఎన్ని సభ్యత్వాలు అయ్యాయి. ఇకపై ఎన్ని చేయగలమని చర్చించారు. అనంతరం దివ్యాంగ ప్రతినిధులు ఎమ్మెల్యే కొండయ్యను కలసి తమ సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చించారు. అందులో భాగంగా ఏరియా వైద్యశాలలో ఎముకలు, కీళ్ల విభాగానికి చెందిన డాక్టర్ పోస్టు ఖాళీగా ఉందని దాన్ని భర్తీ చేయించాలని దివ్యాంగులు కోరారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు సీఎం సహాయ నిధి అండ

మార్టూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ సాయం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. శనివారం మండలంలోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలో 37 మందికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు రూ.30లక్షల67వేల998 చెక్కులను ఎమ్మెల్యే ఏలూరి బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు, వారి కుటుంబాలను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం అందచేస్తున్నదన్నారు.పేదల కుటుంబాలకు సీయం రిలీఫ్ ఫండ్ ఆరోగ్యవరం అన్నారు. ప్రతి పేదకుటుంబానికి సాయం అందించే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన విధంగా సూపర్ సిక్స్ పథకాలను ప్రతి కుటుంబానికీ అందజేస్తామన్నారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్‌ను ఇచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గ్రామాలలో ఉపాధి హామీ నిధుల ద్వారా సిమెంటు రోడ్లు, సైడు కాల్వల నిర్మాణానికి పనులు చేపట్టామన్నారు. అదేవిధంగా గుంతలు ఉన్న రోడ్లపై మరమ్మతులు చేపడతామన్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాలలో రోడ్లను బాగు చేస్తున్నట్లు చెప్పారు. సంక్రాంతి పండుగ నాటికి గుంతలు లేని రోడ్లు ప్రభుత్వ ధ్యేయమన్నారు. అనంతరం లెటర్ ఆఫ్ క్రెడిట్ కింద నలుగురికి 5లక్షల 17వేల 200 చెక్కులను ఏలూరి అందచేశారు. కార్యక్రమంలో కామేపల్లి హరిబాబు, షేక్ రజాక్, కామినేని జనార్దన్, నాయుడు హనుమంతరావు, కమ్మ శివనాగేశ్వరరావు, రంగయ్యచౌదరి, సాంబశివరావు పాల్గొన్నారు.

నేడు మంత్రి గొట్టిపాటి పర్యటన వివరాలు

అద్దంకి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆదివారం ఉదయం 9-30 గంటలకు అద్దంకి పట్టణంలోని ధన్వంతరి దత్తపాదుకా క్షేత్రంలో ప్రత్యేక పూజలలో పాల్గొంటారు. 10 గంటలకు సూర్య ఫ్యామిలీ గార్డెన్స్‌లో ప్రారంభోత్సవ కార్య క్రమంలో పాల్గొననున్నారు.

కొత్త హంగులతో రేషన్ కార్డులు

- కూటమి ప్రభుత్వం చర్యలు
- త్వరలో అందజేసే అవకాశం

సంతనూతలపాడు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రక్షాళన, పారదర్శకతకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఆహారభద్రత చట్టానికి తూట్లు పొడిచింది. పీడీఎస్ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. ప్రచార యావతో కార్డులపై పార్టీ రంగులు, అధినేత బొమ్మ ముద్రించి పంపిణీ చేసింది. కూటమి ప్రభుత్వం వాటన్నింటినీ మార్చనుంది. సరికొత్త డిజైన్లతో కార్డులు ముద్రించనుంది. అదేసమయంలో సాంకేతికతను కూడా జోడిస్తోంది. కార్డుమీద క్యూఆర్ కోడ్ కూడా ముద్రించనున్నట్లు తెలుస్తోంది. దీని వలన కార్డులదారులకు సరుకుల పంపిణీ వేగవంతం కానుంది. అదేసమయంలో అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని అధికారులు అంటున్నారు. ఇటీవల పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నిర్వహించిన సమీక్షలో కొత్త రేషన్ కార్డులను తీసుకొస్తామని వెల్లడించారు. నూతనంగా వివాహమైన వారికి, తల్లిదండ్రుల నుంచి వేరుగా ఉంటున్న దంపతులకు కూడా కార్డులు దక్కనున్నాయి. దరఖాస్తులు ప్రక్రియను త్వరలో ప్రారంభించి జనవరిలో కొత్త కార్డులను మంజూరు చేసే అవకాశం ఉంది.

పట్టభద్ర ఓటర్లు.. 2.90 లక్షలు

(5వ పేజీ తరువాయి)

చెప్పారు. తమ వద్దకు వచ్చిన క్లెయిమ్‌లు/అభ్యంతరాలను డిసెంబరు 25వ తేదీ లోపు పరిష్కరించి తుది ఓటర్ల జాబితాని ఆ నెల 30న విడుదల చేస్తామన్నారు. ఓటరు నమోదు కోసం ఏఈఆర్‌వోలు 188, డిజిగ్నేటెడ్ అధికారులు 104, అదనపు డిజిగ్నేటెడ్ అధికారులు 119 మంది సేవలను వినియోగించుకున్నట్లు తెలిపారు. ఈ దఫా పోలింగ్ కోసం ఆరు జిల్లాల్లో 416 పోలింగ్ కేం ద్రాలను ఏర్పాటుకు ఈసీ నిర్ణయించింది. వాటిలో ఏలూరు జిల్లా లో 20, కృష్ణాలో 76, ఎన్‌టీఆర్‌లో 101, గుంటూరులో 118, బాపట్లలో 28, పల్నాడు జిల్లాలో 73 పోలింగ్ కేంద్రాలను వినియోగించనున్నారు. క్లెయిమ్‌ల సమయంలో ఓటర్ల సంఖ్య పెరిగితే పో లింగ్ కేంద్రాల సంఖ్యని కూడా పెంచే అవకాశం ఉన్నది.

పట్టభద్రుల్లో పురుషులదే పైచేయి

జిల్లాలో సాధారణ ఓటర్లను చూసుకుంటే గత కొన్ని దశాబ్దాలుగా మహిళలే పైచేయిగా ఉన్నారు. వెయ్యి మంది పురుషులు ఉంటే 1070 మంది మహిళలు ఓటర్లుగా నమోదై ఉన్నారు. ఇటీవల విడుదల చేసిన ఎస్ఎస్ఆర్-2025 ముసాయిదా ఓటర్ల జాబితాలో మొత్తం ఓటర్లు 17 లక్షల 94 వేల 25 మంది ఉంటే మహిళలు 9లక్షల27వేల 157, పురుషులు 8లక్షల66వేల710 మంది ఉన్నారు. ఈ విధంగా 60 వేల 447 ఎక్కువ ఓట్లతో మహిళలు పైచేయిగా ఉన్నారు. పట్టభద్రుల విషయానికి వచ్చేసరికి పురుషులే ఆధిక్యంలో ఉన్నారు. లక్షా75వేల360మంది పురుషులు ఉంటే మహిళలు లక్షా15వేల579మంది ఉన్నారు. 59,781 ఓట్లతో పురుషులు పైచేయిగా ఉన్నారు. దీనిని పరిగణనలోకి తీసుకుంటే చదువు విషయంలో నేటికీ అంతరాలు కొనసాగుతున్నాయి. పురుషులను ఉన్నత చదువులు, బాలికలు ఇంటర్‌తో ఆపేయడంతో ఓటరు నమోదులో వారి సంఖ్య తక్కువగా ఉన్నట్లు కన్పిస్తోంది.

గుంటూరు చానల్ పనులకు అనుమతి ఇవ్వండి

సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యేలు ఏలూరి, రామాంజనేయులు విజ్ఞప్తి



గుంటూరు చానల్‌పై సీఎంను కలిసిన ఎమ్మెల్యేలు ఏలూరి, బుర్లా

పర్చూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : : పర్చూరును సస్యశ్యామలం చేసే గుంటూరు చానల్ పనులకు అనుమతులు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబును పర్చూరు, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, బూర్ల రామాంజనేయులు కోరారు. శనివారం సీఎం చంద్రబాబును మర్యాద పూర్వకంగా సీఎం క్యాంపు ఆఫీసులో కలిశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగిస్తే ఆ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. 50 గ్రామాలకు తాగు, సాగు నీరు అందుతుందన్నారు. గుంటూరు చానల్ రైతుల ఎనిమిది దశాబ్దాల కల అన్నారు. గతంలో టీడీపీ హయాంలో గుంటూరు జిల్లా, యామర్రు నుంచి పర్చూరు వరకు సుమారు 29.4 కిలో మీటర్ల కాలువ పొడిగింపునకు నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని ఏలూరి గుర్తు చేశారు. తరువాత అధికారంలోకి వచ్చిన జగన్ పనులను రద్దు చేశారన్నారు. త్వరితగతిన భూసేకరణ చేపట్టి చానల్ పనులు ప్రారంభించేలా చూడాలని కోరారు. ఈ చానల్ పూర్తి చేస్తే గుంటూరు, ప్రకాశం జిల్లాలోని ప్రత్తిపాడు, యడ్లపాడు, చిలకలూరిపేట, పెద్దనందిపాడు, పర్చూరు మండలాల్లోని గ్రామాల్లోని వేల ఎకరరాల భూములకు సాగునీటితోపాటు, ప్రజలకు తాగునీరు అందుతుందన్నారు. దీనిపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే ఏలూరి తెలిపారు.

ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలి

వాడరేవు సింధు కాలనీని పరిశీలించిన తహసీల్దార్



అసంపూర్తిగా నిలిచిన ఇంటి నిర్మాణాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపీకృష్ణ

చీరాలటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సుమారు పదేళ్ల కిందట కొన్ని నిర్మాణాలను చేసుకుని అర్ధాంతరంగా నిలిపేసిన వాడరేవు సింధు కాలనీ లబ్ధిదారులు ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని తహసీల్దార్ గోపీకృష్ణ సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కాలనీను తహసీల్దార్ శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అప్పటి ప్రభుత్వం కొందరికి నివేశన స్థలాలు, మరి కొందరికి ఇళ్లు మంజూరు చేసినట్లు చెప్పారు. కొందరు బేస్ మట్టం వేయగా, మరి కొందరు పూర్తిగా ప్రారంభించకుండానే నిలిపి వేసినట్లు వివరించారు. వీటిపై గృహ నిర్మాణశాఖ అధికారులతో చర్చించి ఆంతరాయానికి కారణాలు తెలుసుకోనున్నట్లు వివరించారు. వారి సమస్యలను పరిష్కరించి నిర్మాణాలు జరిగేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

మండలపరిధిలోని బోయినవారిపాలెం పోలింగ్ కేంద్రంలో జరుగుతున్న ఓటు స్పెషల్ క్యాంపెయిన్‌ను తహసీల్దార్ పరిశీలించారు. సిబ్బందిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక డ్రైవ్ ఆదివారంతో ముగుస్తుందని, ఓటర్లు సమస్యలను పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు. ఆయన వెంట పలువురు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఉచిత ఇసుకేది?

(5వ పేజీ తరువాయి)

పలువురు సభ్యులు అధికారులను నిలదీశారు. జిల్లా పరిషత్ ద్వారా పదో తరగతి విద్యార్థులకు ప్రతి ఏటా సరఫరా చేస్తున్న స్టడీ మెటీరియల్ ఎప్పుడు ఇస్తారని ఎమ్మెల్సీ లక్ష్మణరావు ప్రశ్నించారు. డిసెంబరు 15 నాటికి అందజేస్తామని జడ్పీ చైర్‌పర్సన్ తెలిపారు. కాకుమాను సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులు నీళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, అనేక సందర్భాల్లో ఈ సమస్య గురించి మాట్లాడినా అధికారులు పరిష్కరించలేదని ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎమ్మెల్యే రామాంజనేయులు ప్రస్తావించారు. జనవరి నాటికి సమస్యను పూర్తిగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అమరావతి, రెంటచింతల మండలాల్లో జడ్పీ హై స్కూల్ ఏర్పాటుపై సభ్యులు ప్రస్తావించారు. మాచర్ల నియోజకవర్గంలోని ఎత్తిపోతల, గిరిజన ఆవాస పాఠశాలల్లో సరైన వసతులు లేవని జడ్పీటీసీ తెలిపారు. నాడు-నేడు కింద పనులు పూర్తయినా ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయలేదని అమరావతి ఎంపీపీ అధికారులను నిలదీశారు.

వైద్యులు అందుబాటులో లేరు

భట్టిప్రోలులోని ఆస్పత్రిలో ఇద్దరు వైద్యులు ఉన్నా ఒక్కరు కూడా ప్రజలకు అందుబాటులో ఉండరని జడ్పీ టీసీ తెలిపారు. నరసరావుపేట ఏరియా ఆస్పత్రిలో మందులు అందుబాటులో ఉండటంలేదని జడ్పీటీసీ ఓబుల్‌రెడ్డి తెలిపారు. మందులకు కొరత లేదని డీఎంహెచ్‌వో రవి చెప్పారు. అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గైనకాలజిస్ట్ సమస్య ఉందని, కనీసం ప్రతి నెల 9న అయినా ప్రత్యేక డాక్టర్‌ను నియమించాలని ఎంపీపీ కోరారు. అచ్చంపేట మండలం చింతపల్లిలో పీహెచ్‌సీ మంజూరైనా ఇంకా ప్రారంభించలేదని జడ్పీ టీసీ విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. పల్నాడు జిల్లాలో కొత్తగా 7 పీహెచ్‌సీలు మంజూరైనా వాటికి భవన నిర్మాణాలు, సిబ్బంది నియామకం జరగలేదని డీఎంహెచ్‌వో రవి సభ్యులకు చెప్పారు.

ప్రొటోకాల్ అంశంపై ఎమ్మెల్సీ లక్ష్మణరావు, రొంపిచర్ల జడ్పీటీసీ ఓబుల్‌రెడ్డి మాట్లాడారు. బాపట్లలో జరిగిన కౌలుదారుల వర్క్‌షాపునకు తనను ఆహ్వానించలేదని లక్ష్మణరావు అన్నారు. శిలాఫలకంపై ఎంపీపీ, జడ్పీటీసీ, కొన్ని సందర్భాల్లో జడ్పీ చైర్‌పర్సన్ పేరు కూడా లేకుండా స్థానికంగా ఉన్న అనామకుల పేర్లు వేస్తున్నారని పలువురు సభ్యులు ఆరోపించారు. ఇంతకు ముందే ఈ సమస్యను పల్నాడు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని అమరావతి ఎంపీపీ తెలిపారు. అధికారులు ఎమ్మెల్యేలు చెప్పినట్లే పనిచేయాలని, లేకుంటే వారిని బదిలీ చేయిస్తారని, ప్రొటోకాల్ విషయంలో అధికారులను బలిచెయ్యడం కన్నా కలెక్టర్లు చొరవ తీసుకుని ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ కోరారు.

సచివాలయాల్లో ఈగల మందలా ఉద్యోగులు

సచివాలయాల్లో ఉద్యోగులు ఈగల మందలా ఉన్నా ఈ-క్రాప్ నమోదులో అలసత్వం వహిస్తున్నారని, ఆరు వేల మందికి కౌలు రైతులకు ఇంకా ఎందుకు ఇవ్వలేదని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడిసెలు, కాల్వ గట్ల దగ్గర ఇళ్లు వేసుకుని నివసించే కౌలు రైతుల దగ్గరకు వెళ్ళి పేర్లు నమోదు చేసి కార్డులు ఇవ్వాల్సిందేనని చెప్పారు. ఉద్యోగుల అలసత్వం వల్ల కౌలు రైతుల ప్రయోజనాలకు గండి పడుతుందన్నారు. సరైన సమయంలో వారికి రుణాలు ఇప్పించడంలో విఫలం అవుతున్నారన్నారు. కలెక్టర్లకు 50 శాఖల పైగా ఉంటాయని, వారు ఎన్ని కార్యక్రమాలు పర్యవేక్షిస్తారని ప్రశ్నించారు. ఆయా శాఖల జిల్లా అధికారులు ఒక కలెక్టర్‌లా కింది స్థాయి సిబ్బందితో పనులు చేయించాలని సూచించారు.

ఓటర్ల జాబితా సవరణపై ప్రత్యేక డ్రైవ్

- జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో నిర్వహణ
- సంతనూతలపాడులో పరిశీలించిన కలెక్టర్

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా శనివారం జిల్లావ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ బీఎల్వోలు అందుబాటులో ఉన్నారు. కొత్తగా ఓటు నమోదుతోపాటు ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మండల కేంద్రమైన సంతనూతలపాడులోని జిల్లా పరిషత్ హైస్కూల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

బీఎల్వోలతో మాట్లాడారు. ఓటర్ల జాబితాలో కొత్తగా పేరు నమోదు, తొలగింపు, అడ్రస్ మార్పు కోసం వచ్చిన దరఖాస్తులు, వాటిని పరిష్కరిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఈఆర్వో వరకుమార్ తదితరులు ఉన్నారు.



పొదుపు సభ్యులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు (ఫైల్)

మెప్మాలో బోగస్‌లకు చెక్..!

- యాప్‌లో పొదుపు సంఘాల వివరాలు
- ఆర్పీలకు నమోదు బాధ్యతలు
- ప్రతి మహిళకు పథకాలు చేర్చడమే లక్ష్యం

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మెప్మాలో బోగస్ గ్రూపులు, అక్రమాలకు చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం సరికొత్త విధానాన్ని అమలు చేస్తోంది. ప్రతి సభ్యురాలికీ ప్రభుత్వ పథకాలు అందాలన్న లక్ష్యంతో ముందడుగు వేస్తోంది. అందుకోసం ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. అందులో గ్రూపు సభ్యుల వివరాలన్నీ పొందుపరచాలని ఆదేశించింది. దీంతో అధికారులు ఆ పనిలో నిమగ్నమయ్యారు. గత వైసీపీ పాలనలో ఒంగోలులో కొందరు ఆర్పీలు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. నకిలీ గ్రూపులను సృష్టించారు. వాటి ద్వారా బ్యాంకులను బురిడీ కొట్టించి రూ.కోట్లలో రుణాలు దోచుకున్నారు. ఈ బాగోతాన్ని ‘ఆంధ్రజ్యోతి’ వెలుగులోకి తెచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని పట్టణ పొదుపు సంఘాల్లో ఈ తరహా వ్యవహారాలు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం సరికొత్త విధానం అమలుకు శ్రీకారం చుట్టింది. ఎస్‌హెచ్‌జీ ప్రొఫైల్ పేరుతో తీసుకొస్తున్న ఈ యాప్‌పై ఇప్పటికే సిబ్బందికి శిక్షణ కూడా పూర్తయ్యింది. ఈ విధానం వలన ఆయా సంఘాల్లో సభ్యులంతా ఉన్నారా? లేదా? అన్న విషయం తేటతెల్లమవుతుంది. అలాగే ఒకే సభ్యురాలు రెండు సంఘాల్లో ఉంటే వెంటనే గుర్తించవచ్చు. కొన్ని సంఘాల్లో సభ్యులు ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల్లో ఉంటుండగా వారి పేర్లతో ఇంకొందరు ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు పొందుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వేర్వేరు గ్రూపుల్లో సభ్యులతో నకిలీ సంఘాలను ఏర్పాటు చేసి రుణాలు పొందారు. ప్రత్యేక యాప్‌తో ఇలాంటి అక్రమాలకు తెర పడనుంది.

పొదుపు మహిళలకు మరింత లబ్ధి

స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇకపై ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్‌ను ప్రామాణికంగా తీసుకొని పథకాలను అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. మొత్తం సభ్యుల్లో ఎంతమంది ప్రభుత్వ పథకాలు పొందుతున్నారు, ఎంతమందికి అందడం లేదు, ఇప్పటి వరకు లబ్ధి పొందిన వారి వివరాలను ప్రస్తుతం ఆర్పీ (రిసోర్స్ పర్సన్)లు సేకరించి ఆన్‌లైన్ చేస్తున్నారు. జిల్లాలోని ఒంగోలు నగరంతోపాటు అన్ని మునిసిపాలిటీలలో 9,545 పొదుపు సంఘాలు ఉన్నాయి. వాటిలో 93,228 లక్షల మంది సభ్యులు ఉన్నారు. ప్రస్తుతం పది మంది సభ్యులతో సంఘంగా ఏర్పడి పొదుపు చేయడంతోపాటు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని స్వయం ఉపాధిని పొందుతున్నారు. సభ్యుల్లో ఎవరైనా చనిపోయినా, వలస వెళ్లినా, వయసు మీరినా, వారి స్థానంలో కొత్తవారిని నియమించుకుంటున్నారు. ఆయా సంఘాల సభ్యుల వివరాలను ఇప్పటి వరకు ఆన్‌లైన్ చేయకపోవడంతో ప్రభుత్వ పథకాలను పొందలేకపోతున్నారు. కాగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలు అమలుకు ఉపక్రమించింది. ఈ నేపథ్యంలో ప్రత్యేక యాప్‌లో పొదుపు మహిళల వివరాలు నమోదు చేయడం ద్వారా ఇప్పటి వరకూ ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉంటున్న వారికి లబ్ధి చేకూరనుంది.

అర్హులకు పథకాలు అందించేందుకే యాప్

మహిళల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను పొదుపు సంఘాలకు చేరువచేయాలన్నదే ప్రభుత్వం ఉద్దేశం. యాప్‌లో వివరాలు నమోదు చేయడం వలన పొదుపు మహిళలకు మరింత లబ్ధి చేకూరుతుంది. సభ్యులు తయారు చేసే ఉత్పత్తులను ఆన్‌లైన్ మార్కెటింగ్‌కు అనుసంధానం చే యడం జరుగుతుంది. యాప్‌లో వివరాలు నమోదు చేయడం ద్వారా బోగస్ గ్రూపులకు చెక్‌పడుతుంది.

- టి.రవికుమార్, మెప్మా పీడీ


కాకినాడలో ప్రారంభమైన రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు

కాకినాడ అర్బన్, (ఆంధ్రజ్యోతి) : విద్యాభివృద్ధికి క్రీడలు దోహదం చేస్తాయని జడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు అన్నారు. శనివారం పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో 68వ రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలను కాకినాడ డీఎస్‌ఏ మైదానంలో లక్ష్మణరావు ప్రారంభించారు. అండర్17 విభాగంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 160మంది క్రీడాకారులు హాజరయ్యారని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. రెండురోజులపాటు నిర్వహించే పోటీల్లో విజేతలను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్, రగ్బీ సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.రామాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు నాగేంద్రకుమార్, సానా సతీష్ ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్, రమణరాజు, లక్ష్మణ్, పీఈటీలసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి.రవిరాజు, కె.నూకరాజు పాల్గొన్నారు.

మొదటిరోజు విజేతలు వీరే

అనంతపురంపై గుంటూరు10.0, చిత్తూరుపై శ్రీకాకుళం 20.0, కర్నూలుపై తూర్పుగోదావరి 23.0, విశాఖపై ప్రకాశం 15.0 స్కోరుతో గెలుపొంది సెమీ ఫైనల్‌కి చేరాయి.

నలు దిక్కులా నరకం



రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయిన గంగవరం రోడ్డు



కల్వర్ట్ వద్ద ఉంచిన బస్తాలు

» రోడ్లపై పెద్దపెద్ద గుంతలు
» భయపడుతున్న ప్రయాణికులు
» పట్టించుకోని అధికారులు
» మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి

ఇంకొల్లు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు ప్రజలకు నలు దిక్కులా ప్రయాణం నరకంగా మారింది. ఇంకొల్లు నుంచి సమీప పట్టణాలకు వెళ్లేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంకొల్లు టూ పర్చూరు ఆర్‌అండ్‌బీ రహదారిలో ఇంకొల్లు నుంచి నూతలపాడు రోడ్డులో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఇంకొల్లు టూ అద్దంకి ఆర్‌అండ్‌బీ రహదారిలో, గంగవరం వరకు పూర్తిగా దెబ్బతిని ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు కోతకు గురైంది. దీంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిలోనే విద్యా సంస్థలు ఉండడంతో నిత్యం రద్దీగా కన్పిస్తోంది. రాత్రి వేళలో కొత్త వాహనచోదకులు ఆదమరిస్తే ప్రమాదానికి గురికావల్సిందే. నాగండ్ల రహదారి అధ్వానంగా మారింది. చిన్నపాటి వాహనాల సైతం ఈ దారిలో వెళ్ల లేని పరిస్థితి నెలకుంది. కంకర, గ్రావెల్ తరలించే భారీ వాహనాలు తిరుగుతుండడంతో ఈ రోడ్డు ధ్వంసమైంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. కేవలం ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. వెంటనే మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



గుంతలతో ఉన్న ఇంకొల్లు - నాగండ్ల రోడ్డు

విద్యుత్ ఏఈగా అనిల్‌కుమార్



పంగులూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల విద్యుత్ ఏఈగా గోరంట్ల అనిల్ కుమార్ శనివారం విధులను చేపట్టారు. విజయవాడ ఓ అండ్ ఎంలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న అనిల్‌కుమార్ బదిలీపై పంగులూరు విద్యుత్ ఏఈగా నియమితులయ్యారు. మెరుగైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

రుణాల రికవరీపై దృష్టి సారించండి

ఇంకొల్లు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రుణాల రికవరీపై సిబ్బంది దృష్టి సారించాలని స్త్రీనిధి ఏజీఎం నాగబాబు అన్నారు. వెలుగు కార్యాలయంలో శనివారం పర్చూరు నియోజకవర్గ స్థాయి ఆరు మండలాల వెలుగు సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామ సమాఖ్య సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏరియా కోఆర్డినేటర్ లక్ష్మణాచారి, ఏపీఎం అనూరాధ, సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపీడీవోల సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో

సంక్షేమ పథకాలు సక్రమంగా చేరాలి

అద్దంకిటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవో బీ చిరంజీవి సూచించారు. శనివారం అద్దంకి ఎంపీడీవో కార్యాలయంలో అద్దంకి నియోజకవర్గంలోని 5 మండలాల ఎంపీడీవోలతో ఆయన సమావేశం నిర్వహించారు. సిబ్బంది సక్రమంగా కార్యాలయాలకు హాజరు అవుతున్నారా లేదా ఆరా తీశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను జడ్పీ సీఈవో తెలుసుకున్నారు. సమావేశంలో ఎంపీడీవో బత్తిని సింగయ్యతో పాటు ఇతర మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి జయంతి

వేటపాలెం(చీరాల), నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : రైల్వే స్టేషన్ సమీపంలోని సత్యసాయిబాబా సేవా సమితి మందిరంలో శనివారం సత్యసాయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా బాబా సృజించిన శివలింగానికి అభిషేకాలు చేశారు. భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో సమితి నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

రేపు అయ్యప్పస్వామి పడిపూజ

మార్టూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : శ్రీ రుక్మాబాయి సమేత పాండురంగ శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో సోమవారం రాత్రి అయ్యప్ప మహా పడిపూజ మహోత్సవం, అభిషేకాలను నిర్వహిస్తున్నట్లు దేవస్థానం చైర్మన్ సకల ఆంజనేయులు శనివారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో మార్కాపురం శ్రీను భజన బృందంతో అయ్యప్ప నామసంకీర్తన, పాటలు ఉంటాయన్నారు. మార్టూరు ప్రాంతంలోని దీక్షధారులందరూ హాజరు కావాలని కోరారు.

రేపు ద్రోణాదులలో అఖండ కర్పూర జ్యోతి

మార్టూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా మండలంలోని ద్రోణాదుల గ్రామంలో అంకమ్మదేవతశక్తి క్షేత్రంలో సోమవారం రాత్రి అఖండ కర్పూర జ్యోతి, లక్ష దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అమ్మ వారికి 5రకాల ప్రసాదాలతో మహా నివేదన ఉంటుందన్నారు. కార్యక్రమాన్ని భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా డైరెక్టర్ అనిల్ బర్త్‌డే వేడుకలు

యద్దనపూడి, (మార్టూరు) నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సినీ డైరెక్టర్ అనిల్ రావిపూడి బర్త్‌డే వేడుకలను అభిమానులు శనివారం ఘనంగా నిర్వహించారు. స్వగ్రామం చిలుకూరివారిపాలెంలో అనిల్ తల్లి అనంతలక్ష్మితో కేక్ కట్ చేయించి పంచి పెట్టారు. కార్యక్రమంలో పి కృపారావు, రమేష్, రంగనాయక్, జీవన్‌బాబు పాల్గొన్నారు.

కంప్యూటర్‌ను అందజేసిన పూర్వ విద్యార్థి



స్కూల్‌కు కంప్యూటర్, సామగ్రిని అందజేస్తున్న శ్రీనివాస్

యద్దనపూడి, (మార్టూరు) నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలం అనంతవరం జడ్పీ హైస్కూల్‌లో చదువుకున్న గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి పెదవల్లి శ్రీనివాస్ లక్షన్నర రూపాయల విలువైన కంప్యూటర్ సామగ్రిని బహూకరించారు. శనివారం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్ మానిటర్లు, సీపీయూ, ఇన్వెర్టర్, టీవీ మానిటరు, కుర్చీలు, కలర్ ప్రింటింగ్ తదితర వాటిని అందచేశారు. అతను కెనరా బ్యాంకు చెన్నై సర్కిల్ ఆఫీస్ ఏజీఎంగా విధులు నిర్వర్తిస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ షేక్ మస్తాన్‌బీ, మార్టూరు కెనరా బ్యాంక్ బ్రాంచి మేనేజరు రాజశేఖర్, ప్రధానోపాధ్యాయుడు రాఘవరెడ్డి, తుర్లపాటి శ్రీనివాస్, కొల్లా రమణ, రావి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యతోపాటు ఆహ్లాదం అవసరం

చీరాలటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలో విద్యతో పాటు ఆహ్లాదం కూడా అవసరమని తద్వారా మానసిక ఒత్తిడి నుంచి విముక్తి లభిస్తుందని ప్రేమ హాస్పిటల్ గుండె వైద్య నిపుణులు ఐ.బాబూరావు దంపతులు అన్నారు. ఉడ్ నగర్‌లోని ఆనంద నిలయం బాలికల వసతి గృహానికి వారు రూ.10వేల విలువైన టీవీని బహూకరించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ విజయకుమారి, విద్యార్థినులు పాల్గొన్నారు.

సాంకేతికతలో ఉపాధి సిబ్బంది ముందుండాలి

చీరాలటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న ఆధునీకీకరణలో భాగంగా సాంకేతికపరమైన అంశాలపై ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది ముందుండాలని ఈపీఆర్డీ రామకృష్ణ, ఏపీడీ కోట నాయక్ అన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ జిల్లా స్థాయి సమావేశం శనివారం మండల కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా 2025-26 నాటికి ఉపాధి కల్పనకు కృషి చేయాలని సూచించారు. ఉన్నతి యాప్ వినియోగంపై శిక్షణ ఇచ్చారు. వంద రోజులు పని పూర్తయిన వారికి ఉపాధి దాని తీరు తెన్నులను వివరించారు. జిల్లా వ్యాప్తంగా గోకులాలు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ప్లాంటేషన్, పర్సంటేజ్ జనరేషన్ వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో ప్లాంటేషన్ మేనేజర్ కిరణ్, అన్ని మండలాల ఏపీవోలు సిబ్బంది పాల్గొన్నారు.

26న ధర్నా

మార్టూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రైతుల సమస్యలపై ఈనెల 26వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న రైతు సంఘ నాయకులు బత్తుల హనుమంతరావు, కందిమళ్ల రామకోటేశ్వరరావు శనివారం ప్రకటనలో తెలిపారు. ధర్నా విజయవంతం చేయాలని శనివారం సెంటర్లో కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎనికపాటి రాంబాబు, వీరవల్లి కృష్ణమూర్తి, సూరిబాబు, నాగేశ్వరరావు, రామారావు పాల్గొన్నారు.

సారా తయారీపై దాడులు

చీరాలటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సారా తయారీపై ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం చీరాల రామనగర్ పరిధిలో దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా సుమారు 450 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు మాట్లాడుతూ నేరస్థులు నేరాలకు దూరంగా ఉండాలని సత్ప్రవర్తనతో జీవించాలని చెప్పారు. భిన్నంగా వ్యవహరిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని సీఐ నాగేశ్వరరావు హెచ్చరించారు.



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు



సమస్యలను తెలుసుకుంటున్న ఆర్డీవో

సమస్యల పరిష్కారానికి కృషి

ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

చీరాలటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలోని వేస్ట్ పిక్కర్స్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు పేర్కొన్నారు. కలెక్టర్ వెంకటమురళి ఆదేశాల మేరకు విఠల్‌నగర్ 6వ కాలనీలోని నివాసముంటున్న వేస్ట్ పిక్కర్స్‌తో తహసీల్దార్ గోపీకృష్ణ, మునిసిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ ఆధ్వర్యంలో కాలనీని అధికారులు పరిశీలించారు. వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. వీరిలో అధికులు నివేశన స్థలాలు కోరినట్లు తెలిపారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలు పరిష్కరించనున్నట్లు ఆర్డీవో వారికి హామీ ఇచ్చారు. పలువురు ప్రభుత్వ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

రూ.10లక్షల చెక్కును అందజేసిన వైసీపీ నేతలు వెంకటేష్, మేరుగ



బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న కరణం, మేరుగ

చీరాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సాయం అందిస్తున్నాం.. మీకు అండగా ఉంటామని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున చెప్పారు. ఈ ఏడాది జూన్ 21వ తేదీన చీరాల మండలం ఈపురుపాలెంకు ఉదర పోషణకు వచ్చిన చేనేత కార్మిక కుటుంబానికి చెందిన పాముజల సుచరిత హత్యాచారానికి గురైన విషయం తెలిసిందే. వెంకటేష్ చొరవతో పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు రూ.10లక్షల చెక్కును శనివారం బాధిత తల్లిదండ్రులైన వెంకటేశ్వర్లు, కామాక్షి దంపతులకు మేరుగ నాగార్జున, కరణం వెంకటేష్ అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు తమకు కేటాయించిన నివేశన స్థలం తమకు చెందేలా చేయాలని కోరారు. అందుకు తాము ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని చెప్పారు. కుటుంబ సభ్యులు వెంకటేష్‌కు, మేరుగకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

చీరాల : మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి చొరవతో మంజూరైన రూ.24.23 కోట్ల నిధులతో నియోజకవర్గంలో పలుచోట్ల చేపట్టిన రోడ్లను శనివారం వైసీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలున్నారు.

నియోజకవర్గ అభివృద్ధిలో ముందుందాం

ఎమ్మెల్యే కొండయ్య



సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ అభివృద్ధిలో ముందుండి అందరికీ అండగా ఉంటామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మండల పరిధిలో శనివారం పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. సుడిగాలి పర్యటన చేశారు. బోయినవారిపలెంలో గ్రామస్థులతో భేటీ అయ్యారు. గ్రామ సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. గ్రామానికి చెందిన బోయిన సురేష్ వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ రూ.1,39,611 చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం అయ్యప్పస్వామి గుడి వార్షికోత్సవ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. బోయినవారిపాలెం నుంచి కుంకలమర్రుకు వేస్తున్న రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు.. తదనంతరం కొత్తపేటలోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. టీడీపీ సభ్యత్వ నమోదు ప్రక్రియ పురోగతిపై చర్చించారు. నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించేందుకు పాటించాల్సిన చర్యలను వివరించారు. సాయంత్రం ముత్యాలమ్మపేటలోని మహాలక్ష్మమ్మ అమ్మ వారి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



లేబొరేటరీని పరిశీలిస్తున్న అధికారి

సకాలంలో పిల్లలకు టీకాలు వేయండి

అద్దంకిటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులకు నిర్ణయించి తేదీలలో వేయాల్సిన టీకాలను సిబ్బంది సకాలంలో అందించేలా చూడాలని బాపట్ల జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి టి.వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం ఆయన అద్దంకి పట్టణంలోని గాజులపాలెం అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను సందర్శించారు. వైద్యశాలలో ఉన్న లేబొరేటరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం వైద్యశాలలో జరుగుతున్న సీడీ అండ్ ఎన్‌సీడీ (3.0) కేన్సర్ స్కానింగ్ సర్వే, ఆర్‌బీఎస్‌కే కార్యక్రమంలో భాగంగా స్కూల్ హెల్త్ చిల్డ్రన్ ప్రోగ్రాం, అంగన్‌వాడీ కేంద్రంలో జరిగే 4డీఎస్ స్క్రీనింగ్, నిర్వహణ తదితర సేవలను విచారించి సంబంధిత రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా సీహెచ్‌వో డీ నాగేశ్వరరావు, డాక్టర్ గొట్టిపాటి జయసింహ, సిబ్బంది ఉన్నారు.



ప్రత్యేక పూజలో పాల్గొన్న మంత్రులు గొట్టిపాటి, అనగాని, ఎమ్మెల్యే ఏలూరి

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

» మొక్కు తీర్చుకున్న మంత్రులు గొట్టిపాటి, అనగాని, ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు వైజంక్షన్‌లో ఏర్పాటు చేసిన 95 అడుగుల శ్రీ అభయాంజనేయస్వామిని శనివారం మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యుత్ శాఖ, రెవెన్యూశాఖ మంత్రులు, ఎమ్మెల్యేని ఆలయ అర్చకులు, కమిటీ ప్రతినిధులు మంగళవాయిద్యాలు పూర్ణకుంభంతో ఘనంగా సాగతం పలికారు. ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే ఏలూరి పిలుపు మేరకు శ్రీ అభయాంజనేయస్వామివారిని ఇద్దరు మంత్రులు శనివారం దర్శించుకున్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ తన సతీమణి ఝాన్సీతో హనుమ విగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేని ఆలయ కమిటీ ప్రతినిధులు దుశ్శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ధూళిపల్లి వెంకటస్వామి, రాష్ట్ర కార్యదర్శి కారుమంచి కృష్ణ, రాష్ట్ర బీసీ నాయకులు కోడూరి శేషబ్రహ్మాచారి, మండలపార్టీ అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, పోపూరి శ్రీనివాసరావు, దాసరి ఉషారాణి, కొల్లా శివరాం ప్రసాద్, హరిప్రసాద్, వెంకటేశ్వర్లు, పఠాన్ సమీర్, జగన్, ఆలయ కమిటీ ప్రతినిధులు కోటా హరిప్రసాద్, కఠారి సురేంద్రబాబు, ఆంజనేయులు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

దివ్యాంగులతో స్నేహపూర్వకంగా మెలగాలి

న్యాయాధికారి సుధ



చిన్నారులతో మాట్లాడుతున్న న్యాయాధికారి సుధ

చీరాలటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మానసిక దివ్యాంగులతో స్నేహపూర్వకంగా మెలగాలని న్యాయాధికారి సుధ అన్నారు. శనివారం చైతన్య మనోవికాస కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా న్యాయాధికారి పిల్లలతో మాట్లాడి ఉత్సాహ పరిచారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రేమ ఆప్యాయతలతో పరిచర్యలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు వెంకన్నబాబు, పద్మజ, పీఎల్‌వీ సుభాని, ఇర్ఫాన్, మదీన్ పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధరలకే ధాన్యం విక్రయాలు



మాట్లాడుతున్న అధికారులు

చీరాలటౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రైతులు గిట్టుబాటు ధరకే ధాన్యం అమ్ముకోవచ్చని తహసీల్దార్ గోపీకృష్ణ, వ్యవసాయాధికారి సుమతి పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయం సమావేశం హాలులో శనివారం మండల పరిధిలోని రైస్ మిల్లర్స్, రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారా గానీ లేక ప్రైవేటు మార్కెట్‌లలో గానీ వారి పండించిన ధాన్యం గిట్టుబాటుకే అమ్మకాలు చేసుకోవచ్చన్నారు. ఈకేవైసీ పూర్తయిన రైతులు ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. అనంతరం మిల్లర్స్ సందేహాలను నివృత్తి చేశారు. ఎసైన్డ్, సాల్వేషన్ ఆర్మీ, ఈక్రాప్ బుకింగ్ లేని వెసులుబాటు కల్పించాలని రైతులు కోరగా సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ అర్జున్, వీఆర్వోలు, వీఏఏలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

- ఎన్టీఆర్ సుజల స్రవంతి పనులు చేపట్టండి
- సోమశిల నీటిని ఉదయగిరికి ఇవ్వాలి
- సోలార్ విద్యుత్‌కు మండలానికి ఓ మోడల్ గ్రామం
- ప్రొటోకాల్‌పై ఆదేశాలివ్వండి
- జడ్పీ సమావేశంలో నేతలు



జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం, వేదికపై జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ ఆనంద్

మంచినీరిచ్చి కాపాడండి

నెల్లూరు (జడ్పీ), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో తాగునీటి వ్యవస్థ అధ్వానంగా ఉంది. కొన్నిచోట్ల నీటి ట్యాంకులు శిథిలావ్యవస్థ చేరాయి. కొన్ని ప్రాంతాల్లో నాలుగు రోజులకు ఓసారి తాగునీరు ఇస్తున్నారు. కనీసం రెండు రోజులకు ఒకసారి ఇచ్చేలా చూడండి. గిరిజన ప్రాంతాల్లో క్లోరినేషన్ లేక ఎర్రనీళ్లు తాగుతున్నారు. ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించి, వాళ్ల ఆరోగ్యాలను కాపాడాలి'.. అంటూ జడ్పీ సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలతోపాటు జడ్పీటీసీ సభ్యులు కోరారు. జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జిల్లా పరిషత్ సాధారణ సమావేశం శనివారం జడ్పీలోని సమావేశ మందిరంలో జరిగింది. గ్రామీణ నీటిసరఫరా, నెట్‌క్యాప్, వ్యవసాయశాఖ, నీటిపారుదల శాఖలపై సభ్యులు చర్చించారు. తాగునీటి ఇబ్బందులపై ఎక్కువమంది సభ్యులు గగ్గోలు పెట్టారు.

● తాగునీటి ట్యాంకులపై దృష్టి

కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ తాగునీటిలో క్లోరి నేషన్, ట్యాంకుల క్లీనింగ్ సక్రమంగా ఉండటం లేదని, అనేక చోట్ల తాగునీటి ట్యాంకులు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయని, వాటిని వెంటనే కూల్చకపోతే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.



సీపీడబ్ల్యూ తాగునీటి పథకాల నిర్వహణను పూర్తిగా వదిలేసిందని, దీంతో తీరప్రాంతాల్లోని గిరిజనులు కలుషితనీళ్లు తాగుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. వింజమూరు జడ్పీటీసీ జీ బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఉదయగిరి, కలిగిరి, వింజమూరు మండలాల్లో నీటి సమస్యతో కిడ్నీ రోగాలు ఎక్కువగా ఉంటున్నాయని, సోమశిల నీటిని ఈప్రాంతాలకు సరఫరా చేసి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలన్నారు. ఉదయగిరి కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్ మాట్లాడుతూ మండలంలో నాలుగు రోజులకు ఒకసారి తాగునీరు అందిస్తున్నారని, కనీసం రెండు రోజులకు ఒకసారైనా సరఫరా చేయాలని కోరారు. వాకాడు జడ్పీటీసీ మాట్లాడుతూ మండలంలో తాగునీటి పథకాలకు 24 గంటలు కరెంటు సౌకర్యం ఉండదని, 24 గంటలు విద్యుత్ సరఫరా లైన్లు

- మిగతా 6లో

● ప్రాజెక్టును పునః ప్రారంభించాలి

ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకంతో ఉద యగిరి ప్రజలకు సురక్షి తమైన తాగునీటి అం దించాలన్న లక్ష్యంతో గత టీడీపీ ప్రభుత్వం ప్రాజెక్టును ప్రారంభించిందన్నారు. దాన్ని పూర్తి చేయకుండా గత వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. దాదాపు 30వేలమంది జనాభా ఆరోగ్యానికి సంబంధించిన ఈ పథకాన్ని మళ్లీ అమలు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు.




సమావేశంలో పాల్గొన్న సభ్యులు

పెనుమీద నుంచి పొయ్యిలో పడ్డ చందంగా ఉంది జిల్లా రైతాంగం పరిస్థితి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎరువులను బ్లాక్‌మార్కెట్‌లో అధిక ధరలకు అమ్ముతున్నారని రైతులు ఆరోపించారు. నేటి కూటమి ప్రభుత్వంలో కూడా డీఏపీ బస్తాపై రూ.50, యూరియా బస్తాపై రూ.80కిపైగా వ్యాపారులు అమ్ముతున్నా అధికారపార్టీ నేతలెవరూ పట్టించుకోవడంలేదని వారంటున్నారు. ఈ విషయంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారులు కూడా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. వ్యవసాయమే జీవనాధారంగా జిల్లాలో 70శాతానికిపైగా కుటుంబాలు జీవిస్తున్నాయి. వీరందరిపై అదనపుభారం పడుతోంది. ఈ విపత్కర పరిణామాలను అనుభవిస్తున్న అన్నదాతలు గత వైసీపీ ప్రభుత్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం దొందూ దొందూనే అని విమర్శిస్తున్నారు.

- జలదంకి, (ఆంధ్రజ్యోతి)

ఎరువులకే అధిక వ్యయం


వరి నారుమడికి యూరియా చల్లుతున్న యువరైతు

- ఎమ్మార్పీ కంటే ఎక్కువ రేట్లకు విక్రయం
- రైతులపై రూ.15 కోట్లకుపైగా అదనపు భారం
- యూరియా, డీఏపీ కొనుగోలుకుపోతే నానో, మిశ్రమ ఎరువులు అంటగడుతున్న వ్యాపారులు
- వాటిని కొనేందుకు ముందుకురాని అన్నదాతలు
- పట్టీపట్టనట్లుగా పాలకులు, అధికారులు

జిల్లాలోని పెన్నార్‌డెల్టా కింద 2.47లక్షల ఎకరాలు, కనుపూరు కాలువ కింద 61వేల ఎకరాలు, కావలి కాలువ కింద 1.24 లక్షల ఎకరాలు, ఉత్తర కాలువ కింద 98వేల ఎకరాలు, దక్షిణ కాలువ కింద 35వేల ఎకరాలు.. ఇలా మొత్తం ఐదులక్షల ఎకరాలకుపైగా రైతులు రబీసీజన్‌లో వరిసాగు చేపడుతున్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో పైఆయకట్టు అంతా సాగవుతోంది. దీనికితోడు వాణిజ్య పంటలయిన మినుము, పెసర, పొగాకు, పత్తి తదితర పంటలు రెండులక్షల ఎకరాలకుపైగా సాగవుతోంది. పండ్లతోటలు, జామాయిల్, సవకల సాగు కూడా జిల్లాలో ఎక్కువగానే ఉంది. వరిమాగాణికి ఎకరానికి సీజన్‌కు డీఏపీ-1, యూరియా-3 బస్తాల వంతున వాడతారు. ఇక మిశ్రమ ఎరువులు 17-17-17, 16-35-14 లాంటివి ఎకరానికి రెండేసి బస్తాల వంతున పైరుపై చల్లుతారు. ఎరువులు అధిక ధరలకు అమ్మడం ద్వారా ఒక్కో ఎకరానికి డీఏపీ, యూరియా కొనుగోలుపై రూ.290 అదనపు భారం పడుతోంది. ఇలా వరిసాగయ్యే ఐదులక్షల ఎకరాలకు వినియోగించే యూరియా, డీఏపీపై రూ.14.5కోట్ల అదనపు భారం రైతులపై పడుతోంది. రైతుసేవా కేంద్రాల ద్వారా యూరియా కేవలం ఐదుశాతం మంది రైతులకే అందుతోంది. మొత్తం రైతాంగానికి అదునులో ఎరువులు అందివ్వడం

- మిగతా 6లో

క్రీడా ఎంపికలపై విమర్శలు

- అస్తవ్యస్తంగా అంతర్ కళాశాలల క్రీడలు
- పోటీల నిర్వహణపై నిరుత్సాహం
- అధికారులు, నిర్వాహకుల మధ్య సమన్వయలోపం

ఖోఖోలో తలపడుతున్న క్రీడాకారులు



నెల్లూరు(విద్య), నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి) : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం(వీఎస్‌యూ) నిర్వహిస్తున్న అంతర్ కళాశాలల క్రీడలు, ఎంపికలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్నేళ్లుగా అంతర్ కళాశాలల క్రీడాపోటీల నిర్వహణ, యూనివర్సిటీ జట్ల ఎంపిక షెడ్యూల్ గందరగోళంగా మారింది. దీంతో క్రీడాకా రులు అయోమయానికి గురవుతున్నారు. కొన్ని కళాశాలలకు మాత్రమే లబ్ధిచేకూరేలా పోటీల నిర్వహణ చేస్తుండడంతో తాము క్రీడా ప్రయోజనాలు పొందలేకపోతున్నామని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. శనివారం కూడా పోటీలు సైతం ఇదే రీతిలో జరిగాయి.

● ముందస్తు సమాచారమేదీ ?

వీఎస్‌యూ మహిళా అంతర్ కళాశాలల పోటీల నిర్వహణకు జిల్లావ్యాప్తంగా ఉన్న కళాశాలల్లోని క్రీడాకారులకు ముందస్తు సమాచారం లేదు. అంతేకాక సమయం కూడా ఇవ్వకుండా శని,ఆదివారల్లో పోటీలకు హాజరు కావాలని ప్రకటించారు. ఇది ఎంతవరకు సమంజసమని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. తాజాగా శనివారం నగరంలోని డీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా క్రీడాపోటీలు, ఎంపికలు ప్రారంభించారు. ఈ పోటీలను వీసీ ఆచార్య విజయభాస్కర్ రావు, రిజిస్ట్రార్ సునీత ప్రారంభించారు. పోటీలకు మొత్తం 13 కళాశాలల నుంచి జట్లు హాజరయ్యాయి. అయితే, ముందు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఉదయం ప్రారంభం కావాల్సిన పోటీలు మధ్యాహ్నం 12 గంటలపైన ప్రారంభించారు. దీంతో క్రీడాకారులంతా అతిథుల కోసం ఎదురుచూడాల్సి వచ్చింది. ఖోఖో, హ్యాండ్‌బాల్, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు జరగాల్సి ఉండగా, కేవలం ఖోఖోలోనే ఫైనల్స్ నిర్వహించారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు నిరుత్సాహానికి గురవడంతోపాటు మరోరోజు పోటీల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. వీఎస్‌యూ అధికారులు, నిర్వాహకుల అనాలోచిత నిర్ణయాలు, సమన్వయలోపంతో క్రీడాకారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

● భోజనాలకు ఇక్కట్లు

తమకు వసతి, భోజనాలు కల్పించాల్సిన నిర్వాహకులు పూర్తిగా విఫలమైనట్లు క్రీడాకారులు తెలిపారు. ప్రారంభోత్సం అయ్యాక ఎవరికివారు వెళ్లిపోవడంతో భోజనాలు ఎక్కడ చేయాలో తెలియక క్రీడాకారులు ఇబ్బందులు పడ్డారు. దీంతో వారిని తీసుకువచ్చిన పీడీలే హోటళ్ల నుంచి పార్శిల్స్ తెప్పించి పెట్టారు. వీఎస్‌యూ జట్టుకు ఎంపిక చేసే ఈ పోటీలను తూతూ మంత్రంగా ఎలా నిర్వహిస్తారని, దీనిపై ఉన్నతాధికా రులు దృష్టి సారించారని క్రీడాకారులు కోరుతున్నారు. కాగా తొలిరోజు జరిగిన పోటీలకు అబ్జర్వర్‌గా డాక్టర్ అమ్మాజీ వ్యవహరించగా, డీకేడబ్ల్యు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి, యూనివర్సిటీ స్పోర్ట్స్ కమిటీ చైర్మన్ వెంకట్రాయులు, నిర్వాహక కార్యదర్శి డాక్టర్ సీ విజయకళ, పీడీ తదితరులు పాల్గొన్నారు.

మద్యం ఊసేలేని గ్రామం

- బయటకు ఇసుక తరలిస్తే జరిమానా
- కట్టుబాట్ల ఊరు 'వెల్లంటి'
- 2021లో ఉత్తమ పంచాయతీగా ఎంపిక



రాష్ట్రంలో సురక్షితమైన తాగునీరు అందని గ్రామం ఏదైనా ఉందేమోకాని.. బెల్టు దుకాణం లేని గ్రామమంటూ లేనేలేదు. కానీ ఇప్పటికీ ఆ గ్రామంలో బెల్టుషాపుల నిర్వహణపై నిషేధం ఉందటే ఆశ్చర్యమే. కాని ఇది నిజం. అలాగే గ్రామం నుంచి బయట ప్రాంతాలకు ఇసుక రవాణా చేయకూడదనే ఆంక్ష కూడా ఉంది. ఎవరైనా అతిక్రమిస్తే రూ. 10 వేల జరిమానా విధిస్తారు. 2021లో జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామసభల నిర్వహణ అవార్డును సొంతం చేసుకున్న గ్రామం నెల్లూరు రూరల్ మండలం పాతవెల్లంటి. 300 ఎకరాల వరకు సీజేఎఫ్ఎస్ భూములు కలిగి, ప్రభుత్వం చేయూతతో పైర్లు సాగవుతున్న గ్రామం కూడా ఇదే. ఇన్ని విశేషాలున్న ఈ గ్రామం నుంచి తెలుసుకుందాం.

6

రెవెన్యూలో ప్రక్షాళన

- కార్పొరేషన్‌లో ఆర్వోలు, ఆర్ఐలంతా బదిలీ
- కమిషనర్ సూర్యతేజ విప్లవాత్మక నిర్ణయం
- నెల్లూరు నగర చరిత్రలో ఇదే ప్రథమం
- మంత్రి హెచ్చరికతో మారిన సీను

నెల్లూరురూరల్,నవంబరు23,(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర కార్పొరేషన్ చరిత్రలోనే రెవెన్యూ విభాగాన్ని ప్రక్షాళన చేస్తూ కమిషనర్ సూర్యతేజ తీసుకున్న నిర్ణయం, విప్లవాత్మకమైనదని జిల్లాతో పాటు రాష్ట్రంలోని పురపాలక సంఘాల్లో చర్చనీయాంశంగా మారింది. ముగ్గురు రెవెన్యూ అధికారుల(ఆర్వోల)తోపాటు పదిమంది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల (ఆర్ఐల)ను ఏకకాలంలో బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులిచ్చారు. కార్పొరేషన్ ఏర్పడ్డాక ఇప్పటి వరకు ఒక విభాగంలో అధికారులందరినీ ఒకేసారి బదిలీ చేయడం ఇదే ప్రథమం. ఆర్ఐల స్థానంలో కొత్తవారికి అవకాశం ఇచ్చిన కమిషనర్ ముగ్గురు ఆర్వోల బాధ్యతలను ప్రస్తుత మేనేజర్ ఇనయతుల్లాకు కట్టబెట్టారు. బదిలీ చేసిన వారందరిని వివిధ విభాగాల్లో నియమించాక ఆర్వోలను శానిటేషన్ సూపర్‌వైజర్లుగా నియమించారు.

ఆర్ఐలుగా ఉన్న సీహెచ్ క్రిష్ణంరాజు స్థానంలో ఆర్ వంశీనాథ్ రెడ్డి, కే కృపాకర్‌స్థానంలో టీ కార్తీక్‌రెడ్డి, ఐ చిన్నబాబు స్థానంలో బీ శ్రీసందీప్, వీ పద్మావతి స్థానంలో టీ శరత్‌బాబు, ఏ సునీల్‌కుమార్ స్థానంలో ఎస్ శ్రావణ్‌కుమార్, ఎన్ క్రిష్ణకిషోర్ స్థానంలో జీ లోకనాథంలను ఆర్ఐలుగా నియమించారు. కాగా వీరంతా రెగ్యులర్ ఆర్ఐలు. అడిషనల్ ఆర్ఐలుగా ఉన్న సీహెచ్ రవి, ఎస్ అజయ్, వై శ్రీనివాసులు, జీ పెంచలయ్యలను ఆ పోస్టు నుంచి తొలగించారు. వారివారి అర్హతలను బట్టి వివిధ విభాగాల్లో నియమించారు. కాగా రెవెన్యూ అధికారులు(ఆర్వో)గా కొనసాగు తున్న అబ్దుల్ సమ్మద్, పీ శ్రీనివాసులు, వై రాజేశ్వరిలను ఆ స్థానాల నుంచి రిలీవ్ చేసి, వారి బాధ్యతలను మేనేజర్ హెచ్ ఇనయతుల్లాకు అప్పగించారు. బదిలీ అయిన ఆర్వోలు సమ్మద్, రాజేశ్వరిలను ఆరోగ్య విభాగంలో శానిటరీ సూపర్‌వైజర్లుగా నియమించారు. కమిషనర్ శ్రీనివాసులును రెవెన్యూ విభాగంలో సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు.

● మంత్రి సమీక్షతో మారిన సీను

పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ ఇటీవల కార్పొరేషన్ కార్యాలయంలో రెవెన్యూ విభాగంపై ప్రత్యేకంగా సమీక్షించారు. ఆస్తి పన్ను సుమారుగా రూ. 170 కోట్ల వరకు కార్పొరేషన్ చెల్లించాల్సి ఉంది. వాటిని వసూలు చేయడంలో అటు ఆర్వోలు, ఇటు ఆర్ఐలు నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని గుర్తించిన ఆయన హెచ్చరికలు జారీ చేశారు. 'మీరు చేయలేకపోతే పక్కకు తప్పుకోండి.. కొత్తవారితో చేయించు కుంటా' నని పేర్కొన్నారు. అయినా ఎవరిలోనూ మార్పు రాలేదు. తాజాగా జరిగిన బదిలీలు నారాయణ సమీక్ష ఫలితమేనంటూ ఎన్ఎంసీలో చర్చసాగుతుంది. ఇకపోతే సిటీప్లానింగ్‌లోనూ భారీ మార్పులు చోటుచేసుకుంటాయని సంకేతాలు వెలువడుతున్నాయి. కాగా కార్పొరేషన్‌లోని రెవెన్యూ విభాగంలో భారీ మార్పులు జరగబోతున్నాయంటూ ఈ నెల 8న ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది.

మంచు.. ముంచేను ప్రమాదాల్లో..

కొద్ది రోజులుగా జిల్లాను పొగమంచు కమ్మేస్తోంది. ఉదయం ఏడుగంటలు దాటుతున్నా.... దట్టమైన మంచు తప్ప మరేమీ కనిపించడంలేదు. ఈ సమయంలోనే గతంలో జిల్లాలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగాయి. మరి ఈ ఏడాది కొంచెం ముందుగానే వచ్చిన పొగమంచు ఎన్ని ప్రమాదాలకు కారణమవుతుందో... ఎంతమంది ప్రాణాలు బలి తీసుకుంటుందో... ఎవరి జీవితాలను చిన్నాభిన్నం చేస్తుందో చూడాలి. రోడ్డు పక్కన వాహనాలు నిలిపివేయడంతో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. మంచుకాలంలో తప్పనిసరి అయితేనే ప్రయాణాలు చేయాలి. అందులోనూ తగిన జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చు.

-నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట, (ఆంధ్రజ్యోతి)


మంచులో జాతీయరహదారిపై ఆగి ఉన్న వాహనాలు

- జిల్లాను కమ్మేస్తున్న పొగమంచు
- ఉదయం ఏడువరకు కనిపించని రహదారులు
- రోడ్డు పక్కన వాహనాలు నిలపడంతో యాక్సిడెంట్లు
- రెస్ట్ ఏరియాల్లోనే ఆపుచేసుకోవాలి
- తప్పనిసరి అయితేనే ప్రయాణం
- జాగ్రత్తలు మరువద్దు సుమా..!

జిల్లావ్యాప్తంగా జాతీయ రహదారి వ్యాపించడంతో మంచు కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ప్రధానంగా హైవేలో అతివేగంగా వాహనాలు వెళుతుంటాయి. సాధారణ పరిస్థితుల్లో ప్రయాణాలకు, పొగ మంచులో ప్రయాణం చేయడానికి చాలా తేడా ఉంది.హైవేపై మంచు అధికంగా ఉన్నప్పుడు జరిగే ప్రమాదాల్లో 50 శాతానికి పైగా ఆగిఉన్న వాహనాలను ఢీకొనే... జాతీయ రహదారికి పక్కనే వరుసగా వాహనాలు నిలపడం ద్వారా మంచులో వాహనాలు కనిపించకపోవడంతో వాటిని ఢీకొనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. హైవే అథారిటీ వారు జిల్లాలో పలుచోట్ల రెస్ట్ ఏరియాలను ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో వాహనాలను పార్క్ చేసుకుని విశ్రాంతి తీసుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

● ఈ జాగ్రత్తలు పాటించండి

● పొగమంచు సమయంలో ప్రయాణాలు చేసే వారు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి.

● దట్టమైన పొగమంచులో వెళ్లేటప్పుడు కారులోని విపత్తు హెచ్చరికల లైటును ఆన్ చేయాలి. ఇలా చేయడం ద్వారా రహదారిపై కారు ఉనికిని ఇతర వాహనాలు గుర్తించే అవకాశం ఉంది. విపత్తు హెచ్చరికల లైటు అంటే.. కారుకు నాలుగు వైపులా ఉన్న లైట్లు వెలుగుతూనే ఉంటాయి.

● పొగమంచులో వెళ్లే సమయంలో ఎదురుగా వచ్చే వాహనాలపై దృష్టి సారిస్తూ చేతులను ఎప్పుడూ స్టీరింగ్ మీదనే ఉంచి మలుపుల్లో వెంటనే స్పందించి స్టీరింగ్‌ను తిప్పుతూ వాహనాన్ని అదుపు చేసేలా ఉండాలి. ఇవన్నీ జరగాలంటే తక్కువ వేగంతో వాహనాన్ని నడపాలి.

● డ్రైవింగ్ చేసేటప్పుడు జాతీయ, రాష్ట్ర రహదారులపై ఉన్న రేడియమ్ రైలింగ్ గుర్తులను ఫాలో అవుతూ వాహనం నడపాలి. వంతెనలు, ఇరుకైన రోడ్డుప్రాంతాల్లో ఏర్పాటు చేసిన తెలుపు, పసుపు రంగుల్లో రోడ్డు మార్కు లను గమనిస్తూ వాహనం నడపాలి. ఇలా చేయడం ద్వారా ప్రమాదాలను అధిగమించవచ్చు.

● పొగమంచు కారణంగా కారు ముందు, వెనుక వైపున అద్దాలపై తెల్లగా మంచు పేరుకు పోతుంది. దీని ద్వారా రహదారి సరిగా కన్పించదు. అయితే మంచును ఆటోమేటిక్‌గా కరిగించేందుకు కార్లలో డీఫాగర్‌ను వేయడం ద్వారా అద్దాలపై పేరుకున్న మంచు కరిగిపోతుంది.

● మంచులో ప్రయాణం చేసే సమయంలో వాహనాల్లోని సౌండ్‌ను తక్కువగా ఉంచుకోవాలి. పొగ మంచులో రోడ్డు స్పష్టంగా కనిపించే అవకాశం చాలా తక్కువ. అందుకే డ్రైవింగ్ చేసే సమయంలో మనసును డ్రైవింగ్‌పై కేంద్రీకరించాలి.

● సాధారణ పరిస్థితుల్లోనే మద్యం మత్తులో డ్రైవ్ చేయడం ఏమాత్రం మంచిదికాదు. అలాంటిది దట్టమైన పొగమంచు కమ్ముకున్నప్పుడు మద్యం సేవించి వాహనాన్ని నడపడం చాలా ప్రమాదకరం.

● మంచులో డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మీ ముందున్న వాహనానికి తగినంత దూరం పాటించాలి.తద్వారా ఆ వాహనాలు పొరపాటున ప్రమాదానికి గురైతే వెంటనే మనం పక్కకు తప్పుకునే అవకాశం ఉంటుంది.

● పొగ మంచులో ప్రయాణించే వారు ముందుగా హెడ్‌లైట్ల పనితీరును చెక్ చేసుకోవాలి. ఒక లైటు మాత్రమే పనిచేస్తున్నా, లైట్లు తక్కువ వెలుతురులో ఉన్నా మీ ప్రయాణాన్ని మానుకోవాలి.

జాగ్రత్తగా వాహనాలు నడపండి



పొగమంచు అధికంగా ఉన్న సమయంలో అత్యవసరం అనుకుంటేనే ప్రయాణాలు చేయండి. ఎక్కువ వేగం వెళ్లకుండా తక్కువ స్పీడులో వాహనం నడపాలి. పూర్తి దృష్టి వాహనంపై ఉంచాలి. రోడ్డు పూర్తిగా మంచుతో కమ్మేసి ఉంటే వాహనాలను రెస్ట్ ఏరియాలో పార్క్ చేసుకోవాలి.

- చందర్, డీటీసీ

డిగ్రీ పరీక్షలకు ఐదుగురి గైర్హాజరు

వెంకటాచలం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో శనివారం మధ్యాహ్నం జరిగిన డిగ్రీ ఐదవ సెమిస్టర్ పరీక్షలకు ఐదుగురు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారిని డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. 82 మంది విద్యార్థులకు గాను 77 మంది హాజరయ్యారు.



వైభవంగా మహారుద్రాభిషేకం

నెల్లూరు బాలాజీనగర్‌లోని త్యాగరాజ స్వామి కల్యాణ మండపంలో శనివారం మహారుద్రాభిషేకం వైభవంగా జరిగింది. ఐదు అడుగుల మహాశివలింగానికి భక్తులే స్వయంగా నామగోత్రాలతో బారులుతీరి అభిషేకాలు చేశారు. కుర్తాళం పీఠం ఆస్థాన అర్చకులు మాచవోలు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో మహాన్యాసాలు చేశారు. అనంతరం సుగంధ పుష్పాలతో మహాశివుడికి ఘనంగా పుష్పాభిషేకం నిర్వహించారు. కార్యక్రమానికి నగరం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

- నెల్లూరు సాంస్కృతికం, (ఆంధ్రజ్యోతి)



ఫాగింగ్ లేదు.. బ్లీచింగే..!

మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధి, ఎంపీడీవో కార్యాలయంలో ఫాగింగ్ యంత్రాలు ఉన్నాయి. ఈ యంత్రాలన్నీ చెడిపోయి మూలకు చేరడంతో గ్రామాలలో దోమల నివారణకు అధికారులు కేవలం బ్లీచింగ్ చల్లి చేతులు దులుపుకుంటున్నారు. ఫాగింగ్ యంత్రాలతో మలాథిన్, డీజిల్ మిశ్రమంతో వీధుల్లో స్ప్రే చేస్తే దోమలు చనిపోతాయని గ్రామస్థులు చెబుతున్నారు.

- లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి)

మద్యం ముట్టని 'వెల్లంటి' ఆదర్శ గ్రామం

- బెల్టు షాపులకు గ్రామస్థుల వ్యతిరేకం
- 29 ఏళ్లుగా నిషేధాజ్ఞలు
- గ్రామం నుంచి ఇసుక బయటకు తీసుకెళ్తే జరిమానా
- 2021లో ఉత్తమ పంచాయతీగా ఎంపిక



నెల్లూరు రూరల్, నవంబరు23 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరుకి పడమర దిక్కున 22 కిలోమీటర్ల దూరంలో పాతవెల్లంటి గ్రామం ఉంది. 1995 నుంచి సీపీఎం అభ్యర్థులే సర్పంచులుగా ఇక్కడ గెలుస్తున్నారు. నాటి నుంచి నేటి వరకు కొన్ని కట్టుబాట్లు పెట్టుకుని ఊరంతా అమలు చేస్తున్నారు. అందులో ముఖ్యమైంది మద్యం నిషేదం. గత 29ఏళ్లగా ఈ ఊర్లో మద్యం విక్రయాలు లేవు. ఎవరైనా తాగాలంటే పక్క గ్రామాలకు వెళ్లాల్సిందే. ఈ కట్టుబాటును అతిక్రమిస్తే రూ. 10 వేలు జరిమానాతోపాటు గ్రామస్థులే స్వచ్ఛందంగా ఆ వ్యక్తిని పోలీసులకు అప్పగిస్తారు. పెద్ద పెద్ద నేతలు కూడా గ్రామంలో బెల్టు షాపులు ఏర్పాటు చేయాలని తీవ్రంగా ప్రయత్నించినా సాధ్యం కాలేదు. చివరికి కల్లు అమ్మకాలను సైతం గ్రామ సరిహద్దులకే పరిమితం చేశారు.

● ఇసుక తరలిస్తే జరిమానా

గత వైసీపీ హయాంలో పెన్నా పరివాహకం నుంచి ఇసుకను ఇష్టానుసారం తవ్వేసి అన్నీ ప్రాంతాల్లోనూ జోరుగా అమ్ముకున్నారు. కానీ వెల్లంటి గ్రామం పెన్నాకు అతిసమీపాన ఉన్నా, ఇసుకను బయట ప్రాంతాలకు రవాణా చేయకుండా ఊరి కట్టుబాటుతో నిషేధించారు. అలా ఎవరైనా చేస్తే రూ. 10 వేల జరిమానా విధిస్తారు. జరిమానా ద్వారా వచ్చిన నగదును గ్రామప్రజల అవసరాలు, ఆలయాల అభివృద్ధికి కేటాయించడం ఇక్కడ ప్రత్యేకత. ఇకపోతే గ్రామ కంఠం కింద గుర్తించిన 8 ఎకరాల భూమిని ఆంజనేయస్వామి ఆలయానికి కేటాయించారు. వచ్చిన ఆదాయాన్ని గుడి అవసరాలకు వినియోగిస్తారు.

● ఉత్తమ పంచాయతీగా అవార్డు

గ్రామప్రజల ఇబ్బందులు, అవసరాలు, భవిష్యత్ కార్యచరణపై పంచాయలో తీసుకున్న తీర్మానాలకు ఊరంతా కట్టుబడి ఉండాల్సిందే. పంచాయతీలో విధిగా సర్పంచి అధ్యక్షతన వార్డు సభ్యులు గ్రామ సభలు నిర్వహిం చడం ఆనవాయితీ. అందుకే 2019-20 లో కేంద్ర బృందం పరిశీలించి 2021లో నానాజీ దేశ్‌ముఖ్ రాష్ట్రీయ గ్రామసభ కేటగిరీ కింద ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేశారు. ఈ మేరకు అవార్డును ప్రకటించిన కేంద్రం రూ. 10 లక్షల నిధులు కూడా ఇచ్చింది. వాటిని తాటిపర్తి రహదారి నుంచి గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణానికి వినియోగించారు.



సీజేఎఫ్‌ఎస్ భూములకు గ్రామస్థులు వేసుకున్న దారి

● అత్యధికంగా సీజేఎఫ్‌ఎస్ భూములు

నెల్లూరు రూరల్ మండలంలో అత్యధికంగా (300 ఎకరాల వరకు) సీజేఎఫ్‌ఎస్ భూములున్న గ్రామం పాతవెల్లంటి. అన్ని కులాల వారు లబ్ధిదారులుగా ఉన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సుమారు 40 బోర్లు వరకు ఏర్పాటు చేశారు. ఇప్పటికీ ప్రభుత్వ వనరులను ఉపయోగించుకుంటూ పంటలను సాగు చేసుకుంటున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఎస్సీ కార్పొరేషన్ ప్రతినిధులు జిల్లాకు ఎవరొచ్చినా తొలత ఈ భూములనే ఇప్పటికీ పరిశీలించడం ఆనవాయితీ.

కట్టుబాటుగా ఉంటాం



గ్రామప్రజలంతా కట్టుబాటుగా ఉంటాం. ఏ నిర్ణయమైనా కలిసి తీసుకుంటాం. గ్రామ ప్రయో జనాలు, భవిష్యత్ ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకుంటాం. ప్రజల సహకారం మరువరానిది.

- పాదర్తి రాధ, సర్పంచి

ఊరంతా కుటుంబ సభ్యులుగా ఉంటాం



ఊర్లో ప్రజలంతా కుటుంబ సభ్యులుగా ఉంటాం. ఊరి భవిష్యత్ అంటే అది మా భవిష్యత్ కూడా... మా ఊర్లో కుల, మత బేదాలు లేవు. తప్పు చేస్తే ఎవరికైనా జరిమానా విధిస్తాం.

- పల్లవరపు చెంచయ్య

ఎరువులకే అధిక వ్యయం

(5వ పేజీ తరువాయి)

లేదు. దీంతో రైతులు అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. ఇక మిగిలిన మెట్ట పంటలకు, పండ్లతోటలకు వినియోగించే ఈ రకాల ఎరువుల కారణంగా రైతులపై కూడా రూ.2కోట్లకుపైగా అదనంగా భారం పడుతోంది. దీనికితోడు కూలీల ఖర్చులు, క్రిమిసంహారక మందుల పెరుగుదలను చూస్తే మరింత ఆర్థిక భారం అన్నదాతలపై పడుతోంది.

● డీలర్ల దోపిడీ

కంపెనీలకు సంబంధించిన జిల్లా డీలర్ల వద్దే ఈ దోపిడీ జరుగుతోంది. అదెలాగంటే డీలర్లకు ఎరువులను దుకాణదారులు ఇండెంట్ పెడితే యూరియా, డీఏపీ లోడు కావాలంటే కేజీ ప్యాకెట్ల మిశ్రమ ఎరువు లేదా నానో డీఏపీ, యూరియా కేసులు అంటగడుతున్నారు. వీటిని తీసుకోకపోతే యూరియా ఇవ్వడంలేదని ఎరువుల అంగళ్లవారు గగ్గోలు పెడుతున్నారు. ఈ ప్యాకెట్లు అమ్మాలంటే కొనే రైతులు అరుదుగా ఉన్నారు. దీంతో తాము వీటిని ఏం చేయాలని వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు. దీంతో అదనపు ధరను యూరియా, డీఏపీలపై వసూలు చేయాల్సి వస్తోందని వారంటున్నారు. జిల్లాస్థాయిలో కంపెనీల డీలర్లను అదుపు చేయగలిగితే రైతులకు ఎమ్మార్పీకే ఎరువులు ఇవ్వగలుగుతామని వ్యాపారులు పేర్కొంటున్నారు.

● వ్యవసాయశాఖ ఏం చేస్తున్నట్లు?

జిల్లాలో యూరియా, డీఏపీలను ఎమ్మార్పీకంటే అధిక ధరలకు వ్యాపారులు అమ్ముతుంటే జిల్లా వ్యవసాయశాఖ ఏం చేస్తున్నట్లు అని రైతులు, రైతుసంఘాల ప్రతినిదులు ప్రశ్నిస్తున్నారు. వారు తమ కార్యాలయాలు వదిలి బయటకు వస్తున్నారా ? అని ప్రశ్నిస్తున్నారు. లేదా వారికి ఈ దోపిడీలో వాటా ఏమైనా ఉందా ? వారు నిలదీస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారులు నిద్రమత్తు వీడి అధిక ధరలకు ఎరువుల అమ్ముతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మాలకొండలో అన్నదానానికి 85 బస్తాల బియ్యం

వలేటివారిపాలెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మాలకొండలక్ష్మీ నరసింహ స్వామి భక్తుల అన్నదానానికి లింగసముద్రం మండలం రామకృష్ణాపురం వాసులు శనివారం 85 బస్తాల బియ్యాన్ని డీసీ సాగర్‌బాబుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడారు. గ్రామస్థులతోపాటు ఇతరుల నుంచి ఈ బియ్యంసేకరించామని తెలిపారు. మూడేళ్ల నుంచి ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ సాగర్‌బాబు వారిని అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ బీ వెంకటేశ్వరరావు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



డీసీ సాగర్‌బాబుకు బియ్యంను అందజేస్తున్న రామకృష్ణాపురం వాసులు

సాయిపేటలో ప్రబలుతున్న విషజ్వరాలు

కొండాపురం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిపేట గ్రామస్థులు జ్వరాలబారిన పడుతున్నారు. గ్రామంలో ఇప్పటివరకు 50 మందికిపైగా జ్వరాల బారినపడ్డారు. వారిలో కొందరికి జ్వరం తగ్గకపోవడంతో పట్టణాలలోని ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి చికిత్స చేయించుకున్నారు. అక్కడ రక్తపరీక్షలు చేయించుకోగా టైఫాయిడ్, డెంగ్యూ, వైరల్ తదితర విషజ్వరాలు ఉన్నట్లు తేలింది. మరికొందరికి ప్లేట్‌లెట్స్ తగ్గినట్లు రక్తం ఎక్కించుకుంటున్నారు. వీరికి వైద్యఖర్చులకు రూ.10వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేసుకున్నట్లు జ్వర బాధితులు వాపోతున్నారు.

● అధికారుల అప్రమత్తం



బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యశాఖ సిబ్బంది

విషయం తెలుసుకున్న మండల వైద్యశాఖ, పంచాయతీ అధికారులు శనివారం గ్రామంలో పర్యటించారు. మురుగునీటి గుంటల్లో దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ చల్లిం చడంతో పాటు ఆయిల్ బాల్స్ వేయించారు. ఈవోపీఆర్‌డీ ఆదినా రాయణరావు, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, ఏఎన్‌ఎమ్ సుజాత, ఎమ్ ఎల్‌హెచ్‌పీసీ హెచ్‌వో మార్గరెట్, ఆశా కార్యకర్తలు జ్వరాల బారినపడిన వారి ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిం చారు. 15 రోజుల నుంచి గ్రామంలో జ్వరాలు ప్రబలుతుంటే వైద్యశాఖ అధికా రులు పట్టించుకోకపోవడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయంపై వైద్యాధికారి నసీరుద్దీన్‌ను వివరణ కోరగా జ్వరాలు ఉన్నాయని తెలుసుకొని సర్వే చేయించి, వైద్యశిబిరం నిర్వహించామన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తున్నట్లు తెలిపారు.

వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ కృష్ణకాంత్



ఎస్పీ ఆకస్మిక తనిఖీ

వలేటివారిపాలెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఎస్పీ కృష్ణకాంత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలిచి, ఆవరణలోని తుప్పుపట్టిన వాహనాల వివరాలను ఎస్ఐను అడిగి తెలుసుకున్నా రు. అనంతరం నమోదైన కేసుల వివరాలపై ఆరా తీశా రు. ఆయన వెంట కందుకూరు డీఎస్పీ సుబ్ర మణ్యం, గుడ్లూరు సీఐ మంగారావు, ఎస్ఐ మరిది నాయుడు ఉన్నారు.

● కందుకూరు, (ఆంధ్రజ్యోతి): వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలు పోలీసుస్టేషన్లలోనే శిథిలమై పోకుండా కోర్టు అనుమతి తీసుకుని వేలం వేయాలని ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశించారు. శనివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంతో పాటు సబ్ డివిజన్‌లోని కందుకూరు, గుడ్లూరు సర్కిల్ కార్యాలయాలు, అన్ని పోలీసుస్టేషన్లను పరిశీలించారు. ఆయన వెంట కందుకూరు డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసరావు, గుడ్లూరు సీఐ మంగారావు ఉన్నారు.

వీఎస్‌యూలో ఉద్యోగ దరఖాస్తులు

వెంకటాచలం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీలోని పలు విభాగాలకు పీహెచ్‌డీ పూర్తి చేసిన అభ్యర్థులు రీసెర్చ్ అసోసియేట్స్ ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకునేందుకు వీఎస్‌యూ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో బయోటెక్నాలజీ, బిజినెస్ మేనేజ్‌మెంట్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, ఇంగ్లీష్, మెరైన్ బయాలజీ, ఫిజిక్స్, సోషల్ వర్క్, టూరిజం మేనేజ్‌మెంట్ విభాగాలకు, కావలిలోని పీజీ సెంటర్ కళాశాలలో బోటనీ, ఎకానామిక్స్, జూలాజీ, కామర్స్ విభాగాలకు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వచ్చే నెల 15వ తేదిలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం 0861 - 2330484 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

మంచినీరిచ్చి కాపాడండి

(5వ పేజీ తరువాయి)



ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. వ్యవ సాయ శాఖపై సమీక్ష జరగ్గా వెంకటగిరి ఎమ్మెల్యే కురగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ రైతులంతా పంటలు వేసుకుంటున్నారని, కానీ చెరువులకు నీళ్లు ఎప్పుడు విడుదల చేస్తారో అధికారులు తెలియచేయడం లేదన్నారు. వెంటనే రైతులకు సమాచారం ఇవ్వడంతోపాటు ఎరువులు అం దుబాటులో ఉంచాలని కోరారు.

● రూరల్ ఎమ్మెల్యే అసంతృప్తి



జడ్పీ సమావేశంలో సాగునీరు, వ్యవసాయం తదితర అంశాలు ఉన్నప్పటికీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు సమావేశానికి రాకపోవడంపై రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు సభలో లేకపోతే సమస్యలు ఎవరికి చెప్పాలి. వాటిని ఎవరూ పరిష్కరించాలని ప్రశ్నించారు. గత సమావేశాలకు సైతం ఆశాఖ అధికారులు రాలేదని, దీనిపై ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకోవాలన్నారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ సమావేశాలకు కారణం లేకుండా అధికారులు గైర్హాజరైతే నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

● పార్టీలను పక్కనపెట్టి ముందుకు రండి : ఆనం

గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తు న్నదని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో పంచాయతీలకు కేంద్రం ఇచ్చిన నిధులను సైతం గ్రామాలకు ఇవ్వకుండా ప్రభుత్వమే వాడేసుకొని ఇబ్బంది పెట్టిందన్నారు.కొంతమంది జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు మాపార్టీ వేరు మీ పార్టీ వేరన్నట్లుగా వ్యవహరిస్తూ అభివృద్ధికి దూరం అవుతున్నారన్నారు. పార్టీలు అభివృద్ధి చేయలేవని ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలన్నారు. పార్టీలను పక్కన పెట్టి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. జడ్పీ సమావేశంలోనూ ఎక్కువమంది సభ్యులు సమస్యలపై మాట్లాడటం లేదన్నారు.

● ప్రొటోకాల్ పటిష్టంగా అమలు చేయండి



మండలస్థాయిలో అధికారులు ప్రొటోకాల్ ను పాటించడం లేదని పలువురు సభ్యులు వాపోయారు. మండల సమావేశాలకు సైతం అధికారులంతా రావడం లేదన్నారు. ఫోన్లు చేసినా స్పందించే పరిస్థితి ఉండటం లేదని పలువురు జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు వాపోయారు. జడ్పీ చైర్మపర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ తనకే ప్రొటోకాల్ ఇబ్బందులు ఉన్నాయన్నారు. తన మండలంలో జరిగిన పల్లె పండుగకు ఎంపీడీవో తనకు కనీస సమాచారం కూడా ఇవ్వలేదన్నారు. దీనిపై కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్‌ను కోరారు.

● మోడల్ గ్రామాలను ఎంపిక చేయండి

ప్రస్తుత పరిస్థితుల్లో సోలార్ విద్యుత్ ఎంతో ఉపయోగమని, దీనిపై ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించాలని మంత్రి ఆనం అధికారులను ఆదేశించారు. ఇప్పటికే సోలార్ విద్యుత్ ఏర్పాటుకు ఎక్కువ మంది ముందుకు వస్తున్నారని, అయితే ఇది పట్టణాలకు, నగరాలకు పరిమితం కాకుండా గ్రామాలకు విస్తరించేందుకు ప్రతి మండలానికి ఒక మోడల్ గ్రామాన్ని ఎంపిక చేయాలన్నారు. ఇందుకోసం ఎమ్మెల్యేలు, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని మంత్రి కోరారు.

బీజేపీ సంబరాలు

నెల్లూరు(క్రైం), నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర అసెం బ్లీ ఎన్నికల్లో బీజేపీ కూటమి ఘన విజయం సాధించిన సందర్భంగా శనివారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో నాయకులు స్వీట్లు పంచిపెటి, బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భరత్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఇది చరిత్రాత్మక విజయమని, ఇంతటి విజయాన్ని అందించిన మహారాష్ట్ర ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తో మహారాష్ట్ర అభివృద్ధిలో దూసుకు పోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యర్రబోలు రాజేష్, గడ్డం విజయకుమార్, కరణం సుభాషిని, గిరికుమార్ గౌడ్, మదన్, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ కార్యాలయంలో మిఠాయిలు పంచుకుంటున్న ఆ పార్టీ నాయకులు

జీవో 73 ప్రకారం వ్యవసాయ కార్మికులకు కూలి చెల్లించాలి

● జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య

నెల్లూరు(వైద్యం), నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వరి నాట్లలో వ్యవసాయ కార్మికులకు జీవో నెంబర్ 73 ప్రకారం కూలి ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ప్రారంభమై ముమ్మురంగా పనులు సాగుతున్నాయన్నారు. కానీ జిల్లాలోని వ్యవసాయ కూలీలకు పనులు దొరకటం లేదని కొందరికి పనులు దొరకినా సరైన కూలి రావటం లేదన్నారు. వ్యవసాయ పనులలో యంత్రాలు రావటం, బెంగాల్, బీహార్ వలస కూలీలు రావటంతో స్థానికులకు పనులు దొరక్క నానా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు జీవో నెంబర్ 73 తీసుకు వచ్చి వ్యవసాయ కార్మికులు 6గంటలు పనిచేస్తే రూ.480 ఇవ్వాలని తెలియచేసిందన్నారు. అయితే ఈ జీవో ఎక్కడా అమలు కావటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమరాజు మాట్లాడుతూ వరి నాట్లకు కాంట్రాక్టు కుదుర్చుకుని కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారని తెలిపారు. ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలపై సబ్సిడీ కొనసాగించాలన్నారు. పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బట్టా పెద్దాబ్బాయ్, నక్క రాధయ్య, బెల్లంకొండ నాగమ్మ, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంగళ పుల్లయ్య

ఎమ్మెల్యేగారూ.. స్పందించండి



కొండబిట్రగుంట ప్రధాన రోడ్డులో వర్షం వచ్చిన ప్రతిసారీ నీరు నిలుస్తుందని అవి బయటకు వెళ్లే చర్యలు అధికారులు తీసుకోక పోవడం లేదు. రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని స్థానికులు వాపోతున్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి పదేళ్ల పాలనలో రోడ్డు అభివృ ద్ధి విషయం మ రిచారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణా రెడ్డి సారు మీరైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

-బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి)

గుంత కనిపించదా సార్..

కావలిలోని మానస థియేటర్, లతాథియేటర్‌ల మధ్య రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రోడ్డుపై ఏర్పడిన పెద్ద గుంత ప్రమాదకరంగా ఉంది. ఈ గుంత పడి ఆరు నెలలకు పైగా అవుతున్నా, పలువురు ప్రమా దాల బారినపడినా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పటికైనా అధికారులు గుంతను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

-కావలిటౌన్, (ఆంధ్రజ్యోతి)



కుళాయి నీరు వృథా..

స్థానిక సాయి ఫిల్లింగ్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనే ఉన్న కుళాయి పైపు పగిలి పోవడంతో నీరు వృథాగా పోతుంది. రోడ్డుపై నీరు నిలి చి వాహనదారులు, పాదచారులకు ఇబ్బంది కలుగు తుంది. నాలుగు రోజుల కిందట కుళాయి పైపును లారీ తొక్కడంతో ఈ సమస్య నెలకొందని అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

-లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి)



పట్టుమని పదిమంది నివాసం లేరు!

- పూర్తైన ఇళ్లు 91.. నివాసముంటున్నది 8మంది
- 17జగనన్న లేఅవుట్ల ఖర్చు రూ.1.80 కోట్లు
- అధికారులు, గుత్తేదారులకు కాసుల వర్షం

లింగసముద్రం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో అట్టహాసంగా ప్రారంభించిన జగనన్న లేఅవుట్లలో నేడు పట్టుమని పదిమంది కూడా నివాసం ఉండటం లేదు. ఈ లేఅవుట్లు పిచ్చి మొక్కలు, ముళ్లకంపలతో నిండి అడవులను తలపిస్తున్నాయి. మండలంలోని 16పంచాయతీలలో 17జగనన్న లేఅవుట్లను నిర్మించారు. అందుకోసం ఉపాధిహామీ నిధులు సుమారు రూ.1.80 కోట్లు ఖర్చు చేశారు. ఈ లేఅవుట్లలోనే నవరత్నాల పథకం కింద రెండవవిడతలో 587పక్కాగృహాలు మంజూరయ్యాయి. వీటిలో యర్రా రెడ్డిపాలెం, లింగసముద్రం-2, చినపవని, పెదపవని గ్రామాలకు 293 గృహాలు మంజూరయ్యాయి. ఇందులో కేవలం 91గృహాలను లబ్ధిదారులు నిర్మించుకున్నారు. మరో 81గృహాలు వివిధ దశలలో నిర్మాణంలో ఉన్నాయి. అయితే ఈ నాలుగు లేఅవుట్లలో పెదపవనిలో నలుగురు, చినపవనిలో ఒకరు, యర్రారెడ్డిపాలెంలో ముగ్గురు చొప్పున మొత్తం 8మంది మాత్రమే నివాసం ఉంటున్నారు. మిగిలిన 415 పక్కాగృహాల నిర్మాణాల ఊసేలేదు.

ఆసక్తి చూపని లబ్ధిదారులు

లేఅవుట్లలో పక్కా గృహాలను నిర్మించుకొనేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. లేఅవుట్లలో పక్కా గృహాలను ప్రభుత్వమే నిర్మించి ఇస్తుందని ప్రకటించి రూ.ఒక్కో గృహానికి రూ.1.80లక్షలు మాత్రమే మంజూరు చేశారు. లేఅవుట్లు గ్రామాలకు దూరంగా ఉండటంతో చాలామంది నిర్మాణాలకు ఆసక్తి చూపలేదు.

మట్టిలో పోసినట్లుగా రూ.1.80 కోట్లు


17 జగనన్న లేఅవుట్లకు రూ.1.80 కోట్లు అధికారులు ఖర్చు చేస్తే కేవలం 8 మంది మాత్రమే నివాసం ఉండటంతో నిధులు మట్టిలో పోసినట్లైంది. ఈ లేఅవుట్ల ఏర్పాటు అటు అధికారులు ఇటు గుత్తేదారులకు కాసుల వర్షం కురిపించిందని విమర్శలు ఉన్నాయి.



జంగంరెడ్డిపాలెంలో అసంపూర్తిగా ఉన్న ఇంటి నిర్మాణం

అధిక యూరియా.. అనర్థదాయకం

● శ్రీహరి, వ్యవసాయాధికారి, సంగం



సంగం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): వరి సాగులో అధిక యూరియా వాడకం అనర్థదాయకం అని, సేంద్రియ ఎరువులు వాడాలని మండల వ్యవసాయాధికారి శ్రీహరి సూచించారు.

? రబీ సీజన్‌లో ఎంత విస్తీర్ణంలో ఏ రకం.. వరి వంగడాలు సాగవుతుంది. .

! మండలంలో 12వేల ఎకరాల్లో పంట సాగవుతుంది. ఇప్పటికే 1,300ఎకరాల్లో నాట్లు వేశారు. నెలాఖరు.. డిసెంబరు మొదటివారంలో నాట్లు పూర్తవుతాయి. 135 నుంచి 140 రోజుల్లో కోతకు వచ్చే స్వల్పకాల రకాలను సాగు చేస్తున్నారు.

? రైతుసేవా కేంద్రాల్లో కావలసిన ఎరువులున్నాయా.

! రైతులు ముందుగా నగదు చెల్లిస్తే రైతుసేవా కేంద్రాల ద్వారా తెప్పించి ఒకటి, రెండు రోజుల్లో అందచేస్తున్నాం. ఎక్కువ మంది రైతులు ప్రైవేట్ వ్యాపారుల వద్ద అరువుకు తీసుకుంటున్నారు.

? ఎంఆర్పీ కంటే అధికంగా వసూలు చేస్తే ఏ చర్యలు తీసుకుంటున్నారు.

! నిరంతరం తనిఖీలు చేస్తున్నాం. అధిక ధరకు విక్రయిస్తున్నట్లు రైతులు ఫిర్యాదు చేస్తే విచారించి చర్యలు తీసుకుంటాం.

? దిగుబడులు పెంచేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు.

! మంగళ, బుధవారాలలో రెండు గ్రామాల పొలాలను పరిశీలించి సస్యరక్షణ, అధిక దిగుబడి సాధనకు కృషి చేస్తున్నాం.

బెల్టు దుకాణాలపై ఎక్సైజ్ పోలీసుల దాడులు

కావలి రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): చలంచర్ల పంచాయతీ పేపాలవారిపాలెంలో శనివారం సాయంత్రం రెండు బెల్టు దుకాణాలపై ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో మద్యం అమ్ముతున్న మొగిలిగుండ్ల మాల్యాద్రి, ఎర్రజొన్న కళ్యాణ్‌ను అదుపులోకి తీసుకుని 18 బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు న మోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

శుద్ధిజల కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన

ఉదయగిరి రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం గ్రామ ఎస్సీ కాలనీలో శనివారం శుద్ధిజల కేంద్రం ఏర్పాటుకు ఎంపీడీవో అప్పాజీ గ్రామస్థులతో కలిసి స్థల పరిశీలన చేశారు. శుద్ధిజల కేంద్రం ఏర్పాటుచేసి కాలనీ వాసుల తాగునీటి కష్టాలు తీర్చేందుకు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఐటీడీపీ ఇన్‌చార్జి రెడ్డిబత్తిన ఉమాసాయిరాం, అడుసుమల్లి వెంకటేశ్వర్లు, గొల్లపల్లి భాస్కర్, నరసింహారావు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతి పరిశీలన



విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న ఎంఈవో మస్తాన్‌వలి

ఉదయగిరి రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక యాదవపాళెం ప్రాథమిక పాఠశాలను శనివారం ఎంఈవో షేక్ మస్తాన్‌వలి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల పఠనా, అభ్యసనాల్లో వారి ప్రగతిని పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. సంబంధిత రిజిస్టర్లు తనిఖీ చేసి తగు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహాగర్జనకు తరలిరండి

వలేటివారిపాలెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కందుకూరులో ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు నియోజకవర్గ మాల మహానాడు మాల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరుగనున్న మాలల మహాగర్జన బహిరంగ సభకు మండలంలోని అన్ని గ్రామాల నుండి భారీగా ప్రజలు తరలిరావాలని సంఘం నియోజకవర్గ కార్యదర్శి రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సమస్యల్లో సరిహద్దు గ్రామాలు



కంపచెట్లతో నిండిన పేపాలవారిపాలెం ఎస్సీ కాలనీ రోడ్డు

కావలి రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పేపాలవారిపాలెం, పెద్దారం, లక్ష్మీపురం, బట్లదిన్నె, జువ్విగుంటపాలెం సీతారామనగరం గ్రామాల్లో మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లు, మురుగునీటి కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. చలంచర్ల పంచాయతీ పేపాలవారి పా లెం వెళ్లేందుకు జాతీయ రహదారి నుండి లక్ష్మీపురం వరకు ఉన్న అటవీ ప్రాంతంలో రోడ్డు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేపాలవారి పాలెం, లక్ష్మీపురం వాసులు చెబుతున్నారు. అలాగే పేపాలవారిపాలెం ఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్డులో కంప, చిల్లచెట్ల మధ్య వెళుతున్నారు. అలాగే చలంచర్ల సచివాలయానికి వెళ్లాలంటే రోడ్డు లేక పోవటంతో 2కిలో మీటర్లదూరం కాలి నడకన లేక మోటారు బైక్‌లపై వెళుతున్నారు. చలంచర్ల నుండి పెద్దారం వెళ్లాలంటే 3కిలో మీటర్లు గుంతలు ఉన్న మట్టి రోడ్డులోనే ప్రయా ణిస్తున్నారు. ఈ గ్రామం నుండి చలంచర్ల, కావలి పట్టణానికి రావాలంటే ద్విచక్ర వాహనాలే దిక్కు. జాతీయ రహదారికి 2కిలోమీర్ల దూరం లోని బట్లదిన్నె, జువ్విగుంటపాలెం, సీతారామనగరం గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేదు.

తాళ్లూరి కుటుంబసభ్యులకు మంత్రి, ఎమ్మెల్యేల పరామర్శ

దగదర్తి, (బిట్రగుంట) నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మరణించిన ఏపీ మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ తాళ్లూరి రమణయ్యనాయుడుకు టుంబసభ్యులను శనివారం దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయ ణ రెడ్డి, ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డి పరామర్శించారు. తాళ్లూరి చిత్ర పటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు, ఏపీ సివిల్ సప్లైయ్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామి రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి రమణయ్యనాయుడుకు నివాళులర్పించారు. చివరిగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ప్రతాప్‌కు మార్‌రెడ్డి, బొల్లినేని కృష్ణమనాయుడు, కొమ్మిలక్ష్మీనాయుడు పరామర్శించారు.



తాళ్లూరి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

గండిపాలెం సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

ఉదయగిరి రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గండిపాళెం జలాశయం వద్ద ఉన్న సిద్ధేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం కార్తీకమాసం సందర్భంగా మహిళా భక్తులు వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పొంగళ్లు నిర్వహించి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఉసిరిక చెట్టు కింద సహపంక్తి భోజనాలు చేశారు.



ఉదయగిరి: స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రేపు సహస్ర జ్యోతిర్లింగార్చన

శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయంలో పరమేశ్వరునికి కార్తీకమాసం నాల్గవ సోమవారం సందర్భంగా మహాభస్మాభిషేకం, సహస్ర జ్యోతిర్లింగార్చన సహిత జ్వాలతోరణ కార్యక్రమం జరుగుతుందని శనివారం నిర్వాహకులు ప్రకటనలో పేర్కొన్నారు.

అయ్యప్పస్వామికి అభిషేకాలు

సంగం, నవంబరు 23: స్థానిక సంగమేశ్వరాలయ ప్రాంగణంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయ మొదటి వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామికి సకల ద్రవ్య, క్షీర, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం పద్దెనిమిది మెట్లకు కర్పూరం వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మాఘం గిరిబాబు, సుధా, గ్రామపెద్దలు కర్నాటి రవీంద్ర రెడ్డి, శ్రీరామ్, భక్తులు పాల్గొన్నారు.

పాఠశాలలు శిథిలమైనా తొలగించరా?

వలేటివారిపాలెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గరుకుపాలెం, పెద్దఅమ్మపాలెం, వీరన్నపాలెం, పోకూరు, గాంధీనగర్ తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ భవనాలను తొలగించాలని గ్రామాల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



గరుకుపాలెంలో పాఠశాల భవనం

కావలి కాలువలో పూడికతీత ప్రారంభం

బిట్రగుంట, నవంబరు (ఆంధ్రజ్యోతి): దగదర్తి మండలం చెన్నూరు సమీపంలోని కావలి కాలువ పూడికతీత పనులను శనివారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పూజలు చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కా ర్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి స్థానిక టీడీపీ నేతలు, రైతులు ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కావలి కాలువలో తట్ట మట్టి ఎత్తలేదన్నారు. 900 క్యూసెక్కుల నీటి లభ్యత ఉండాల్సిన కాలువలో 500 క్యూసెక్కులు నీరు సరఫరా కావడం లేదన్నారు. కాలువ చివరి ఆయకట్టు వరకు నీటిని అందించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు అల్లం హనుమంతరావు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

పీహెచ్‌సీ భవనం శిథిలంపై సభ్యుల ఆందోళన

జలదంకి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య అధ్యక్షతన శనివారం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆస్పత్రి పరిధిలోని సర్పంచులు, ఎంపీటీసీలు హాజరై పలు అంశాలపై చర్చించారు. నూతన భవనం నిర్మాణాన్ని రెండేళ్ల కిందట కాంట్రాక్టర్ నిలిపేయడంపై చర్చ కొనసాగించారు. నూతన భవనంలోని గదులు కనీసం శుభ్రం చేయడం లేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ ఏఈ అహ్మద్‌బాషాను ఎంపీపీ ఫోనులో సంప్రదించి నూతన భవనం దుస్థితిపై వివరణ కోరారు. అవసరమైతే కాంట్రాక్టరును మార్చి పనులు పూర్తిచేయించలాని సూచించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని ఏఈ తెలిపారు. సమావేశంలో సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, వైద్యాధికారి

దేవుడి చిత్రపటాలు తగులపెట్టిన వ్యక్తి అరెస్టు

బిట్రగుంట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట, తాళ్ళూరు పంచాయతీల మధ్య అటవీ ప్రాంతంలోని శ్రీవారి నిజపాదాల వద్ద స్వామివారి చిత్రప టాలను తగులపెట్టిన వ్యక్తిని శనివారం పోలీసులు అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్సై బోజ్యా తెలిపారు. ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం శ్రీవారి నిజపాదాల గుడిలో స్వామివారి చిత్రపటాలు తగులపెట్టిన కేసు విచారణలో భాగంగా కొండబిట్రగుంటకు చెందిన కట్ట పకీరయ్యగా తేలిందని ఎస్ఐ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. కొండబిట్రగుంటకు చెందిన కొందరు పశువుల కాపరులు పకీరయ్య గుడి ప్రాంతంలో తిరుగు తున్నాడని చెప్పారు. ఇంటికి వెళ్లమని మందలించినా వెళ్లకుండా గుడి వద్ద మంట పెట్టాడన్నారు. ఇది వరకు ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి ఉత్సవ రథం తగలపెట్టిన కేసులో పకీరయ్యను అరెస్టు చేశారని తెలిపారు.

అంతర్ కళాశాలల పోటీలకు తరలిన విద్యార్థులు

ఉదయగిరి రూరల్, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి): స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో రెండవ, మూడవ సంవత్సరం మొదటి సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులు శనివారం అచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించే అంతర్ కళాశాలల ఆటల పోటీలకు తరలివెళ్లారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి నైరా వ్యవసాయ కళాశాలలో ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే కాలేజ్ స్పోర్ట్స్ గేమ్స్ అండ్ కల్చర్ మీట్‌కు కళాశాల నుంచి 30 మంది విద్యార్థులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జీ.కృష్ణారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.



వాహనాన్ని ప్రారంభిస్తున్న కృష్ణారెడ్డి

బీజేపీ నాయకుల సంబరాలు

కందుకూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించటంపై స్థానిక పార్టీ శ్రేణులు శనివారం కందుకూరులో సంబరాలు చేసుకున్నారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గట్టమనేని హరిబాబు, నాయకులు, చుండి మురళీధర్, బొర్రా కోటేశ్వరరావు, అమలనాథుని మాల్యాద్రినాయుడు, చిన్నిపాండురంగయ్య, మువ్వల భూషయ్య, మాలకొండారెడ్డి పాల్గొన్నారు.



కందుకూరు: మిఠాయిలు పంచుకుంటున్న బీజేపీ నాయకులు

బీజేపీ విజయోత్సవం

కావలి టౌన్, (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయకేతనం ఎగురవేయడంతో స్థానిక బీజేపీ నేతలు శనివారం విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. పార్టీ రాష్ట్ర నాయకులు కందుకూరి సత్యనారాయణ, నేతలు, కార్యకర్తలకు మిఠాయిలు తినిపించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో నేతలు అమరా సుబ్బారావు, బ్రహ్మానందం, సీవీసీ సత్యం, మాల్యాద్రి, కిరణ్ పాల్గొన్నారు.

26న మహాధర్నాను జయప్రదం చేయండి

ఆత్మకూరు, నవంబరు 23: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఈనెల 26 తేదీన స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టనున్న మహాధర్నాలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయు జిల్లా నాయకుడు జివి శివప్రసాద్ కోరారు. స్థానిక డాక్టర్ చెర్లో రమణారెడ్డి స్మారక భవన్‌లో సీఐటీయు, రైతు సంఘాల ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 26వ తేదీన రైతులు, కౌలురైతులు, వ్యవసాయ కార్మికులు ఐక్యమై హక్కుల సాధనకు పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్య క్రమంలో సీఐటీయు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆత్మకూరు నాగయ్య, కొండమూరి హజరత్తయ్య, జిల్లా కౌలురైతు సంఘం నాయకుడు లక్ష్మీ పతి, సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు, రాధ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయు, కౌలురైతు సంఘం నాయకులు

న్యూస్ బాక్స్

అల్లూరు యువకుడికి ఉత్తమ సేవా పురస్కారం



ఉత్తమ సేవాపురస్కారం అందుకుంటున్న పేట రాఘవయ్య

అల్లూరు, నవంబరు 23: స్థానిక పేట రాఘవయ్య అలియాస్ బాబాయ్‌కు పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఉత్తమ సేవా పురస్కారం అందజేశారు. నెల్లూరులోని రేబాల లక్ష్మీ నరసారెడ్డి స్మారక భవనం (టౌన్‌హాల్)లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తాను చేసిన సేవకు ఇంతటి గుర్తింపు లభిస్తుందని అనుకోలేదని హర్షం వ్యక్తం చేశారు. కార్య క్రమంలో ఆయన అభిమానులు పాల్గొన్నారు.

కచ్చిత సమాచారమివ్వాలి

కలిగిరి, న వంబరు 23 (ఆంధ్రజ్యోతి): హౌస్‌హోల్డ్ సర్వేలో ప్రతిఒక్కరూ కచ్చితమైన సమాచారం అందించాలని ఎంపీడీఓ ప్రభావతి తెలిపారు. శనివారం స్థానిక ముస్తాపురంలో జరుగుతున్న ఈ సర్వేను ఆమె పరిశీలించారు. సర్వే కోసం వచ్చిన సిబ్బందికి ఆయా కుటుంబ యజమాని లేదా సభ్యులు పూర్తి సమాచారం అందివాల న్నారు. ఆయా ప్రాంతాలను బట్టి ప్రజల అవసరాలను తీర్చడానికి కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు.

బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం

వలేటివారిపాలెం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహలు చేయడం చట్టరీత్యా నేరం అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. కొండసముద్రం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆడపిల్లలకు 18 ఏళ్లు నిండిన తరువాత వివాహాలు చేస్తే శారీరకంగా, మానసికంగా ఎదుగుదల ఉంటుందన్నారు. తక్కువ వయసులో వివాహం చేస్తే అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పాల్‌జాన్సన్ ఉపాధ్యాయులు రవికుమార్, రేష్మ, శిరోమణి, శిరీషా, పద్మ నయోమి తదితరులు పాల్గొన్నారు.

విపత్తులపై అవగాహన

కావలి టౌన్, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి) స్థానిక జేబీ డిగ్రీ కళాశాలలోని ఎస్ఆర్ శంకరన్ సెమినార్ హాల్‌లో శనివారం జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్) సభ్యులు శనివారం విపత్తులపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌డీఆర్ఎఫ్ సభ్యులు రాజీవ్ దరిపా, సందీప్ కుమార్ రెడ్డిలు తుపానులు, భూకంపం, అగ్నిప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కాలేజి ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ డాక్టర్ మాల్యాద్రి, విశ్రాంత రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, కరస్పాండెంట్ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా గ్రామోత్సవం



కావలిటౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ముసునూరు రామచంద్రకాలనీలోని ట్రంకురోడ్డు వద్ద నున్న అయ్యప్పస్వామి ఆలయం ఆధ్వర్యంలో శనివారం రాత్రి గజవాహనంపై అయ్యప్ప, వినాయక, సుబ్రమణ్యేశ్వర స్వామిల గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొని గ్రామోత్సవం ముందు జోతులు పట్టుకుని అయ్యప్ప నామజపం చేస్తూ ముందుకు సాగారు.

బాల్య వివాహాలపై అవగాహన

బిట్రగుంట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ముంగమూరు పంచాయతీ-1 అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాలపై తల్లులు, కిశోర బాలికలకు శనివారం సీడీపీవో సౌజన్య అవగాహన కల్పించారు. అనంతరం బాల్య వివాహాల అరికట్టడంపై తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీ టీసీ లలితమ్మ, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, అంగన్వాడీ సూపర్‌వైజర్ కోటేశ్వరి ఉన్నారు.